మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 77 • పేజీలు:12+16 • వెల: రూ.5 గురువారం • 15-2-2018 www.manamnews.com /manamnews



బుల్లిరామయ్య కన్నుమూత

- నాలుగు సార్లు ఎంపీ.. కేంద్ర మాజీమంత్రి
- ఆంధ్రా షుగర్స్ చైర్మన్.. మేనేజింగ్ డైరెక్టర్
- వివాద రహితుడు.. రాజకీయాల్లో సౌమ్యుడు
- సీఎం బాబు.. స్పీకర్.. మంత్రుల సంతాపం

ఏలూరు, ఫిబ్రవరి 14 (మనం న్యూస్ బ్యూరో):

కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా షుగర్స్ సీఎండీ బోళ్ల బుల్లి రామయ్య (92) అనారోగ్యంతో పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని తన స్వగృహంలో మరణించారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. పరిస్థితి విషమించి బుధవారం ఉదయం కన్ను మూశారు. 1984 నుంచి ఏడు సార్లు ఎంపీగా పోటీచేసి 4 సార్లు గెలిచిన బుల్లిరామయ్య.. ఒకసారి కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. 1953లో ఆంధ్రా షుగర్స్ లో చేరిన ఆయన.. అప్పటినుంచి వివిధ హోదాలలో మిగతా 6లో..

నమోదుకు నానాతిప్పలు

ఫార్మసీ పూర్తయినా ఫలితం కోసం ఆందోళన.. కౌన్సిల్ లేక విద్యార్థుల అవస్థ

- రిజిస్ట్రేషన్ కోసం గుంటూరుకు తప్పని ప్రయాణం
- నాంపల్లిలోని ఫార్మసీ కార్యాలయానికి తాళం
- ముంచుకొస్తున్న టీఎస్‌పీఎస్సీ తుది గడువు
- పట్టించుకోని తెలుగు ప్రభుత్వాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి):

అధికారుల అలసత్వమో.. పాలకుల నిర్లక్ష్యమో.. గానీ ఆందోళన మాత్రం విద్యార్థుల వంతయింది. ఏడాది కాలంగా డీ ఫార్మసీ విద్యార్థులు నానా తిప్పలు పడుతున్నారు. కోర్సు పూర్తి చేసి.. ఉత్తీర్ణత సాధించినా.. చేతిలో పట్టా ఉన్నా.. అది నిరుపయోగమే అయ్యింది. 'సూసుకోని మురువ.. చెప్పుకోని ఎడవ్వ' అన్న చందంగా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సాధించుకున్న సర్టిఫికెట్ ఎందుకు పనికిరాని చిత్తుకాగితమైంది. కండ్ల ముందు 238 ప్రభుత్వ పోస్టుల అవకాశం ఉన్నా.. దరఖాస్తు చేసుకునే వీలు లేక డీ ఫార్మసీ అభ్యర్థులు విలవిల్లాడిపోతున్నారు. ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేకపోవడమే దీనికంతటికి కారణం.





ఇదీ పరిస్థితి..

ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రభుత్వోద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలంటే తమ సర్టిఫికేటను తప్పనిసరిగా ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ మిగతా 6లో..



మోసం గురూ!

పంజాబ్ నేషనల్ బ్యాంకుకు సున్నం

- 11వేల కోట్ల ఆగంతుక లావాదేవీలు
- 2017 నికర లాభానికి 8 రెట్లు అధికం
- 'వజ్ర' కోటీశ్వరుడు నీరవ్ మోదీ లీల
- 'గీతాంజలి' ఆభరణాల కంపెనీ పాత్ర
- ఇప్పటికే 280 కోట్ల గోల్‌మాల్‌పై కేసు
- ముంబైలోని శాఖ పరిధిలో వ్యవహారం
- సీబీఐకి తాజా ఫిర్యాదు చేసిన పీఎన్‌బీ

7లో..



ఇదీలోకం!



సారుకు రెండేళ్లు జైలు శిక్ష పడిందట.. ఇంటికి ఓ అరగంట లేటుగా వస్తానని చెప్పమన్నారు మేడమ్..!





త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ

పది రోజుల్లో గడ్డి విత్తనాల సరఫరా

- ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలుకు అనుమతి
- త్వరలో సొసైటీలకు ఎన్నికలు: తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి):

కామారెడ్డి, కొమురంభీం, ఆసిఫాబాద్, జగిత్యాల జిల్లాల్లో లిస్ట్-ఏ లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ పూర్తయ్యిందని, త్వరలోనే లిస్ట్-బి లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర పాడిపరిశ్రమల శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, మిగతా 6లో..

మన స్టెంట్లదే హవా

స్వదేశీ కంపెనీలపై పెరిగిన విశ్వాసం.. మార్కెట్‌లో 61% వాటా వీటిదే

- విదేశీ స్టెంట్లకు తగ్గిన డిమాండు
- ఎన్‌పీపీఏ లెక్కలలో వెల్లడి

ముంబై, ఫిబ్రవరి 14:

భారతీయ మార్కెట్లలో ఎక్కువగా అమ్ముడయ్యేవి విదేశీ స్టెంట్లేనని అంతా అనుకుంటారు. కానీ, గడిచిన సంవత్సరం.. అంటే 2017 మొత్తమ్మీద మన దేశంలో వాడిన స్టెంట్లలో 61% అచ్చంగా భారతదేశంలో తయారైనవేనట. ఈ విషయాన్ని స్వయంగా నేషనల్ ఫార్మాస్యూటికల్స్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) చైర్మన్ భూపేంద్ర సింగ్ వెల్లడించారు. సర్వసాధారణంగా మన దేశంలో వాడేవాటిలో 70% వరకు ఫారిన్ స్టెంట్లే ఉంటాయని అంతా అనుకుంటారు. కానీ అబాట్, మెడ్‌ట్రానిక్, బోస్టన్ లాంటి మిగతా 6లో..



వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో గురువారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 58 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య రా.2.35 తదుపరి పాడ్యమి; నక్షత్రం: శ్రవణం ఉ.7.28 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ.11.51-1.36; దుర్ముహూర్తం: మ.3.11-4.43; రాహుకాలం: మ.1.56-3.22; అమృతఘడియలు: రా.10.22-12.06.

సూర్యోదయం: 6.47

సూర్యాస్తమయం: 6.14



ఏవోబీలో అలజడి

మన్యంలో ఎదురుకాల్పుల కలకలం

- మావోయిస్టు ప్లీనరీపై పోలీసుల దాడి
- కాల్పులు జరుపుతూ నేతల పరారీ
- తృటిలో తప్పించుకున్న అగ్ర నాయకులు
- ప్లీనరీలో ఆర్కే.. గాజర్ల రవి ఉన్నట్లేనా?
- భారీ సంఖ్యలో కిట్‌బ్యాగులు లభ్యం
- పోలీసు బలగాల ముమ్మర కూంబింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (మనం న్యూస్ బ్యూరో):

ఉన్నట్టుండి బూట్ల చప్పుడు.. తుపాకీ మోతలు.. అడవిలో అంతా కలకలం.. ఏం జరిగిందోనని మన్యం వాసులు కలవరపడ్డారు. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా ఏవోబీ ప్రాంతంలో మిగతా 6లో..

వారితో కలవం

కాంగ్రెస్, టీఆర్ఎస్ దొందూ దొందే

25ఏండ్లుగా పొత్తులతో నష్టపోయాం

ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజల్లోకి

- స్పష్టం చేసిన తమ్మినేని

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి):

కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు ఒక తానులోనివేనని, వాటితో కలిసే ప్రసక్తే లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా తిరిగి ఎన్నికైన తమ్మినేని వీరభద్రం స్పష్టంచేశారు. ఇప్పటికే 29 పార్టీలు, ప్రజాసంఘాలతో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటు చేశామన్నారు. భావసారూప్యత కలిగిన మరింత మందిని బీఎల్ఎఫ్‌లో కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో



ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 25ఏండ్లుగా పొత్తులతో పార్టీ నష్టపోయిందన్నారు. ఇకపై అటువంటివి చేయకుండా ప్రత్యామ్నాయ మిగతా 6లో..



ఇకపై సినిమాల్లో నటించను

తమిళ ప్రజలకు సేవ చేస్తా: కమల్‌హాసన్

7లో..

ఇండియన్ ముజాహిదీన్

ఉగ్రవాది అరెస్టు

బాట్లాహౌస్ ఎన్‌కౌంటర్‌లో పరారైన అరీజ్

నేపాల్ సరిహద్దుల్లో అదుపులోకి



వాలెంటైన్స్ డే వేడుకలను నిషేధించాలంటూ హైదరాబాద్‌లో బుధవారం నిరసన తెలియజేస్తున్న బజరంగ్ దళ్ కార్యకర్తలు

చిక్కుల్లో 'వాలుచూపుల వయ్యారి'

- మలయాళ పాటతో మనోభావాలపై దెబ్బ
- హైదరాబాద్‌లో ముస్లిం యువకుల కేసు



హైదరాబాద్, ఫిబ్రవరి 14: వాలుచూపులతో కుర్రాళ్లకు గాళమేసి.. ఒక్క రోజులోనే ఇంటర్నెట్ స్టార్ అయిపోయిన ప్రియా వారియర్ చిక్కుల్లో పడింది. మలయాళ చిత్రం ఒరు ఆదర్ లవ్‌లోని 'మాణిక్య మళరాయ పూవి' పాటతో ప్రేమికుల దినోత్సవం ముందు రోజు నుంచి ఇంటర్నెట్‌ను కుదిపేస్తున్న నటి ప్రియా వారియర్‌పై హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాలో కేసు నమోదైంది. ఆ పాట తమ మనోభావాలను దెబ్బ తీస్తోందంటూ కొందరు ముస్లిం యువకులు ఫిర్యాదు చేశారు. మహ్మద్ ప్రవక్త.. ఆయన భార్య ఖాదిజా బివిల పవిత్ర ప్రేమకు సంబంధించిన పాటను ఈ చిత్రంలో పెట్టారని పేర్కొంటూ దీని ఆంగ్ల అనువాదాన్ని కూడా పోలీసులకు అందజేశారు. ప్రవక్తకు సంబంధించిన పాటను అసభ్యకర చిత్రీకరణతో సినిమాలో పెట్టడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు ఒమర్ లూలూతోపాటు నటి ప్రియా వారియర్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదులో కోరారు. దర్శకుడు సహా చిత్ర యూనిట్‌లో ఎక్కువ మంది ముస్లింలు ఉండి కూడా ఇలా వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. ఫలక్‌నుమాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మహ్మద్ అబ్దుల్ ముఖీత్ ఖాన్, అతడి సోదరుడు అబ్దుల్ కౌసర్ సహా 57 మంది యువకులు సంతకాలతో ఈ ఫిర్యాదును అందజేశారు. కాగా, సెక్షన్ 259 (మత విశ్వాసాలను కించపరచడం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఫలక్‌నుమా ఏసీపీ అబ్దుల్ బరీ తెలిపారు. ఇస్లాం మత పెద్దలతో పాటు మలయాళం, ఉర్దూ, ఇంగ్లిషు భాషల్లో నైపుణ్యం కలిగిన వారితో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఫిర్యాదు విషయమై ఇప్పటికే కేరళ పోలీసులతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.



ప్రసూతికి వస్తే ప్రాణం పోయింది

- బిల్లు చెల్లించిన తర్వాత విషయం వెల్లడి
- ఠాగూర్ సినిమాను తలపించిన ఘటన

హైదరాబాద్/సైదాబాద్, ఫిబ్రవరి 14 (మనం న్యూస్): చిరంజీవి నటించిన ఠాగూర్ సినిమాలోని ఆస్పత్రి సన్నివేశాన్ని తలపిస్తూ హైదరాబాద్‌లో ఓ ఘటన జరిగింది. ప్రసూతికి అని ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళ ప్రాణం కోల్పోతే, ఆమె కుటుంబసభ్యులు బిల్లు చెల్లించిన తర్వాత ఆస్పత్రి యాజమాన్యం వారికి అసలు విషయం చెప్పారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన ప్రవీణ్, బిల్గెట్ హాచార్ వారం రోజుల క్రితం ప్రసూతి కోసం మలక్‌పేట్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె పండంటి బిడ్డకు జన్మనిచింది, తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. మొత్తం రూ.10లక్షల బిల్లు కట్టించారు. కుటుంబం అంతా సంతోషంలో ఉండగా, ఠాగూర్ సినిమాను తలపిస్తూ చావుకబురు చెప్పారు. బిడ్డకు జన్మనిచ్చి తల్లి మరణించందని వైద్యులు చెప్పారు. ఈ వార్త విన్న కుటుంబసభ్యులు కుదేలయ్యారు. ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. క్షేమంగా ఉన్న నాబిడ్డను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి ఏం చేశారో తెలియదని, తాను ఓ ఆస్పత్రిలో పని చేస్తున్నానని చెప్పినా, తనను ఆపరేషన్ థియేటర్‌లోకి అనుమతించలేదని మృతురాలి తల్లి చెప్పారు. తన కూతురి మరణానికి కారణమైన యశోద ఆస్పత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరారు.

లాభదాయక పదవులపై వివరణ ఇవ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు బెంచ్ ఆదేశాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం లీగల్ ప్రతినిధి): రాష్ట్రంలో పలువురు రిటైర్డు అధికారులు, అధికార పార్టీ నేతలు లాభదాయక పదవుల్లో క్యాబినె ట్ ర్యాంకుల్లో కొనసాగడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందిం చింది. ఢిల్లీలో ఆప్ ఎమ్మెల్యేలు 20 మందిపై కేంద్ర ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసిన నేపథ్యంలో తెలంగాణలో పలువురికి క్యాబినెట్ హోదా ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ రేవంత్‌రెడ్డి దాఖలుచేసిన పిల్‌ను హైకోర్టు న్యాయ మూర్తులు వి.రామసుబ్రమణియన్, అమర్‌నాథ్‌గౌడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. ప్రతివాదులంతా తమ వాదనలతో వచ్చే నెల 14లోగా కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని బెంచ్ ఆదేశించింది. గతంలో నోటీసులు జారీ చేసినా అందని వారికి పిటిషనర్ రేవంత్‌రెడ్డే అందజేసేందుకు బెంచ్ అనుమతించింది. రాజ్యాంగంలోని 164(1ఎ) అధికరణం ప్రకారం శాసనసభ్యుల్లో 15 శాతానికి మించి క్యాబినెట్ హోదా పొందకూడదని, అందులోనే సీఎం కూడా ఉండాలన్న నిబంధనను తెలంగాణ సర్కార్ ఉల్లంఘించిందని రేవంత్‌రెడ్డి లాయర్ వాదించారు. టీఆర్ఎస్ నేతలు పలువురికి క్యాబినెట్ ర్యాంక్ ఇవ్వడంతోపాటు జీతభత్యాలు చెల్లించడం రాజ్యాంగ వ్యతిరేకమని పిటిషనర్ ఆరోపించారు. అయితే, ఈ కేసు విచారణ మార్చి 14కి వాయిదా పడింది.

అశోక్ బాబుకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం లీగల్ ప్రతినిధి): హైదరాబాద్ గన్‌ఫౌండ్రీ ఏరియాలో ఉన్న ఏపీ ఎన్జీవో సంఘ భవనంలో నాలుగు గదులు, ఒక హాలు భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘానికి ఇవ్వాలన్న తమ ఆదేశాల్ని అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కారంగా ఎందుకు పరిగణించకూడదో స్పష్టంచేయాలని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబుకు హైకోర్టు నోటీసు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల్ని అమలు చేయలేదంటూ భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్.. అశోక్‌బాబుకు నోటీసు జారీ చేసింది.

కోదండరాంతో రేవంత్ రెడ్డి భేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): తెలంగాణ పొలిటికల్ జేఏసి చైర్మన్ కోదండరాంను కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి బుధవారం నాడు ఆయన నివాసంలో కలుసుకున్నారు. సోదరుడి తనయుడి వివాహానికి ఆహ్వానించేందుకే తాను కోదండరాంను కలుసుకున్నట్లు రేవంత్ తెలిపారు. రేవంత్, కోదండరాం ఏకాంతంగా కొద్దిసేపు చర్చలు జరిపారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై వీరు చర్చించినట్లు తెలిసింది. రేవంత్ వెంట వేం నరేందర్ రెడ్డి, రాజారాం యాదవ్ ఉన్నారు. త్వరలో రాజకీయ పార్టీ పెడుతున్న కోదండరాంతో రేవంత్ సమావేశంకావడంతో ఆసక్తి నెలకొంది. తమ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యంలేదని రేవంత్ చెప్పారు.

అవన్నీ తప్పుడు ప్రచారాలే: దాసోజు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు వస్తున్న వార్తలను కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఖండించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారంచేస్తున్న వారిపై ఆయన పోలీసులకు ఫిర్యాదుచేశారు. తన సోషల్ మీడియా అకౌంట్లను హ్యాక్ చేసి, తనే పెట్టినట్లుగా పోస్టింగ్ పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో బీసీలకు అన్యాయం జరుగుతుందని, దీనికి నిరసనగా తాను పార్టీ వీడుతున్నట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దీని వెనక అధికార పార్టీ కుట్ర దాగి ఉందని శ్రవణ్ సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో తన ఎదుగుదలనుచూసి ఓర్వలేక, బలిపశువును చేసేందుకే ఇలాంటి వార్తలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను అస్థిర పరచాలన్న కుట్రలో ఇది భాగమై ఉండొచ్చని దాసోజు ఆరోపించారు.

టీఎస్ఐపాస్‌తో పెట్టుబడుల ఆకర్షణ

- ఖమ్మం ఉక్కు పరిశ్రమకు సహకరించండి
- ఇంటర్నేషన్ మైనింగ్ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్
- సమస్యలు పరిష్కరిస్తాం: నరేందర్‌సింగ్ తొమర్
- భద్రతకు ప్రాధాన్యమివ్వండి: గవర్నర్ నరసింహన్



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి): టీఎస్ ఐపాస్ ద్వారా మైనింగ్ రంగంలో పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. మైనింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఫిక్కీ , తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ కన్వెషన్ సెంటర్‌లో (హెచ్ఐసీసీ) ఇంటర్నేషనల్ మైనింగ్ కాన్ఫరెన్స్ కమ్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమయ్యింది. కేంద్ర గనుల శాఖ మంత్రి నరేంద్రసింగ్ తొమర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఈ కార్యక్ర



మానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే తెలంగాణలో బొగ్గు గనులు అధికంగా ఉన్నాయన్నారు. గనుల్లో పని చేసే కార్మికుల రక్షణ కోసం ఆధునికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని తెలిపారు. మైనింగ్ ఇండస్ట్రీకి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఖమ్మంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో అత్యుత్తమ ఇసుక పాలసీ అమలు చేస్తున్నామన్నారు. 2016–17 సంవత్సరానికిగాను మైనింగ్ రంగంలో రెవెన్యూ రూ.3,170 కోట్లు వచ్చిందని, 2017–18లో రూ. 3500 కోట్లు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. తెలంగాణలో ఖనిజాల తవ్వకాల్లో డ్రోన్, జియో ట్యాగింగ్ లాంటి టెక్నాలజీని ఉపయోగించాల్సిన అవసరముందన్నారు.

ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తొమర్ మాట్లాడుతూ మైనింగ్ రంగం దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. దేశ జీడీపీలో మైనింగ్ రంగానిది అగ్రస్థానమని చెప్పారు. ఎక్కువ ఖనిజాలు ఉన్న చోటే పేదరికం కూడా ఉందన్నారు. ఈ అసమానతలను తొలగించాల్సిన అవసరముందన్నారు. మైనింగ్ శాఖ పారదర్శకంగా పనిచేస్తుందని, దేశంలో ఏరాష్ట్రంలోనైనా మైనింగ్ రంగంలో సమస్యలొస్తే కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ.. గనుల్లో పని చేసే కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మైనింగ్ వల్ల ప్రభావితమయ్యే గ్రామాల్లో ప్రజలకు సరైన పరిహారం ఇవ్వాలని సూచించారు. పరిహారం వివరాలు పారదర్శకంగా వెబ్‌సైట్లలో పెట్టాలన్నారు. మైనింగ్ వల్ల పర్యావరణానికి హాని కలుగకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, సంపదతో ఆరోగ్యం రాదని సూచించారు. తెలంగాణలో మాదిరిగా ఇతర ప్రాంతాల్లో మైనింగ్ రంగంలో టెక్నాలజీని వాడుకోవాలన్నారు. దేశ, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను మైనింగ్ రంగం ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. తెలంగాణలో ఉన్న ఖనిజ సంపద వివరాలతో గనులు, భూగర్భ వనరుల శాఖ ప్రత్యేకంగా రూపొందించిన నివేదికను ఈ సదస్సులో గవర్నర్ ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో కేంద్ర మైనింగ్ శాఖ సెక్రటరీ అరుణ్‌కుమార్, రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఏకే కటారి, బీఆర్‌వీ సుశీల్ కుమార్, సుభాష్‌రెడ్డి, భారత్ సహా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికాకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పోడు భూములు లాక్కుంటున్నారు

- హరితహారం పేరుతో అన్యాయం
- కల్తీవిత్తనాల వెనక టీఆర్ఎస్ ఎమ్మెల్సీ: బలరాం నాయక్
- ప్రభుత్వాలు రైతులను ముంచుతున్నాయి: సురేశ్‌రెడ్డి




హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి) : హరితహారం పేరుతో రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల పొట్టకొడ్తుందని కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్ విమర్శించారు. గాంధీభవన్లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వంలో పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలను పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను హరితహారం పేరుతో లాక్కుంటుందని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో అటవీశాఖాధికారులు పోలీసులతో కలిసి గిరిజనులను వేధిస్తున్నారన్నారు. ప్రభుత్వం గిరిజనుల సంక్షేమంటూనే వారి జీవనోపాధిని దెబ్బతీసేలా పోడు భూములను గుంజుకుంటుందన్నారు. దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. మిర్చి, పత్తి, చివరకు వరిలోనూ నకిలీ విత్తనాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. నకిలీ విత్తనాల వెనుక టీఆర్ఎస్ ఎమ్మెల్సీ హస్తం ఉందని ఆరోపించారు. నాలుగేండ్లలో ఏనాడైనా రైతు సమస్యలపై సీఎం కేసీఆర్ సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాములు నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లో నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారులతో కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నాయని మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి ఆరోపించారు. రైతులు గిట్టుబాటు ధర ఇచ్చే ప్రయత్నం కేంద్ర బడ్జెట్లో చేశారు. కానీ తెలంగాణలో రైతులు రోడ్ల మీదకొస్తున్నారని విమర్శించారు. గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తనకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. గత ప్రభుత్వమంటూ కాంగ్రెస్‌మీద నెపం వేసేందుకే సమీక్షలంటూ కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. మద్దతు ధర కోసం రూ. 2వేల కోట్లు బడ్జెట్లో పెడ్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టీఆర్ఎస్ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులకు ప్రాధాన్యతఇవ్వలేదన్నారు. ఎర్రజొన్న, పసుపు రైతుల కోసం 15 రోజులు ధర్నా చేసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. గిట్టుబాటు ధర అడిగిన రైతులకు బేడీలు వేసిన ఘనత టీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈరపత్రి అనిల్ మాట్లాడుతూ నెల నుంచి ఆందోళనలో రైతులున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. కాంగ్రెస్ హయంలో రైతుల సంక్షేమంతో పాటు నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. యువ రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. రేపు ఆర్మూర్‌లో ఎం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు.

సుబాబుల్ రైతులను ఆదుకుంటాం

కనీస మద్ధతు ధర అందిస్తాం: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి) : మద్దతు ధర అందకపోవటానికి ఉన్న దళారీ వ్యవస్థను తొలగించేలా చర్యలు చేపడతామని, దళారి వ్యవస్థ ప్రక్షాళనకు నడుం బిగిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆంధ్ర ప్రాంతంలో లభించే మద్దతు ధర తెలంగాణ ప్రాంతంలో కూడా అందేలా చర్యలు ఉంటాయన్నారు. సుబాబుల్ రైతుల కష్టాలు, మద్దతు ధర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణా ప్రాంతంలో సుబాబుల్ సాగు చేసే రైతులు పడుతున్న కష్టాలు, కనీస మద్దతు ధర అందక పడుతున్న తీవ్ర ఇబ్బందులను పరిష్కరిస్తామని అన్నారు. ఐటీసీ సంస్థ నియమించిన ఏజెంట్లు,దళారులను తొలగిస్తామని, ఆ కంపెనీ అందించే రూ. 4508 మద్దతు ధరకు రూ. 4000 రైతుకు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. సుబాబుల్‌ను ఐటీసీ నేరుగా కొనేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరకు అందించిన 15 రోజులలో మద్దతు ధర ప్రకారం రైతులకు డబ్బు అందేలా చూస్తామన్నారు. రైతులకు ఐటీసీ కంపెనీ మధ్య సమన్వయానికి ఒక నోడల్ ఆఫీసర్ నియమిస్తామన్నారు

ఈ ఏడాది 52 ఆర్వోబీల నిర్మాణం

రాష్ట్రంలో ఉన్న 460 రైల్వే లెవల్ క్రాసింగ్ ఆర్వోబీల నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ శ్రీకారం చుట్టింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 52 ఆర్వోబీల నిర్మాణం పూర్తిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పించారు. ఇందుకోసం రూ.2700 కోట్లతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. రైల్వేశాఖ, రాష్ట్రప్రభుత్వం 50:50 నిష్పత్తిలో ఈ ఖర్చును భరించనున్నాయి. మంత్రి హరీశ్‌రావు, మహేందర్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్, రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి రాష్ట్రంలోని ఆర్వోబీల నిర్మాణం, తదితరాలపై తుమ్మల బుధవారం నాడు సమీక్షించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, భూసేకరణ, రైల్వే, ఆర్ అండ్ బీ అధికారుల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. భూసేకరణకు సంబంధించి జిల్లా కలెక్టర్లతో తుమ్మల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నాలుగు వరుసల రహదారుల నిర్మాణాలు చేపడుతున్నందున 4 వరుసల ఆర్వోబీల నిర్మించేందుకు రైల్వేశాఖను ఒప్పించారు. నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలకు, ట్రాఫిక్ జామ్ ఉన్న ఆర్వోబీల పునరుద్ధరణకు నిధులు సమకూర్చాలని రైల్వే జీఎం వినోద్ కుమార్ యాదవ్‌ను తుమ్మల కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆర్వోబీల నిర్మాణానికి, రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు నివారించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. మియాపూర్–పటాన్‌చెరువు ప్రాంతంలో రైల్వే టెర్మినల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మెదక్ అక్కంపల్లి రైల్వేలైన్, ఎంఎంటీఎస్ నిర్మాణం పూర్తవుతుందని తుమ్మల పేర్కొన్నారు.


భూ నష్టపరిహారం చెల్లించాల్సిందే

- ఆరు విడతల్లో అందించాలి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం లీగల్ ప్రతినిధి): పలు అవసరాల కోసం రైతుల నుంచి సేకరించి భూములకు ఇవ్వాల్సిన రూ.457.78 కోట్లను ఈ ఏడాది చివరి నాటికి తెలంగాణ సర్కార్ చెల్లించాల్సిందేనని హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి డిసెంబరు 31 తేదీ వరకు ఆరు విడతల్లో రైతులకు భూపరిహార చెల్లింపులు చేయాలని ఆదేశాలిచ్చింది. భూపరిహారం చెల్లించాలని తామిచ్చిన ఆదేశాల్ని జిల్లా కలెక్టర్ అమలు చేయడం లేదని, దాంతో రైతులు దాఖలు చేసే ఎగ్జిక్యూషన్ పిటిషన్లు (ఈపీ) కారణంగా కేసులు పేరుకుపోతున్నాయని పేర్కొంటూ పాలమూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.వెంకటకృష్ణయ్య రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి విచారణ చేపట్టింది. బుధవారం మరోసారి పిల్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ విచారించి తెలంగాణ సర్కార్ చెల్లించాల్సిన భూపరిహారంపై కీలక ఉత్తర్వులిచ్చింది. గత ఆదేశాల మేరకు తెలంగాణ సర్కార్ తాము రూ.458 కోట్లు చెల్లించాలని తెలిపింది. ఏపీ సర్కార్ రూ.62 కోట్లు మాత్రమే రైతులకు బకాయిలున్నామని చెప్పింది. ఏపీ తెలిపిన సమాచారంపై హైకోర్టు అనుమానాన్ని వెలిబుచ్చింది. పలు ప్రాజెక్టుల పేరుతో భారీగా భూసేకరణ జరుగుతుంటే ఈపీలు, రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఇంత తక్కువగా ఉన్నాయా అనే అనుమానాన్ని బెంచ్ వ్యక్తం చేసింది. దాంతో, తెలుగు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న ఈపీల వివరాలు, రైతులకు ఏమేరకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలో పూర్తి వివరాల్ని వచ్చే మార్చి మాసాంతానికి తమకు నివేదించాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. తెలంగాణలోని 31 జిల్లాల్లో 1669 ఈపీలు పెండింగ్‌లో ఉన్నవాటికి రూ.457.78 కోట్లు బకాయిలు చెల్లించాల్సివుందని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైకోర్టుకు నివేదించారు. ఇరిగేషన్, హౌసింగ్, ఆర్అండ్‌బీ శాఖలవే ఎక్కువగా ఉన్నాయని, వచ్చే బడ్జెట్‌లో బకాయిల చెల్లింపులకు నిధుల కేటాయింపులు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో గత నెల నాటికి 918 ఈపీలు మాత్రమే పెండింగ్‌లో ఉంటే వాటికి రూ.62.88 కోట్లు బకాయిలు చెల్లించాల్సివుందని ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ హైకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీనిపై బెంచ్ సందేహాన్ని వ్యక్తం చేయడంతో ప్రభుత్వ ప్రత్యేక లాయర్ కల్పించుకుని భూసేకరణ బాగా ఉన్నప్పటికీ అవి ఈపీల దశకు చేరలేదన్నారు. విచారణ ఏప్రిల్‌కు వాయిదా పడింది.

సమస్యల సుడిగుండంలో రైతాంగం

- టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): కంది, ఎర్రజొన్న, జామాయిల్, సుబాబుల్, తదితర పంటలు పండించిన రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీ టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కంది, ఎర్రజొన్న పంటలకు సకాలంలో మద్దతు ధర ప్రకటించని రాష్ట్ర ప్రభుత్వం, వైఫల్యాన్ని కేంద్రంపై నెట్టడానికి యత్నిస్తోందన్నారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే ప్రభుత్వం రైతులకు రూ.120 కోట్లు బకాయి పడిందన్నారు. కందులకు కర్ణాటక ప్రభుత్వం రూ.6 వేలు(క్వింటాకు) చెల్లిస్తుంటే, రాష్ట్రంలో రూ.4 వేలు చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వం కంది రైతుల జాబితా తయారు చేయించి, క్వింటాకు రూ.6వేలు చెల్లించాలన్నారు. ఎర్రజొన్నకు ఢిల్లీ వ్యాపారులు రూ.2800 చెల్లిస్తామంటుంటే, ఇక్కడి దళారులు రైతుల నుంచి రూ.1800కే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఖమ్మంలో జామాయిల్, సుబాబుల్ రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. పంటను అమ్మేందుకు బీపీఎల్ మిల్లు వద్దకు వచ్చిన రైతులను రెండు మూడ్రోజులపాటు ఉంచేస్తున్నారన్నారు.రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించేందుకు సమయం ఇవ్వాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు బుధవారం లేఖ రాశామని రావుల తెలిపారు.



ఎంఐఎం హఠావో.. హైదరాబాద్ బచావో

- రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏం చేసింది ?: బీజేపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఎంఐఎం పార్టీ ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే అని, అసలు ఆ పార్టీ ఎందుకు పనికి వస్తుందని బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణసాగర్ ప్రశ్నించారు. 70 ఏళ్ల చరిత్ర ఉన్న ఎంఐఎం పాతబస్తీకే పరిమితమైందని, ఆ పార్టీ నాయకులు ముస్లిం ప్రతినిధులు కారని ఆయన అన్నారు. భారత ముస్లింలకు ఎంఐఎం పార్టీతో అవసరం లేదని, వాళ్లంతా సురక్షితంగా ఉన్నారని, దేశంలో వాళ్లకు ఎలాంటి అన్యాయం జరగడం లేదని ఆయన అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలోని ప్రజల పరిస్థితి గురించి, అక్కడ జరుగుతున్న అన్యాయాలపై ఓవైసీ దృష్టి పెడితే బాగుంటుందని ఆయన హితవు పలికారు పాతబస్తీలో ముస్లిమ్ ప్రజల శ్రేయస్సు కోసం బీజేపీ కృషి చేస్తుందని, వచ్చే ఎన్నికల్లో అక్కడ విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎంఐఎం హఠావో.. హైదర్‌బాద్ బచావో అనే నినాదంతో బీజేపీ పనిచేస్తుందని చెప్పారు. భారత సైన్యానికి మతాలు, కులాలు ఉండవని, భారతీయత ఒక్కటే ఉంటుందని, దేశ సైనికుల విషయంలో దిగజారుడు మాటలు మరోసారి మాట్లాడకూడదని ఓవైసీని హెచ్చరించారు. భారత సైనికులపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఓవైసీ తక్షణమే వారికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు ప్రమాణాలను పెంచే విధంగా కేంద్రం బడ్జెట్ రూపొందిస్తే, టీఆర్ఎస్ నాయకులు అనవసరంగా విమర్శలు చేస్తున్నారని కృష్ణసాగర్ రావు అన్నారు. 57,600 కోట్లు వ్యవసాయానికి, ఫిషరీస్, యానిమల్ హస్బండరీలకు 10 వేల కోట్ల రూపాయలను ఈ సారి బడ్జెట్‌లో కేటాయించమన్నారు. కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం.. బట్ట కాల్చి కేంద్రంపై వేస్తుందని, నెపం కేంద్రానిపై నెట్టుతూ, ఏం జరిగినా కేంద్రానిదే బాధ్యత అని టీఆర్ఎస్ నాయకులు తప్పించుకుంటున్నారని ఆయన అన్నారు. ఆకాశానికి హద్దు లేదు, టీఆర్ఎస్ నాయకుల మాటలకు పద్దు లేదని, అసత్య ప్రచారాలు, అబద్ధపు హామీలతో టీఆర్ఎస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం.. రైతులను ఓటర్లుగా మాత్రమే చూస్తుందని, వారిని అన్నదాతలుగా చూడలేకపోతుందని తెలిపారు. మొదట ప్రభుత్వం ఏం చేసిందో మంత్రి హరీశ్ రావు చెప్పి, ఆ తర్వాత కేంద్రం గురించి మాట్లాడితే బాగుంటుందని తెలిపారు. రెండు వారాల్లో ప్రభుత్వం ఏపీఎమ్‌సీల జాబితా నుంచి తక్కువ జీవిత కాలం ఉంటే పంటలను తొలగించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో కలిసి ధర్నాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.



మేడారం.. జాతీయ ఉత్సవం

- కేంద్రం ఆ మేరకు గుర్తింపు ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ఏర్పాట్లు చేయాలి
- తాత్కాలిక నిర్మాణాలు అనవసరం
- సీపీఐ కార్యదర్శి నారాయణ సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 14: మేడారం జాతరను జాతీయ ఉత్సవంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ డిమాండ్ చేశారు. మేడారం ప్రాంతంలో పర్యటించి అక్కడ భూస్వాములు, రాజులపై ఆదివాసీల చారిత్రక పోరాటాన్ని, కరువు ప్రభావిత ప్రాంతంలో బలవంతంగా పన్నులు వసూలు చేసిన వైనాన్ని ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వివిధ వర్గాల ప్రజలు, భక్తులతో మాట్లాడి అక్కడి విషయాలు అవగాహన చేసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాత్కాలిక నిర్మాణాల పేరిట ప్రతి సంవత్సరం ఖర్చు చేసేబదులు అక్కడ రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ఏర్పాట్లుచేయాలని నారాయణ సూచించారు. తిరుపతి, యాదాద్రి లాంటి క్షేత్రాల్లో ఏర్పాటుచేసినట్లే తాగునీరు, ఆరోగ్య కేంద్రం, టాయిలెట్ల లాంటివాటిని ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలన్నారు. జాతర సమయంలో ప్రజలు ఇబ్బంది పడకుండా క్యూలైన్లను కూడా నీడలో ఏర్పాటుచేస్తే బాగుంటుందన్నారు. జాతరకు కేటాయించిన సొమ్ము దానికే ఖర్చుచేయాలని, అలాగే ఆదివాసీల సంక్షేమాన్ని కూడా చూడాలని నారాయణ అన్నారు. ఇక్కడ భక్తులు సమర్పించిన జుట్టును వేలం వేసిన తర్వాత ఆ వచ్చిన సొమ్ములో 30 శాతాన్ని నాయీ బ్రాహ్మణులకు ఇవ్వాలని నారాయణ డిమాండ్ చేశారు.

నయీం కేసు మూసివేతకు కుట్ర

- సీఎం కేసీఆర్ మౌనం వెనుక ఆంతర్యమేంటి ?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): గ్యాంగ్‌స్టర్ నయీంతో పెద్ద పెద్దవారికి సంబంధాలు ఉండడంతో కేసు మూసివేసే కుట్ర జరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. నయీం దుశ్చర్యలకు సహకరించినవారు ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదు, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శాసనసభలో ప్రకటించిన కేసీఆర్, ఇప్పుడు మౌనంగా ఉండడంలో ఆంతర్యమేంటని చాడ ప్రశ్నించారు. నయీం ముఠా గుట్టు రట్టు చేయడానికి డాక్యుమెంట్లు, బ్యాంక్ పాస్ పుస్తకాలు, డైరీలు స్వాధీనం చేసుకున్నామని ప్రకటించిన సిట్, వాటిల్లోని సమాచారాన్ని గోప్యంగా ఉంచడం వెనకున్న ఆంతర్యమేంటని ప్రశ్నించారు. చిన్నాచితక వారిపై కేసులు పెట్టి చేతులు దులుపుకునేందుకు ప్రభుత్వం, సిట్ యత్నిస్తున్నాయని చాడ ఆరోపించారు. నయీం బాధితులు రూ.కోట్ల విలువ చేసే భూములు, ఇండ్లను కోల్పోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల తరపున ప్రభుత్వంపై పోరాటం చేస్తామని చాడ హెచ్చరించారు.

అరచేతిలో మన చరిత్ర

- పాకెట్ సైజులో పుస్తకాలు
- మార్చి 18 నుంచి పంపిణీ
- సమగ్ర తెలంగాణ చరిత్ర
- కేవీ రమణాచారి, దేశపతి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 14: తెలంగాణ చరితను ప్రతీ కుటుంబానికి తెలిపేందుకు మన తెలంగాణ-మన చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణాచారి తెలిపారు. అరచేతిలో ఇమిడే ఈ పుస్తకాలను ఉగాది పర్వదినం మార్చి 18 నుంచి పంచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. సచివాలయంలో బుధవారం సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొన్ని పుస్తకాలను ప్రచురించామని, వాటిలో పాకెట్ సైజ్లో ఉండే మన తెలుగు పుస్తకం విశేషంగా ఆకట్టుకుందని, వేలాదిమంది దాన్ని తీసుకున్నారన్నారు. తెలుగు నెలలు, తిథులు, వారాలు, నక్షత్రాలు, రుతువులు, రాష్ట్ర చిహ్నాలు, తెలంగాణ జిల్లాలపై సంక్షిప్త సమాచారం ఈ పుస్తకంలో ఉందన్నారు. దీనిపై మంచి అభిప్రాయాలు వ్యక్తం కావడంతో తెలంగాణ చరిత్ర, తెలుగు భాషా, సంస్కృతి, కళలు, సాహిత్యం అంశాలపై మరో పాకెట్ సైజ్ పుస్తకాన్ని రూపొందించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. దేశపతి శ్రీనివాస్ నేతృత్వంలో ఈ పుస్తకం రూపుదిద్దుకుంటుందన్నారు. స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో ఈ బుక్‌ను ముద్రించనున్నట్లు రమణాచారి పేర్కొన్నారు. తెలంగాణ భౌగోళిక అంశాలు, భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకత, నదులు, చెరువులు, వాటి ప్రాముఖ్యత, ఖనిజ సంపద, చారిత్రాత్మక ప్రాంతాలవిశేషాలు, తెలంగాణ చరిత్రకు సంబంధించిన వివరాలు, పండుగలు, సాంప్రదాయాలు, ఈ ప్రాంతాన్ని పాలించిన రాజులు, కాకతీయుల ముందు పరిపాలన, కాకతీయుల పాలన, కుతుబ్‌షాహీలు,నిజాం పాలన.. ఇలా ప్రతీ అంశాన్ని ఈ పుస్తకంలో పొందుపర్చనున్నారు. మన చరిత్రను తెలిపే శాసనాలు, కావ్యాలు, రచనలు, కోటలు వాటి వివరాలు, తెలంగాణ భాషా, తెలంగాణ సాహిత్యం, మన సామెతలు, తెలంగాణలోని మొదటితరం కవులు, పంపన కాలం నుంచి వెలువడిన కావ్యాలు, మరుగున పడిన తెలంగాణ కవుల చరిత్ర, వారి రచనలు, శతక పద్యాలు, నీతి పద్యాలు, సంస్కృతి, కళలు, జానపదాలు, శాస్త్రీయ కళలు, ఆయా కళల్లో ప్రసిద్ధి గాంచిన వ్యక్తులు, మన ప్రాంతం నుంచి పేరొందిన సంగీత విద్వాంసులు, వాయిద్యాలు, వాయిద్య పరికరాల వివరాలు, తెలంగాణ పాటలు, జానపదాలు,



బతుకమ్మ పాటలు, మన రాష్ట్ర చిహ్నాలు, ఆహారపు అలవాట్లు, పూర్వకాలం నుంచి తీసుకున్న ఆహారం, చేతివృత్తులు, వాటికి వచ్చిన ప్రఖ్యాతలు.. ఇలా ప్రతీ అంశాన్ని ఈ పుస్తకంలో వివరించనున్నట్లు తెలిపారు. ఈ పుస్తకంలో పొందుపర్చే అంశాలపై రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిద్దారెడ్డి, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్, తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్వీ సత్యనారాయణ, అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావులతో పాటు పలువురు కవులు, రచయితలు, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌తో సమావేశమవుతామన్నారు. చరిత్ర పుస్తకంలో ఇంకా ఎలాంటి అంశాలు పొందుపర్చాలి, రచయితలు, కవుల ఎంపికపై సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం రాష్ట్రంలో కోటి మూడు లక్షల కుటుంబాలకు ఈ పుస్తకాలను చేరవేస్తామన్నారు. అసెంబ్లీ పుస్తకాలుకూడా వాడుక భాషలో ఉండేలా చూస్తున్నామని దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఉగాది నుంచి పంపిణీ చేసే తెలంగాణ చరిత్ర పుస్తకాలకు సీఎం కేసీఆర్ స్వయంగా పేరు పెడతారని తెలిపారు.

బోగస్‌కు చెక్

నకిలీకి తావివ్వని పాస్‌పుస్తకం... 18 రకాల ప్రత్యేకతలతో తయారీ

- సర్వే నంబర్ల వారీగా రికార్డుల పరిశీలన
- మార్చి 11న పంపిణీ.. అధికారుల ఏర్పాట్లు
- ఇకపై అన్నీ 'ధరణి' వెబ్‌సైట్‌లోనే: ప్రభుత్వం


హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు చేరకుండా బోగస్ పాస్ పుస్తకాలతో దళారులే కాజేస్తుండడంతో సర్కారు ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. బోగస్ పాస్‌బుక్‌లకు చెక్ పెట్టేందుకు 18 రకాల ప్రత్యేకతలతో కొత్త పాస్‌పుస్తకాన్ని రూపొందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ ప్రక్షాళన మొదటి దశ పూర్తైంది. ఈ క్రమంలో బోగస్‌కు అవకాశంలేకుండా ప్రత్యేకంగా పాస్ పుస్తకాలను రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ఈ అధునాతన పాస్ పుస్తకాల ముద్రణపై దృష్టి సారించారు. భూమి తనదే అయినా పాస్ పుస్తకాలు మాత్రం నకిలీవా, అసలువా గుర్తించటం ప్రస్తుతం కష్టంగా మారింది. దొంగ పాస్‌పుస్తకాలతో పెద్ద ఎత్తున బ్యాంకు రుణాలు పొందిన దాఖలాలు అనేక జిల్లాల్లో వెలుగు చూశాయి. దొంగ పాస్ పుస్తకాలతో అసలు భూ యజమానులు ఇబ్బందులకు గురయ్యే దుస్థితి. గతంలో ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీగా బోగస్ పాస్ పుస్తకాలు వెలుగు చూసిన ఘటనలున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలోనూ పలు ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో బోగస్‌పాస్ పుస్తకాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అత్యాధునిక విధానంలో ఈ-పాస్‌పుస్తకాలను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. భూ ప్రక్షాళనలో సరిచేసిన వివరాల క్రమంలోనే పాసుపుస్తకాలు జారీ కానున్నాయి. దీంతో పట్టాదారు పాసుపుస్తకాల రూపం మారబోతోంది. రాష్ట్రంలోని జిల్లాల్లో భూ ప్రక్షాళనలో సరిచేసిన వివరాలను మరోమారు తహసీల్దార్లు పరిశీలిస్తున్నారు. వాటిలో ఏమైనా తప్పిదాలుంటే గుర్తిస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకాల జారీలో ఎటువంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. దేశంలోని నాలుగు మింట్ ముద్రణ కేంద్రాల్లో ఈ పాస్ పుస్తకాల ముద్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

పకడ్బందీ కార్యాచరణ..

భూ రికార్డుల ప్రక్షాళనను పకడ్బందీగా పూర్తిచేసేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఎక్కడా ఎలాంటి తప్పిదాలులేకుండా చూశాకే రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందించేలా చర్యలు చేపడుతున్నారు. ఇన్నాళ్లు వివిధ సర్వేనంబర్లలో భూ విస్తీర్ణం ఉన్నదానికంటే తక్కువ, కొన్నింటిలో ఎక్కువగా నమోదయ్యాయి. వాటన్నింటిని సరిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తప్పిదాలున్న సర్వేనంబర్లను గుర్తించిన అధికారులు వాటిని ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచారు. విస్తీర్ణాలను సరిచేసేందుకు పట్టాదారులకు రెవెన్యూ అధికారులు త్వరలో నోటీసులు జారీ చేయనున్నారు. పట్టాదారులందరూ స్పందిస్తేనే పాసుపుస్తకాలు ఇవ్వనున్నారు. పాస్ పుస్తకాలలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు సరిచేసిన భూ రికార్డులను రెవెన్యూగ్రామాల వారీగా సర్వేనంబర్ల ఆధారంగా తహసీల్దార్లు నిశితంగా పరిశీలిస్తున్నారు. దీంతో పాటు వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తిస్తున్నారు. ఇళ్ల స్థలాలు, వ్యవసాయేతర భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం నిలిపివేయనున్నారు. అలాగే అసైన్డ్ భూములు అమ్ముకుంటే కొనుగోలు చేసిన వారు అర్హులైతే పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయనున్నారు.

అధునాతనంగా.. వినూత్నంగా..

అధునాతన పద్ధతిలో ముద్రిస్తున్న పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు మార్చి 11 నుంచి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధంచేస్తుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సీఎం కేసీఆర్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా పట్టా పాస్ పుస్తకాలను 18 రకాల భద్రతా ప్రమాణాలతో రూపొందిస్తున్నారు. పాస్‌పోర్టు తరహాలో ముదురు ఆకుపచ్చ రంగులో మొత్తం 6 కాలమ్స్‌తో 20 పేజీలు ఉండేలా పాసుపుస్తకాన్ని తయారుచేస్తున్నారు. కాకతీయుల తోరణం, చార్మినార్, భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, ఎరువులు చల్లుతూ, దుక్కి దున్నుతున్న రైతుల చిత్రాలతో పాటు చిరునవ్వు చిందిస్తున్న రైతు కుటుంబాల మహిళల ఫోటోలతో ముఖచిత్రాన్ని తీర్చిదిద్దారు. రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం. బంగారు తెలంగాణ మన స్వప్నం- మన లక్ష్యం, వంటి నినా దాలు ముద్రిస్తున్నారు. ప్రతి పాసుపుస్తకం యూనిక్ ఐడీలోని మూడోస్థానంలో తెలంగాణ రాష్ట్రాన్ని సూచించే విధంగా 'టి' అనే ఆంగ్ల అక్షరం ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. మొత్తం 13 డిజిట్ల యూనిక్ ఐడీలో రాష్ట్రం, జిల్లా, మండలంకోడ్‌లతో పాస్‌పుస్తకం సంఖ్య ఉండేవిధంగా చూస్తున్నారు. ఆధార్ అనుసంధానంతో పాస్‌పుస్తకంపై బార్‌కోడ్, క్యూఆర్ కోడ్, పట్టాదారు చేతివేలి ముద్రల ఫోటోలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హద్దులతో కూడిన పట్టాదారు భూమి పటం, లావాదేవీలు, క్రయవిక్రయాల వివరాలతో పాటు పట్టాదారు చరవాణి నంబరు, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఐఎఫ్‌సీ కోడ్ తదితర వివరాలను ముద్రించేందుకు కసరత్తు చేస్తున్నారు.





బంగారు తెలంగాణకు బాటలు వేయండి

డిజిటల్ రూపంలో..

గతంలో ఉన్న పట్టా పాస్ పుస్తకాల స్థానంలో సాంకేతికతో కూడిన ఈ-పటా పాస్ పుస్తకాలను రైతులకు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మాభూమి వెబ్‌ల్యాండ్‌లో రెవెన్యూ వివరాలు నమోదు చేసినా.. అందులో తప్పులు దొర్లడంవల్ల కొత్తగా 'ధరణి' వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసి కోర్‌బ్యాంకింగ్ తరహాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాస్‌పుస్తకం, భూ యాజమాన్య హక్కుపత్రాలను సమ్మిళితం చేసి ఎలక్ట్రానిక్ రూపంలో ఒకే హక్కు పత్రాన్ని జారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులు భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇకపై భూమి దస్త్రాల నిర్వహణ పద్ధతి(టీఎల్ఆర్ఎంఎస్)లో ఎలక్ట్రానిక్ రూపంలో పొందుపర్చేందుకు కార్యాచరణ రూపొందించింది. భూములపై సర్వహక్కులు పట్టాదారులకు ఉండేలా ప్రభుత్వం భూమిపై హక్కులు, పట్టాదారు పాసుపుస్తకం చట్టం-1971 సవరణ బిల్లును గతంలోనే శాసనసభలో ఆమోదించింది.

భగవత్ వ్యాఖ్యలు దారుణం

- సైనికులను కించపర్చేలా ఉన్నాయి: కంచ ఐలయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యలు భారత సైనికుల్ని కించపరిచేలా ఉన్నాయని టీమాస్ చైర్మన్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య బుధవారం అన్నారు. మోహన్ భగవత్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. బార్డర్‌లోకి వెళ్లడానికి భారత ఆర్మీకి ఆరు నెలలు పడితే, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మూడ్రోజుల్లోనే పోగలరని మోహన్ భగవత్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇలా ఒక ప్రైవేటు సంస్థ సైనికులను కలిగి ఉండడం దేశానికి చాలా ప్రమాదకరమని ఐలయ్య హెచ్చరించారు. ఆర్ఎస్ఎస్‌పై కేంద్రం వెంటనే విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళల అభ్యున్నతే సర్కారు లక్ష్యం

- మూడేళ్లలో 22 వేల కోట్ల రుణాలు
- ఉత్తమ్‌ది అసత్య ప్రచారం: జూపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): మహిళల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. టీఆర్ఎస్వీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2000 నుంచి 2014 సంవత్సరాల మధ్య కాలంలో మహిళా సంఘాలకు రూ.16వేల కోట్ల రుణాలను మాత్రమే గత ప్రభుత్వాలు ఇచ్చాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం మూడేండ్ల కాలంలోనే రూ.22.3 వేల కోట్ల రుణాలను ఇచ్చిందన్నారు. ఇవి కాకుండా స్త్రీనిధి ద్వారా రూ.4,555 కోట్ల రుణాలిస్తున్నామన్నారు. మహిళా సంఘానికి బ్యాంకు ద్వారా రూ.5 లక్షలు ఇస్తూనే అదనంగా స్త్రీనిధి బ్యాంకు ద్వారా మరో రూ.3 లక్షలు చొప్పున ఒక్కో సంఘానికి రూ.8 లక్షల వరకు ఇస్తున్నామని తెలిపారు. అభయహస్తం కన్నా మెరుగైన పథకాన్ని తీసుకువచ్చేందుకు సీఎం కేసీఆర్ చర్యలు చేపట్టారన్నారు. సహజ మరణమైతే రూ.75 వేలు, ప్రమాదంలో మరణిస్తే రూ.4 లక్షల చొప్పున ఇచ్చేలా దాదాపు 70 లక్షల మందికి పైగా వర్తించేలా ఈ పథకాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. సెర్ప్ ఉద్యోగులకు టీఆర్ఎస్ ప్రభుత్వం వేతనాలను పెంచిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

నీటి వాటా దక్కాల్సిందే

- కృష్ణా, గోదావరిలో నీటిపై పోరు
- రాష్ట్రానికి 575 టీఎంసీల నీళ్లు కావాలి
- సర్కారు నిర్ణయం.. నేడు ఢిల్లీలో సమావేశం
- ఉన్నతాధికారులతో మంత్రి హరీశ్ భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి): కృష్ణా, గోదావరిలో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాపై గట్టిగా పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీలో గురువారం జరగనున్న సమావేశంలో అనుసరించవలసిన వ్యూహంపై బుధవారం ఇక్కడ జలసౌధలో ఇరిగేషన్ అధికారులతో మంత్రి హరీశ్‌రావు సుదీర్ఘంగా చర్చించారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ ద్వారా ప్రాజెక్టు ల వారీగా నీటి కేటాయింపుల ప్రక్రియ అనంతరమే కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని ఖరారు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరనుంది. గతంలోనూ ఇదే వైఖరిని తెలంగాణ స్పష్టం చేసినట్టు హరీశ్‌రావు గుర్తు చేశారు.తెలంగాణ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగే విధంగా ఆంధ్రప్రదేశ్ చేసే ప్రతిపాదనలను ఎలా తిప్పికొట్టాలన్న అంశంపై కూడా చర్చించారు.పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల జరిగే ముంపు సమస్యలపైనా మంత్రి సమీక్షించారు. భద్రాచలం సీతారామస్వామి దేవాలయం సహా పలు గ్రామాలు, బొగ్గు గనులు, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ తదితర ముఖ్యమైన ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. భద్రాచలం పట్టణం, దాని చుట్టుపక్కల గోదావరి పరీవాహక ప్రాంతంలో 124 కిలోమీటర్ల మేరకు పోలవరం ప్రాజెక్టు ప్రభావం ఉంటుందన్నారు. పోలవరం బ్యాక్ వాటర్‌వల్ల ప్రభావిత ప్రాంతాలు, తలెత్తే సమస్యలపై అధ్యయనం చేయాలంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించవలసిందిగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఉన్నతాధికారులను కోరారు.

ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయాలి..

సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి హరీష్ రావు ఆదేశించారు. కేంద్రం మంజూరు చేసిన నిధుల వ్యయానికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలని సంబంధిత సీఈవోలను మంత్రి కోరారు. పలు ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి నిర్ణీత కాలవ్యవధిని ఖరారు చేశారు. వచ్చే జూన్‌లోగా భీమా, నీల్వాయి, కొమురంభీం ప్రాజెక్టులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదులను 2019 మార్చి నాటికి, ఎస్ఆర్ఎస్పీ వరద కాలువను 2019 జూన్ వరకు పూర్తి చేయాలని కోరారు. మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరులతో పలు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సమస్యలపై మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని వారికి ఆదేశించారు. జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుకు సంబంధించిన వ్యవహారంలో కోర్టు తీర్పుకు అనుగుణంగా వెంటనే చర్యలు తీసుకొని పనులు వేగవంతం చేయాలని తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు గ్రాంటు, రుణ రూపేణా ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన(పీఎంఎస్‌కేవై) లభించనున్నాయి. మత్తడివాగు, నీల్వాయి, గొల్లవాగు, ర్యాలివాగు, పాలెంవాగు, రాజీవ్ భీమా ప్రాజెక్టు, ఇందిరమ్మ వరద నీటి కాలువ పీఎంఎస్‌కేవై జాబితాలో ఉన్నాయి.

సీతారామ ప్రాజెక్టు సమీక్ష

కృష్ణాతో గోదావరిని అనుసంధానం చేయనున్న 16ఎల్, 18ఎల్ కాలువల పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని హరీష్ రావు అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే పనులు ముగించి టెంటర్ల ప్రక్రియ కూడా పూర్తి చేయాలని కోరారు. ఖమ్మ జిల్లాలో సీతారామ లిఫ్ట్ పథకం ఫేజ్ 1, పంపు హౌజ్‌ల నిర్మాణం త్వరితగిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుకు చెందిన భూసేకరణ, అటవీ పర్యావరణ అనుమతులు, పంప్ హౌజ్‌లు, కెనాల్స్ ఇతర పనుల పురోగతిపై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సీఎస్ జోషి, సెక్రటరీ వికాస్ రాజ్‌పాటు మురళీధర్‌రావు, నాగేందర్ రావు, అనిల్, భగవంతరావు, బంగారయ్య, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

గురువారం, ఫిబ్రవరి 15

ఉరుముతున్న ఉగ్రవాదం

జమ్మూలోని సుంజువాన్ సైనిక స్థావరంపై దాడిముగియక ముందే, శ్రీనగర్‌లోని కరణ్‌నగర్ సైనిక శిబిరంపై ఉగ్రవాదులు మరోదాడి చేయడం మన రక్షణ వ్యవస్థలోని బలహీనతలకు అద్దం పడుతున్నాయి. జమ్మూ, శ్రీనగర్‌లో చోటుచేసుకున్న ఉదంతాలు సున్నితమైన సరిహద్దు రాష్ట్రంలోని పరిస్థితిని కళ్లకు కట్టినట్టు చూపాయి. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో పీడీపీ-బీజేపీ సంకీర్ణం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సరిహద్దుల్లో దాడులు, లోయలో హింసాత్మక ఘటనలు పెరిగాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. సుంజువాన్‌లో సైనిక స్థావరంపై దాడిలో ఐదుగురు సైనికులు, ఒక పౌరుడు మరణించగా నలుగురు ఉగ్రవాదులు హతమైన ఘటన సాధారణ ఉగ్రవాద వ్యతిరేక సైనిక చర్యలుగా భావించలేము. జమ్మూ-కశ్మీర్‌లోని సైనిక స్థావరాలను తగినంత పటిష్టంగా తీర్చిదిద్దుకోవలసిన అవసరాన్ని తెలియజేసినప్పటికీ, దాడులు ఆకస్మికంగా పెరగడానికి కారణాలను నివారించడం ముఖ్య కర్తవ్యంగా నిలుస్తుంది.

ఏడుగురు సైనికులు మరణించిన 2016 జనవరిలో పఠాన్‌కోట్ విమాన స్థావరంపై ఉగ్రవాదదాడి ఉదంతం నేపథ్యంలో సైనిక వైస్‌చీఫ్ మాజీ జనరల్ ఫిలిప్ కాంపోస్ సారథ్యంలో త్రివిధ బలగాల ఉన్నత స్థాయి కమిటీ అనేక రక్షణ చర్యలు ప్రతిపాదించింది. అలాగే 2016 సెప్టెంబర్‌లో వురి సైనిక స్థావరంపై జరిగిన దాడిలో 19 మంది జవాన్లు మరణించారు. అందుకు ప్రతీకారంగా మోదీ ప్రభుత్వం సర్జికల్ దాడులు జరిపి పాక్ భూభాగంలోని కొన్ని సాయుధ శిబిరాలను ధ్వంసంచేసింది. ఈ సర్జికల్ దాడులు పాకిస్థాన్‌కు గుణపాఠమవుతుందన్న భారత్ తలంపును పూర్వపక్షం చేసింది. సరిహద్దు ఆవల నుంచి సైనిక స్థావరాలపై జరుగుతున్న దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు రక్షణ వ్యవస్థలను పటిష్టపరచుకోవడంతోనే సరిపోదు. అక్రమ చొరబాట్లను అడ్డుకోవడం, సరిహద్దుకావల ఉగ్రవాద శిబిరాల నిర్మూలనకు కృషిచేయడం, అంతర్జాతీయ దౌత్యంతో పాక్ ప్రభుత్వంపై ఒత్తిడిపెంచడం వంటి చర్యలను సమన్వయంతో నిర్వహించాలి. దౌత్యపరంగా అంతర్జాతీయ ఒత్తిడి పెంచడంలో భారత్ విజయం సాధించినప్పటికీ, భౌగోళిక రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఉగ్రవాదుల దాడులు పెరగడాన్ని, ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరడాన్ని ఈ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. సర్జికల్ దాడుల తర్వాత పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనలు మూడురెట్లు పెరగగా, అక్రమంగా ప్రవేశిస్తున్న ఉగ్రవాదుల సంఖ్య రెట్టింపు అయింది.

సరిహద్దులను కాపలా కాసేందుకు ఎక్కువమందిని కేటాయించడం, సైనిక స్థావరాలు నాసిరకం భద్రతా ఏర్పాట్లతో ఆధీన రేఖ/అంతర్జాతీయ సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉండటం, వాటికి అతిసమీపంలో పౌర నివాస ప్రాంతాలుండటంతో ఉగ్రవాదులు సులభంగా దాడిచేసేందుకు దోహదం చేశాయి. సుంజువాన్, శ్రీనగర్ దాడుల తర్వాత రక్షణ మంత్రిత్వశాఖ లక్షలాది రైఫిళ్లను, వేలాది మెషీన్‌గన్‌లను కొనడానికి 16 వేల కోట్ల రూపాయలను సైన్యానికి కేటాయించింది. ఆయుధాల కొనుగోళ్లతో పాటు రక్షణ వ్యవస్థలను పటిష్టం చేసుకునేందుకు ఫిలిప్ కమిటీ సిఫారసులు తక్షణం అమలు చేయవలసిన అవసరం ఉంది. ఈ దాడుల నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయడం మరింత విడ్డూరం. చైనా దూకుడుకు చెక్ పెట్టాలన్న అమెరికా భౌగోళిక రాజకీయ వ్యూహంతో ఆఫ్ఘానిస్థాన్‌లో భారత జోక్యం పెరగడం, ఇజ్రాయెల్‌తో మైత్రీబంధం ఇదివరకెన్నడూ లేనంతగా బలపడడం, అంతర్గతంగా 'ఏకీకృత హిందూ అసిత్వం'ను సంఘటితం చేసి అధికారాన్ని సుస్థిరం చేసుకునే క్రమంలో ముస్లింలపై భౌతిక, సాంస్కృతిక దాడులు పెరగడం వంటి చర్యలు దేశంలో పాక్ ప్రేరిత/దేశీ ఉగ్రవాద ప్రమాదం పెరగడానికి దోహదం చేశాయి. ప్రతీకారంగా సర్జికల్ దాడులు చేయడం, ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్లలో చంపడం, సైనిక స్థావరాలు పటిష్టంగా రూపొందించడం వంటి సాంకేతిక చర్యలు ఉగ్రవాదానికి తాత్కాలిక ఉపశమనాలే!

నీటి కరువు

ఆకస్మిక వాతావరణ మార్పు ప్రమాదంలో ప్రపంచం (ప్రకృతి+సమాజం) కూరుకోబోతుందన్న మరణమృదంగాలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా దాహం తీర్చే మంచినీటి కరువు మానవాళిని కబళించబోతోందనడానికి దక్షిణాఫ్రికా నగరం కేప్‌టౌన్ దృశ్యం ఒక సంకేతంగా నిలుస్తుంది. అభివృద్ధి పేరిట మొలుచు కొస్తున్న ఆకాశహర్మ్యాల్లో నాగరికతలు వెలసిన నీటి పునాదులు మరచి మానవాళి పరాయికరణకు గురైన క్రమంలో కాంక్రీట్ నిర్జీవ సంస్కృతిగా సర్వత్రా విస్తరించింది. సమాజం-ప్రకృతి మధ్య సాగే ఆదానప్రదాన క్రమానికి గండివేసే పట్టణీకరణ పునాదిగా సాగే పారిశ్రామికరణ, కాగితపు కరెన్సీల మోజులో, సంపదల పేరాశతో కోట్లాదిమంది సృష్టించిన సంపదలకు కొద్ది మందిని భుక్తందారులను చేయడమే కాదు, భూ వనరులను దుర్వినియోగ పరుస్తూ మానవ మనుగడ ను ప్రశ్నార్థకంగా మార్చివేసింది. పట్టణాల్లో ఒదుగుతున్న ప్రపంచానికి కేప్‌టౌన్ తాగునీటి సంక్షోభం తీవ్ర హెచ్చరిక అవుతుంది. పాలకుల కార్పొరేట్ ప్రపంచీకర ణ మోజు ప్రజల పాలిట శాపంగా మారింది.

ఐక్యరాజ్య సమితి సహా ప్రపంచ వ్యాప్తంగా అనేక అధ్యయనాలు భవిష్యత్‌లో నీటి కోసం భారీస్థాయి యుద్ధాలు జరిగే అవకాశముందని హెచ్చరిస్తున్నాయి. 2015లో పావోలో బాసిగలుపి రాసిన 'ద వాటర్ నైఫ్', క్లైరే వాయె వాట్కిన్స్ రాసిన 'గోల్డ్ ఫేమ్ సిట్రస్' అనే రెండు వైజ్ఞానిక కాల్పనిక నవలలు అమెరికాలోని కేలిఫోర్నియా రాష్ట్రంలో నెలకొన్న ఘోరమైన నీటి కొరత సమస్యను ప్రతిబింబిస్తున్నాయి. వాస్తవంలో అమెరికా నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్రికా, భారత్ దాకా అత్యంత ప్రతిష్టాత్మకమైన, వారసత్వ సంపదగా ప్రసిద్ధిచెందిన మహానగరాలు సైతం నీటి కొరతతో అతలాకుతలమవుతున్నాయి. ప్రపంచంలోనే నీటి కొరతతో కుదేలైన మొట్టమొదటి ఆధునిక నగరం కేప్‌టౌన్‌లాగా మరో 11 మహానగరాలు త్వరలో దాహాగ్నితో అల్లాడుతాయని బీబీసీ కథనం ఒళ్లుగగుర్పాటుకు గురిచేసింది. ఆ నగరాల జాబితాలో భారత సిలికాన్ వ్యాలీగా గుర్తింపు పొందిన బెంగళూరు ఉండటం ఆందోళన కలిగించే విషయం. బెంగుళూరు నీటి కటకట, ట్రాఫిక్ సమస్యలతో చాలాకాలంగా కుతకుతలాడుతుండటం తెలిసిందే. దేశంలో అనేకప్రాంతాల్లో భూ ఉపరితల, భూగర్భ జలాలు ఆందోళనకరమైన స్థాయిలో అడుగంటిపోయాయి. నీటికొరత సమస్య ఆందోళనకరస్థాయిలో వేధిస్తున్నా భారత పాలకులు అత్యంత నిర్లక్ష్యంతో, హ్రస్వదృష్టితో, నత్తనడకన సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తుండడం దారుణం. దాహం వేస్తేగాని బావితవ్వకోడానికి సిద్ధపడని ప్రభుత్వాల వైఖరి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోంది. మనకంటే చిన్న, వెనుకబడిన, అరకొర వనరులున్న దేశాలు సైతం ప్రపంచీకరణ, సాంకేతిక ప్రగతిని వినియోగించుకొని తాగునీటి సమస్యను పరిష్కరించుకుంటున్నాయి.

వేగవంతమైన నీటి వినిమయం పునాదిగా రూపొందే వ్యవసాయోత్పత్తుల ద్వారా 'అంతర్ జలం' (వర్చ్యువల్ వాటర్)ను ఎగుమతి చేయడంలో భారత్ ముందంజలో ఉంది. అదే సమయంలో దేశంలోని సహజ వనరులను కాలుష్యం, దుర్వినియోగం బారినుంచి కాపాడుకోలేని దుస్థితిలో ఉంది. ప్రాచీన కాలం నుంచి 'హైడ్రాలిక్ రాజ్యాలు'గా ప్రసిద్ధికెక్కి, నీటియాజమాన్యంలోను, 'జలశక్తి' వినియోగంలోనూ నిష్ణాతులైన భారతీయులు నేడు నీటి సంరక్షణలో ఘోరంగా విఫలం కావడం దురదృష్టకరం. దేశంలోని నదులు పరిశ్రమలు, స్థానిక నగరాలకు డ్రైనేజీ వ్యవస్థలుగా మారిపోయేందుకు దోహదం చేసిన పాలకుల విధానాలు చారిత్రక వైఫల్యాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో విచక్షణారహితంగా పెరిగిన పట్టణీకరణ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనేక నీటి వనరులను, జలప్రవాహ మార్గాలను, స్థానిక భూగర్భ జలాశయాలను కబళించాయి లేదా విధ్వంసం చేశాయి. గంగా, యమునా పరివాహక ప్రాంతాలు, బెంగుళూరు, హైదరాబాద్ నగరాలలో వేలాది చెరువులు, కుంటలు మాయం కావడము, నీటి ప్రవాహమార్గాలు మూసుకుపోయి మురికి/చెత్త నిల్వ కేంద్రాలుగా మారాయి. నీటికరువు బారిన పడబోయే ఆధునిక నగరాల్లో బెంగళూరు కూడా ఉండడం భారత నగరాల దుస్థితి గురించి హెచ్చరించే ప్రమాద ఘంటికగా పాలకులు పరిగణించి యుద్ధప్రాతిపదికన తక్షణ రక్షణ చర్యలను జాతీయ స్థాయిలో చేపట్టాలి. కార్పొరేట్ అత్యాశ ప్రకృతిలోని సహజ ప్రక్రియలను గందరగోళపరిస్తే, ప్రకృతి తిరిగి మానవాళిపై వైపరీత్యాలు, కరువులు రూపంలో పగ తీర్చుకుంటుంది.



మంచిమాట



'నీ కష్టాలను చూసి ఒకరు నవ్వితే నవ్వనీ పర్వాలేదు, కానీ ఒకరి కష్టాలను చూసి నీవు నవ్వకు'

- చార్లీ చాప్లిన్

భారతి మిట్టల్ ఔదాత్య ఉపయోగమెంత?



ఈ మధ్యకాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో, యావత్ దేశంలో గణనీయంగా పెరిగిన ప్రైవేటు పెట్టుబడి ప్రజావ్యతిరేకతపై చర్చ మొదలైంది. ఒక కమ్యూనిటీలో పేరుకున్న సంపద ప్రజా భివృద్ధి కార్యక్రమాలకు ఏనాడు ఖర్చు చేయలేదని, అవి ఆధ్యాత్మికరంగాల్లో పెట్టే ఖర్చు శ్రమజీవుల అభివృద్ధికి దోహదపడేది కాదని పత్రికలు స్పష్టంగా తేల్చి చెప్పాయి. 'ప్రజాసేవ' అనే దృక్పథం అట్టడుగు వర్గాల-ముఖ్యంగా ఆదివాసి, దళిత, ఉత్పత్తి కులాల అభివృద్ధికి దోహదపడాలనే చర్చ బలంగానే సాగుతుంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక వ్యాపార వర్గాలు ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటురంగంలోకి మార్చుకున్నాయని చాలామంది ఆర్థికవేత్తలు చెప్పే స్థితి వచ్చింది. కానీ ఆ పార్టీ ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల ఊసు ఎత్తకుండా దళిత బహుజన సమాజాన్ని దగా చేస్తోందని బలమైన వాదన ముందుకొచ్చింది.

ఈ తరుణంలో దేశంలో ఇంటింటా తన సెల్‌ఫోన్ వ్యాపారం చేస్తున్న ఎయిర్‌టెల్ అధిపతి భారతీ మిట్టల్ యాజమాన్యం ఏడువేల కోట్లతో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు మొదలుపెడుతున్నామని ప్రకటించింది. మంచిదే, ఆహ్వానించదగ్గదే. ప్రధాని నరేంద్ర మోదీకి అన్నివిధాల అండగా ఉండి ఎన్నికల్లో గెలిపించి, ఈ ప్రభుత్వంలో బాగా లాభపడ్డ అదాని గ్రూపు ఎన్నికల టైమ్‌లోనే పైసలతో ప్రజల్ని కొంటే సరిపోతుందనే ధీమాగా ఉంది. 2014 ప్రక్రియే 2019లో జరిగితే దేశం ఏమైతుందునే భయం ప్రజల్లో మొదలైంది కూడా నిజమే. అయితే భారతి మిట్టల్ ఈ ఏడువేల కోట్లను ఎలా ఖర్చు పెట్టదల్చుకున్నారనేది చాలా ముఖ్యం. ఆ కంపెనీ అధిపతి నవంబర్ 23న ప్రకటించిన దాని ప్రకారం వారు 'సత్య భారతి' అనే పేరుతో ఒక యూనివర్సిటీ ప్రారంభిస్తారు. ఆ యూనివర్సిటీ ఎమ్ఐటీ, బోస్టన్, బర్కలీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీల వంటి పాత్ర నిర్వహిస్తుందట. ఇందులో వెనుకబడిన తరగతుల విద్యార్థులు అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, శూద్ర అగ్ర కుల బీద పిల్లలు చదవాలన్నా ఎల్‌కేజీ నుంచి ఇంగ్లీషు మీడియంలో 12వ తరగతి వరకు చదవకుండా వాళ్ళు ఆ యూనివర్సిటీలో ఎలా చదువుతారు? కొన్ని మోనోపలి కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ డబ్బుతో చాలా ఖరీదైన ఆంగ్ల మీడియం స్కూళ్లు ఈ పిల్లల కోసం నడుపుతున్నారు. అందులో దళిత బహుజన, ఆదివాసి పిల్లలకు అడుగుపెట్టే అవకాశమే లేదు.

ఇప్పుడు భారతీ మిట్టల్ పెట్టబోయే 'సత్యభారతి' యూనివర్సిటీలో వాళ్ల టాప్ స్కూళ్ళలోనో కేథలిక్ క్రిస్టియన్ టాప్ స్కూ ళ్లలోనో చదువుకున్న వా రు మాత్రమే చదవగ లరు. ప్రాంతీయ భాషల్లో చదివిన వారికి అడ్మిషన్లు ఇచ్చినా వాళ్ళు డ్రాపవుట్ కావాలి లేదా ఆత్మహత్య చేసుకోవాలి. ఇప్పటికే అజీమ్ ప్రేమ్‌జీ ఒకటి నడుపుతున్నాడు. ఈ యూనివర్సిటీలన్నీ భారతదేశంలోని అమెరికన్ ఐలాండ్స్! ఈ విషయం గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లీషు విద్యను వ్యతిరేకించే బీజేపీ వాళ్లెవరు వాళ్ళు పూజిస్తామని చెప్పుకునే సంస్కృతంలో వాళ్ల పిల్లల్ని చదివించడం లేదు. లేదా హిందీ, తదితర ప్రాంతీయ భాషల్లో చదివించడం లేదు. ఇదొక ఆధునిక కుట్ర. ఇందులో వాళ్ల చట్రంలోని దళిత బహుజనులు కూడ బలౌతారు. కానీ అది వారు నమ్మే కర్మ సిద్ధాంతంలో భాగం.



దేశంలో అత్యున్నత ధనవంతమైన అంబానీలు ఇప్పటికీ ప్రజాదరణ ఫౌండేషన్లు ఏమీ ప్రారంభించలేదు. ప్రైవేట్ సెక్టారులో రిజర్వేషను విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి 2014 ఎన్నికల్లో పెట్టబడి పెట్టి అధికారంలోకి తెచ్చిన ఆదాని గ్రూపు ఒక్క పైసా కూడా బీద ప్రజలకు, దళిత బహుజనులకు దక్కనిచ్చే ఫౌండేషన్ ఏదీ పెట్టలేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక బాగా లాభపడ్డ కంపెనీ ఇదే.

2006-07లలో ప్రైవేట్ సెక్టార్లో రిజర్వేష న్లను మొత్తం ఇండస్ట్రీ వ్యతిరేకించినపుడు వీరప్ప మొయిలీ కమిటీకి హాజరైన మేధావులందరం కనీసం గ్రామీణ ప్రాంతంలో ఇంగ్లీషు మీడియం స్కూళ్లు నడిపే ఉదారత్వం చూపండి అని అడిగాం. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వంటి పెట్టుబడిదారీ మేధావులు అది కుదరదన్నారు. యూనివర్సిటీల్లో ఫిలాంత్రఫీ డబ్బు పెట్టడమంటే అణగదొక్కబడ్డ కుల/వర్గాల దృష్టితో చూసినపుడు చెట్టుకొమ్మల్లో ఖర్చుపెట్టడం వంటిది. ముందు దాని వేర్లను బలపర్చాలి. ఆ పని ఇంగ్లీషు మీడియం స్కూళ్ల ద్వారా మాత్రమే జరుగుతుంది. అది చెయ్యడానికి పెట్టుబడిదారులు సిద్ధంగా లేరు. పోనీ ప్రభుత్వాలైనా 'కామన్‌స్కూల్' వ్యవస్థ వైపు ఆలోచిస్తున్నాయా అంటే అదీ లేదు. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ రెండు భిన్న విద్యావిధానాలు మద్దతు దారులే రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాంతీయ భాషల్లో నడవాలని పాలకులను ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్ళలో ఆంగ్లేయ మీడియాను వ్యతిరేకిస్తున్నారు. గ్రామాలలో ఇంగ్లీషు మీడియం విద్య గురించి మాట్లాడేవారిని క్రిష్టియన్ ఏజెంట్లు అని ప్రచారం చేస్తున్నారు. తమ పిల్లలు పట్టణాల్లో ఇంగ్లీషు మీడియం చదువుకుంటే మాత్రం దేశభక్తులంటున్నారు. ఈ మోసపూరిత ప్రచారంలో స్వార్థపరులైన బీసీ, ఎస్సీ, ఎస్టీలు కూడా చేరుతున్నారు.

ఈ ద్వంద్వ విద్యా సాలెగూడు నుంచి దేశాన్ని బయట పడేయడం చాలా పెద్ద సమస్యగా మారింది. ఇందులో కొన్ని శక్తులు పెట్టుబడిదారుల మీద అధారపడి ద్వంద్వ విద్యావిధానాన్ని కాపాడే శక్తులను తమ భుజాల మీద మోస్తున్నారు. రాష్ట్రస్థాయి ప్రభుత్వ విద్యా విధానాన్నంత ఇంగ్లీషు మీడియంలోకి మార్చకుండా పెట్టుబడిదారులు పెట్టే ప్రైవేటు యూనివర్సిటీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీద ప్రజానీకానికి ఉరితాళ్లుగా మారుతాయి. అమెరికాలో నల్లజాతి వాళ్లు ప్రైవేటు యూనివర్సిటీలో నెగ్గుకురావడానికి ఆ దేశంలోని ఏక భాష కామన్ ప్రభుత్వ స్కూళ్లు కారణం. బ్రిటన్‌లో గానీ, అమెరికాలో గానీ, ఆస్ట్రేలియాలో గానీ, కెనడాలో గానీ అన్ని స్కూళ్ళు ఒకే భాషలో, ఒకే స్టాండర్డ్స్‌తో నడుస్తాయి. ధనవంతుల పిల్లలు, బీదల పిల్లలు, తెల్లజాతివాళ్లు, నల్లజాతివాళ్లు అన్నిస్థాయిల్లో కామన్ స్కూల్ విద్యావిధానం వల్ల సమానంగా పోటీ పడే వ్యవస్థ ఏర్పడింది.


భారతీ మిట్టల్ ఇదే ప్రకటనలో మన దేశంలో పెట్టుబడిదారి వ్యవస్థ ఒక దశకు చేరుకుందని చెప్పాడు. కంపెనీలు బీదల కోసం ఖర్చు చెయ్యాల్సిన దశ వచ్చిందని ఒప్పుకున్నాడు. తమ ఫౌండేషన్ బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ తరహాలో పనిచేస్తుందని చెబుతున్నారు. మంచిదే. కానీ అమెరికన్ ఫౌండేషన్‌లు ఎక్కువ ప్రపంచంలోని అతి బీద ప్రజల కోసం విద్య, వైద్య రంగాల్లో పనిచేస్తున్నాయి. నాదృష్టిలో వైద్య రంగం కంటే పాఠశాల విద్యారంగం చాలా ముఖ్యమైంది. అందులో భారతదేశం వంటి దేశంలో ఏక భాష విద్యారంగాన్ని బాగా అభివృద్ధి చేయాలి. అందుకు అనుకూలమైంది ఇంగ్లీషు భాష మాత్రమే. గ్రామీణ వ్యవస్థను మొత్తంగా ఏక భాష అర్థం చేసుకొని, రాయగలిగే వ్యవస్థగా మార్చాలి. ఆ పని కేవలం ప్రభుత్వాలు మాత్రమే చేయలేవు. ప్రైవేటు పెట్టుబడి, మతసంస్థలు ముందుకు రావాలి. మత సంస్థలు, ప్రైవేటు పెట్టుబడిదారులు మానవతా విలువల్ని అవర్చుకొని పాఠశాల విద్యారంగంలో ఖర్చుపెట్టకుండా కులవ్యవస్థలోని వ్యత్యాసాలు పోవు. శ్రమ గౌరవ పాఠాలు చెబుతూ స్కూలు విద్యారంగాన్ని సంపూర్ణ సమాన త్వ విలువల్లోకి మార్చాలి.

మన దేశంలో పట్టణ వ్యవస్థకూ గ్రామీణ వ్యవస్థకూ మధ్య జీవన ప్రమాణాల్లో తేడా ఉండడం వల్ల కొద్దిపాటి సంపద ఒనగూడిన కుటుంబాలు గ్రామాలు వదిలి పట్టణాలకు వస్తున్నాయి. ఈ మైగ్రేషన్‌లో ఇంగ్లీషు స్కూలు విద్య కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ మైగ్రేషన్‌ను అలానే పెరగనిస్తే వ్యవసాయ రంగం కుప్ప కూలుతుంది. బీజేపీ వంటి రైట్ వింగ్ పార్టీ చుట్టూ పనిచేసేవారికి ఈ అంశాలను చర్చించాలని గానీ, సిద్ధాంతీకరించాలనిగానీ లేదు. మిగతా పార్టీలకు ఓటు సమీకరణతో బతకాలని చూడడంవల్ల వ్యవసాయ వ్యవస్థను కాపాడాలనే ఆలోచనలేదు. పెట్టుబడిదారీ విలువల్ని గానీ, మత విలువల్నిగానీ బీద ప్రజల్ని గానీ, మానవ సమానత్వాన్ని గాని గౌరవించేవిగా రూపొందించకుండా దేశం పూర్తి ఆధునిక దేశంగా అభివృద్ధి చెందడం సాధ్యం కాదు.

దేశంలో అత్యున్నత ధనవంతమైన అంబానీలు ఇప్పటికీ ప్రజాదరణ ఫౌండేషన్లు ఏమీ ప్రారంభించ లేదు. ప్రైవేట్ సెక్టారులో రిజర్వేషను విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి 2014 ఎన్నికల్లో పెట్టబడి పెట్టి అధికారంలోకి తెచ్చిన ఆదాని గ్రూపు ఒక్క పైసా కూడా బీద ప్రజలకు, దళిత బహుజనులకు దక్కనిచ్చే ఫౌండేషన్ ఏదీ పెట్టలేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక బాగా లాభపడ్డ కంపెనీ ఇదే. ఈ పెట్టుబడిదార్లను నిలదీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ వనరులతో పెద్ద ధనవంతుడైన అంబానీ ఆ రాష్ట్రానికి ఏమీ చెయ్యడం లేదు. ఆ కంపెనీని ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిలదీయాల్సిన అవసరముంది. ఈ పోరాటాన్ని ప్రైవేటు రంగం రిజర్వేషన్ పోరాటంతో ముడేయాల్సిన అవసరముంది. 2019 ఎన్నికల నాటికి ఈ పోరాటాల్ని ఉధృతం చేయాలి. బీజేపీ ఎవరి పక్షం ఉంటుందో అప్పుడే తేలుతుంది.

◆ కంచ ఐలయ్య షెఫర్డ్
97044 44692

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్



భరత భూమి అనేది ఒక వేద భూమి, ఒక కర్మ భూమి, ఆధ్యాత్మిక సంప్రదాయం, పురాణాలు, వేదాల ప్రకారం మహోన్నతమై హైందవ ఆధ్యాత్మిక సంప్రదాయం భారతదేశంలో ప్రసిద్ధిచెందింది. కాలి, నడకన తిరిగి హైందవధర్మ ప్రాముఖ్యత, ప్రత్యేకత లను చైతన్యపరిచిన వ్యక్తి జగద్గురు ఆదిశంకరా చార్యులు. వైష్ణవులకు, శైవులకు మధ్య రగిలిపోతున్న ఆధిపత్య పోరుకు తనదైన శైలిలో విష్ణువు, శివుడు వేర్వేరు కాదని చాటిచెప్పిన వారు రామానూజాచార్యులు. దేశం మారుమూల ప్రదేశా లకు సందర్శించి బోధించి హైందవ మతం గొప్ప ప్రచా కర్తగా అందరి హృద యాలలో చిరస్మరణీయుడయ్యారు. తిరుపతి, శ్రీశైలం, వేముడవాడ రాజన్న, సమస్మక్క సారలమ్మ, సప్తమాతలు (బంజారా) నిర్దేశం తెలియని బంజా రాలకు కూడ దశదిశను చూపెట్టడానికి, వారికి హైందవ ధర్మం గొప్పతనం, ప్రత్యేకంగా మాతృదేవత (భవానీ మాత) ప్రత్యేకతను బంజారాలకు సంత్ సేవాలాల్ మహరాజ్. తెలియజేశారు.

'యాదేవి సర్వ భూతేషు మాతృ రూపేణ సమ స్తితా'/నమస్తితె నమస్తితె నమస్తతేః నమా నమహః' ఈ సమస్త జీవకోటికి మాతృరూపంగా వెలిసిన భవానీని పూజిం చాలేగాని ఫలితం ఆశించవద్దని బంజారాలకు సంత్ సేవాలాల్ మహరాజ్ బోధించాడు. అహింస పాపమని, మత్తు, ధూమ పానం శాపమని హితవు పలికాడు. ఆనాడు రాజుల నుంచి బ్రిటిష్ కా లం వరకు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సా మాగ్రిని ఆయా ప్రాంతాలకు చేరవేస్తూ సంచార జీవ నం సాగిస్తూ ఉండేవారు. ఆ క్రమంలో బ్రిటిష్, ము స్లిం పాలకుల మత ప్రచారం ద్వారా బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురైంది. దుర్భర స్థితిని తొలగించి ఆర్థిక, సాంఘిక, రాజకీయ, అలా అనేక సంస్క రణ ద్వారా మార్పులు చేసి బంజారాలను చైతన్యపరచి అభివృద్ధి బాటలో నడిపించేందుకు సంత్ సేవాలాల్ మహరాజ్ ఉద్భవించిన భగవత్ అవతా రంగా, గురుదేవుడిగా నిలిచాడు. బంజారా తండాల్లో పరిస్థితులు అస్తవ్య స్తమై సమస్యలతో బతి కేవారు. అప్పుడు సప్తమాతలకు కలిసి బంజారా జాతిని ఒకతాటిపై తీసుకొచ్చే మహానుభావుడిని వరంగా ఇవ్వమని సాత్ భవానులను వేడుకుంటాడు. అపుడు సాత్ భావానీలు 'మీ కోరిక మేరకు ఒక వ్యక్తిని మీ జాతిలో బిడ్డ వరంగా ఇస్తాం. కానీ ఆ బిడ్డ తల్లిదండ్రుల వద్ద 12 సంవత్సరాలు మాత్రమే ఉండి తరువాత మా షరతు ప్రకారం మేరమ్మ భవానీకి భగతుగా (పూజారిగా) తిరిగి అప్పగించా'లని తుళ్జ భవాని చెపుతుంది. ఈ షరతుకు తండాల్లో ఎవరూ ముందుకు రారు. ధర్మిణి, భీమానాయక్ దంపతులు సంతానం లేక తపసు చేస్తుండేవారు. ఈ విషయం తెలియగానే సప్తమాతలు ధర్మిణికి ఒకరోజు కలలో కనిపించి తమ షరతును అంగీకరిస్తే సంతానాన్ని ప్రసాదిస్తామని చెబుతారు. ఆ దంపతులు భవానీ విధించిన షరతును స్వీకరించడానికి సిద్ధమౌతారు. వారికి వరం ప్రసాదంగా జన్మించిన పుత్రుడే సేవాలాల్. సేవాలాల్ 1739 ఫిబ్రవరి 15న అనంతపూర్ జిల్లా రాంజీనాయక్ తండాలో జన్మించాడు. ఈయనకు సేవాలాల్ అని నామకరణం చేశారు. సేవాలాల్ పెరిగిన తరువాత కొంతకాలంలో మేరమ్మగా పిలువ బడే జగదాంబ ప్రత్యక్షమై సేవాలాల్‌ని తనకు అప్ప జెప్పమని భీమనాయక్‌ను అడుగుతుంది. అమ్మ వారి కి ఇచ్చిన వాగ్దానం ప్రకారం సేవాలాల్ అందుకు ఒప్పుకోడు. తండాను ఇక్కట్ల పాలుచేస్తుంది. ఇదం తా సేవాలాల్ కారణంగా జరుగుతోందని తండా వాసులు ఆయనను బహిష్కరిస్తారు. ఏడు మేకలను ఏడుగురు అమ్మవారుల ముందు బలికి ఉంచుతారు. కానీ సేవాలాల్ ప్రజల మూఢనమ్మకానికి ఏకీభవించ డు. అమ్మవారికి బలే ఇష్టమైతే తాను బలైపోతానని తలను ఖండించుకొని అమ్మవారి కాళ్ల దగ్గర పడేస్తా డు. అమ్మవారు సేవాలాల్ శిరస్సును తిరిగి అతని శరీరానికి జోడించి జీవం పోస్తుంది. నిజమైన భక్తుడు సమాజానికి సేవకుడని, అయిన ఆయన మార్గంలోనే ప్రయాణించమని జగదాంబ ఆశీర్వదిస్తుంది. అప్పటి నుంచి సేవాలాల్ జగదాంబమాతనే తన మార్గదర్శకు రాలిగా, గురువుగా స్వీకరించి బంజారాల సేవలో నిమగ్నమయ్యాడు. తల్లిసద్ది కట్టిస్తే అది ఎవరికో ఇచ్చి ఆవుల వెంట అడవిలోకి పోయేవాడు. బంకమట్టితో రొట్టెలు చేసి తినేవాడు. ఆయన అద్భుతాలపై అనేక కథనాలున్నాయి. సేవాలాల్‌కు అపకీర్తి తీసుకురావా లని జాదూగర్ వడితియా ఒక పురుషుడికి ఆడవేషం వేసి తీసుకువచ్చి సంతానం ప్రసాదించాలని కోరతాడు. సేవాలాల్ తథాస్తు అంటూ దీవిస్తాడు. నిజంగానే ఆ పురుషుడు స్త్రీగా మారిపోతాడు. ఆయన ఆజన్మ బ్రహ్మచారి, తండాలలో సాంఘిక దురాచారా లను, మూఢ నమ్మకాలను, మత్తుపానియాలను రూపుమాపడానికి తన జీవితాన్ని త్యాగం చేశాడు. సేవాలాల్ మహరాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశాడు. అందులో 'పెరిఫర్' ఒకటి ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడిలు అరికట్టడం, క్షేత్రధ ర్మాన్ని రక్షించడం మొదలైనవి ముఖ్యమైనవి. 'పరమత సహనం నా పరమ ఆశయం', 'పరమత ప్రవేశం నా ప్రాణానికి శాపం' అని ప్రబోధించాడు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా సంత్ సేవాలాల్ మహరాజ్‌జయంతిని నిర్వ హించడంతో పాటు కోటి రూపాయలు నిధులు మంజూరు చేసింది. అదేవిధంగా సేవాలాల్ మహ రాజ్ మార్గంలోనే తండాలో మత్తుపానీయాలు, సారాను రూపుమాపడానికి ప్రభుత్వం చర్యలు తీసు కుంది. బంజారాలకు బంజారాహిల్స్‌లో బంజారా భావనం కోసం ఎకరం స్థలాన్ని ముఖ్యమంత్రి కేసిఆర్ కేటాయించారు.

◆ జి.శంకర్ నాయక్
తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం
9908817986

(నేడు సేవాలాల్ జయంతి)

మన లేఖలు

రాజోలిని అభివృద్ధి చేయాలి

జోగులాంబ గద్వాల జిల్లాలో వున్న రాజోలిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. మేజర్ గ్రామ పంచాయతీగా వున్న రాజోలిలో అతిపురాతన కట్టడాలు ఉన్నాయి. రాజులు పరిపాలించినందున వారి ఆనవాలు ఉన్నాయి. రాజోలి చెంతలోనే తుంగభద్రనది ఉంది. ఈ నది దగ్గరకు సెలవు దినాలలో చాలామంది సందర్శకులు వస్తుంటారు. అలా వచ్చే సందర్శకుల కోసం ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. ఇక్కడ మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. అలాగే సందర్శకుల కోసం విశ్రాంతి గృహం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇక ముఖ్యంగా ఇక్కడకు వచ్చే చిన్న పిల్లల కోసం పార్క్‌ను ఏర్పాటు చేయాలి. అలాగే ఆర్టీసీ వారు పలు ప్రాంతాల నుంచి బస్సులు నడిపితే చాలా బాగుంటుంది. రాజోలిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. చారిత్రక నేపథ్యం వున్న రాజోలిని ప్రభుత్వం గుర్తించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తే హర్షించదగ్గ విషయం అవుతుంది. సంబంధిత అధికారులు, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

- షేక్ అస్లాం షరీఫ్
శాంతినగర్, జోగులాంబ గద్వాల జిల్లా

తెలుగు రాష్ట్రాలకు అన్నిటా అన్యాయం

తెలుగు రాష్ట్రాలకు బడ్జెట్ విషయంలో, అవార్డుల విషయంలో అన్యాయానికి గురిచేసింది కేంద్ర ప్రభుత్వం. నిత్యం వాడే వస్తువులైన పేస్ట్, ఆయిల్స్, షేవింగ్ పరికరాలపై పన్ను విధించి, పనికిరాని వాటికి పన్నులు తొలగించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరి ఖాజీపేటలో ఏర్పాటు చేస్తామని, భద్రాచలం - కొవ్వూర్ రైల్వే ప్రస్తావన లేదు. ఒకరికి కూడా ఈ రిపబ్లిక్ డే వేడుకల్లో అవార్డులు ప్రకటించకపోవడం విచారకరం. ఎన్నికలు సమీపిస్తున్న రాష్ట్రాలకు వరాలు కురిపిస్తున్నారు. ఎన్నికల బడ్జెట్‌గా వారికి అనుకూల బడ్జెట్‌గా రూపొందించారు. బీజేపీ అధికారంలో ఉన్న వారికి అధిక నిధులు, లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు అందిం చారు. రైతులకు గిట్టుబాటు ధరలు ప్రకటించి ఆదుకోవటంలో విఫలమయ్యింది. కొసమెరుపు ఏమిటంటే రైతు అభ్యున్నతికోసం కొన్ని సంస్కరణలు చేపట్టింది తప్ప, రాష్ట్రాలకు అన్ని రంగాలలో కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసింది. ఎన్నికలే ప్రధాన అంశంగా, కొన్నిచోట్ల ఎదురుదెబ్బలు తగలటంతో బడ్జెట్ అధికంగా ప్రకటించి దృష్టి సారిస్తోంది.

- అయినం రఘురామారావు
ఖమ్మం

మనం
కుటుంబం
గురువారం, 15 ఫిబ్రవరి 2018
www.manamnews.com

స్వచ్ఛమైన పల్లెలంటే ఆమెకు ప్రాణం. అందుకే ఐఏఎస్ ఆఫీసర్‌ను వివాహం చేసుకున్నా పల్లెలపై ఉన్న ప్రేమ మాత్రం తగ్గలేదు సరికదా మరింత పెరిగింది. ఆ ప్రేమతోనే సర్పంచిగా పరకాయ ప్రవేశం చేసింది. ఇక ఆతర్వాత గ్రామ రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ఇప్పుడా గ్రామం 'బెస్ట్ విలేజ్'గా గుర్తింపు పొందింది.







కలెక్టర్ గారి భార్య

పంచాయతీ పెద్దకు అన్నీ సవాళ్లే

ఢిల్లీకి చెందిన ఐఏఎస్ ఆఫీసర్ అరుణ్ కుమార్ సతీమణి రీతూ జైస్వాల్ పేరు మనదేశంలో మారుమోగుతోంది. జిల్లాకే పెద్ద దిక్కు అయిన ఆఫీసర్ అర్ధాంగిగా పూలపాన్పుగా ఉండే జీవితం రీతూ జైస్వాల్‌కు ఏమాత్రం ఆనందం ఇవ్వలేదు. ఏమిటీ మెకానికల్ లైఫ్ అన్న ఆలోచనలో కూరుకుపోయింది. చివరికి తనకు నచ్చిన పనినే వెతుక్కుంటూ వెళ్లి, ఆపనిలో పరమానందాన్ని పొందుతూ, నలుగురికీ సేవ చేసేలా చేసింది. బిహార్‌లోని సింగ్‌వాహిని అనే తమ పూర్వీకుల గ్రామంలో తాండవిస్తున్న సమస్యలపై పోరు మొదలుపెట్టారు. ఇద్దరు పిల్లల తల్లిగా తన బాధ్యతలు నిర్వహిస్తూనే, గ్రామంలోని పిల్లలకు చదువుకునే భాగ్యం కల్పించారు. అన్ని గ్రామాల్లోల్లానే సింగ్‌వాహినిలోనూ ఒకటే సమస్యలు. సురక్షిత మంచినీరు అంటే ఏమిటి? అని అమాయకంగా అడిగే గ్రామస్థులు, రోడ్డు సదుపాయం లేని మారుమూల గ్రామం, బహిరంగ మలవిసర్జన, విద్యుత్ కనెక్షన్‌లు లేకుండా చీకటిగా ఉండే గ్రామం, ఇది సింపుల్‌గా సింగ్‌వాహిని పరిచయం.



నువ్వే ఎందుకు సర్పంచ్ కాకూడదు?

సరే గ్రామం కోసం ఇంత శ్రమిస్తున్న నువ్వే ఎందుకు మా ఊరి పెద్ద కాకూడదు? ఈ ప్రశ్న రీతూలో మరింత బాధ్యత నింపింది. అంతే 2016 సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేసి, 72 శాతం ఓట్లతో గెలిచారు. 2000 మరుగుదొడ్లు నిర్మించి గ్రామంలో బహిరంగ మలవిసర్జనను నిర్మూలించి, మహిళల సమస్యలు తీర్చిన రీతూ కష్టం ఊరికే పోలేదు. అదే సంవత్సరం అక్టోబర్‌లో మలవిసర్జన రహిత గ్రామ పంచాయతీగా సింగ్‌వాహినికి బిహార్ ప్రభుత్వం అవార్డ్ ప్రకటించింది. ఆతరువాత 'రోడ్ల'పై పడ్డ ఆమె చూపుతో, వ్యక్తిగత ఖర్చుతోనే ఊరికి రహదారి నిర్మించారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ పెట్టి, మొబైల్ రిపేర్, టైలరింగ్ వంటివాటిలో గ్రామస్థులకు ట్రైనింగ్ ఇప్పిస్తూ, వారికి ఉపాధి కల్పించారు. ఇటీవలి బిహార్ వరదల్లో సహాయక చర్యలు అందించడంలో ముఖ్య పాత్ర పోషించిన ఈ కలెక్టర్‌గారి భార్యకు బిహార్ ప్రభుత్వం 'ఉచ్ శిక్షిత్ ఆదర్శ్ యువ సర్పంచ్' అవార్డును అందచేసింది. ఈ అవార్డు అందుకున్న ఏకైక వ్యక్తి రీతూ జైస్వాల్ ఒక్కరే కావడం విశేషం.



తొలి అడుగులు

గ్రామం కోసం రీతూ వేసిన తొలి అడుగు స్కూల్‌కు వెళ్లని పిల్లలను వెళ్లేలా చేయడం. ఇందుకు ఓ టీచర్‌ను ప్రత్యేకంగా రప్పించి, స్కూల్ మానేసిన పిల్లలకు చదువు చెప్పించడం. ఇందుకు టీచర్‌కు అంతకుముందు వస్తున్న జీతం కంటే ఎక్కువ చెల్లించేందుకు రీతూ స్వయంగా తన పాకెట్ మనీని వెచ్చించారు. ఆతర్వాత గ్రామస్థులతో భేటీ కావడం, బహిరంగ మలవిసర్జన, భ్రూణ హత్యలు, సేంద్రీయ వ్యవసాయం ఇలా దాదాపు అన్ని అంశాలపై గ్రామస్థుల్లో అవగాహన పెంచేలా ప్రాజెక్టర్‌ను ఉపయోగించి పలు వీడియోలు ప్రదర్శించేవారు. పల్లె బాగుకోసం ఆఫీసర్ బంగ్లాలో కాకుండా అదే పల్లెలోనే ఎక్కువ కాలం గడిపింది.





ఫ్యూజన్ ఫ్యాషన్

'చీర కట్టుకోవడం రాదంటే స్త్రీలు సిగ్గు పడాలి' అంటూ ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సబ్యసాచి ముఖర్జీ చేసిన వ్యాఖ్యలు కాంట్రవర్సీ అయినప్పటికీ, ఇందులో ఉన్న అర్థం, పరమార్థం గ్రహించాలనే వారి సంఖ్య అత్యధికంగా ఉండటం హైలైట్. వివాదాన్ని చల్లార్చేందుకు 'సిగ్గు పడాలి' అన్న మాటలు ప్రయోగించకపోతే బావుండేది అంటూ సారీ చెప్పిన సబ్య తన సంస్కారాన్ని చాటుకున్నాడు. కానీ అసలు అమ్మాయిలు ఎందుకు చీర కట్టుకోవడాన్ని 'టబూ'గా భావిస్తున్నారన్న విషయం పెద్ద చర్చనీయాంశంగా మారిన ఈ రోజుల్లో, హాటెస్ట్ ట్రెండ్ అంటూ కొందరు సెలబ్రిటీలు ఇండియన్ శారీకి కొత్త క్రేజ్ తెస్తున్నారు.





స్ట్రైప్స్ ట్రెండ్స్

స్ట్రైప్స్ బ్లౌజ్‌తో సోనమ్ కపూర్ అందరినీ ఫిదా చేసింది. శ్రీదేవి కట్టిన గీతల చీర, శిల్పా షెట్టీ ధరించిన స్ట్రైప్స్ చీర, కాలర్డ్ షార్ట్ టాప్ లాంటి బ్లౌజ్ ఫ్యాషన్ లవర్స్‌తో వావ్ అనిపించింది. లాక్మే ఫ్యాషన్ వీక్‌లో కాలర్డ్ షర్ట్స్‌ను, రౌండ్ నెక్ షర్ట్స్‌ను బ్లౌజులుగా ధరించిన మోడల్స్ ర్యాంప్‌ను అదరగొట్టారు. మీరు కూడా చీర ప్రిఫర్ చేయాలా ? వద్దా? ఇలాంటి కన్ఫ్యూజన్‌లో పడకుండా ఫ్యూజన్ స్టైల్‌తో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలవండి. వీటిపై మరింత క్లారిటీ కావాలంటే ఫ్యాషన్ బ్లాగులు ఎలాగూ ఉన్నాయ్ కదా.










శారీకి వెస్ట్రన్ సొబగులు

సబ్య డిజైన్ చేసిన స్ట్రైప్డ్ శారీలో మెరిసి పోయిన దీపికా తన స్టైలిష్ అప్పియరెన్స్‌తో చీర ఎవర్‌గ్రీన్ ఫ్యాషన్ అని స్టైల్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. చీరల్లో లెక్కలేనన్ని మోడల్స్, డిజైన్స్, క్లాత్ వెరైటీలు ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో బ్లౌజ్ స్టైల్‌పై చేస్తున్న ప్రయోగాలు అన్నీ ఇన్నీ కావు. స్పోర్ట్స్ వేర్‌లా ఉన్నవి, కోట్, హాఫ్ కోట్‌లా ఉన్న జాకెట్లనే రవికగా ప్రయోగిస్తూ సెలబ్స్ ఇస్తున్న పోజులు, ఇండియన్ శారీకి వెస్ట్రన్ టచ్ ఇస్తోంది. ఇక వెస్ట్రన్ కాన్సెప్ట్‌లో ప్రముఖ పాత్ర పోషించే స్ట్రైప్స్, బెల్టులు చీరలపై అప్లై చేస్తూ, ట్రెండ్ సెట్ చేస్తున్నారు.





ఫ్యాషన్ డిజైనర్ సబ్యసాచి ముఖర్జీ



మన స్టెంట్లదే హవా

(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖ విదేశీ బ్రాండ్లన్నీ కలిపినా భారతీయమార్కెట్లలో కేవలం 33% మాత్రమే అమ్ముడయ్యాయట. 2016లో 57% కంటే ఈసారి 4% ఎక్కువగా భారతీయ స్టెంట్లు వాడారన్నమాట. 2017లో వాడిన మొత్తం స్టెంట్లలో 1% చైనా స్టెంట్లని సింగ్ చెప్పారు. అమెరికా నుంచి వచ్చే స్టెంట్లు 2016లో 3.5 లక్షలు వాడగా, 2017లో 3 లక్షలే వాడారు. అంటే 6%తగ్గాయన్నమాట. ధరల నియంత్రణ తర్వాత భారతీయ మార్కెట్ల నుంచి అమెరికా స్టెంట్లు పూర్తిగా మాయమైపోతాయని కూడా కొంతమంది భావించినా, అలా ఏమీ జరగలేదని.. వాళ్ల మార్కెట్‌వాటా నామ మాత్రంగానే తగ్గిందని భూపేంద్రసింగ్ చెప్పారు. 2015 నాటి కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లెక్కలను బట్టి చూస్తే.. మొత్తం స్టెంట్లలో భారతీయ కంపెనీలవి 30% కంటే తక్కువగా వాడుతున్నారన్నారు. సగటున దేశంలో ఏడాదికి 5 లక్షల యాంజియోప్లాస్టీ ప్రొసీజర్లు చేస్తారు. వాటిలో అవసరాన్ని బట్టి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ స్టెంట్లు వాడతారు. ఎన్‌పీపీఏ చెప్పిన లెక్కలు చూసి స్టెంట్ల సరఫరాదారులే నోళ్లు వెళ్లబెట్టారు. భారతీయ స్టెంట్ల మార్కెట్ 60% దాటి పైకి వెళ్తుందని తామెన్నడూ అనుకోలేదని భారతీయ స్టెంట్ ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు గణేష్ సాబత్ అన్నారు. గత సంవత్సరం తన సొంత కంపెనీ సదానంద్ మెడికల్ టెక్నాలజీ దాదాపు 80% వృద్ధి సాధించిందని ఆయన వివరించారు. భారతీయ ఆస్పత్రులు, వాటిలోని కార్డియాలజిస్టులు మన స్టెంట్లను నమ్మడం మొదలుపెట్టారని, అందుకే ఈ వృద్ధి వచ్చిందని ఆయన వివరించారు. డాక్టర్లు సాధారణంగా పల్చగా ఉండి, కరిగిపోయే తరహా పాలిమర్ ఉంటే మంచిదని చెబుతారని, సరిగ్గా అలాంటివాటినే భారతీయ స్టెంట్లలో వాడుతామని సాబత్ తెలిపారు. ఇప్పుడు విదేశీ స్టెంట్ల ధరల మీద కూడా నియంత్రణ విధించడంతో అవి కూడా అందుబాటులోకి వస్తాయని, అలాంటప్పుడు పేషెంట్లు సహజంగానే తక్కువ ధరకు వచ్చే విదేశీ స్టెంట్ల వైపు మొగ్గుచూపే అవకాశం ఉందని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఆనందరావు చెప్పారు.

నానాతిప్పలు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవాలి. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో సంవత్సరం క్రితం ఉమ్మడి ఫార్మసీ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు తరలిపోయింది. రాష్ట్రం విడిపోయి నాలుగేండ్లు కావొస్తుంది. అయినా ఇంతవరకు ఫార్మసీ కౌన్సిల్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయలేదు. కౌన్సిల్ గుంటూరుకు తరలిపోయిన సందర్భంగా విద్యార్థులు చేసిన ఆందోళనతో తెలంగాణ ప్రభుత్వం ఫార్మసీ కౌన్సిల్‌కు రిజిస్ట్రార్‌గా డ్రగ్ కంట్రోల్ జేడీ కైలాసానికి అదనపు బాధ్యతలు అప్పగించింది. కానీ ఫార్మసీ కౌన్సిల్‌ను మాత్రం ఏర్పాటు చేయలేదు. దానితో విద్యార్థుల సర్టిఫికేట్లకు రిజిస్ట్రేషన్ చేసే వీలు లేకుండా పోయింది.

32వేల మంది అభ్యర్థులు..

ఆంధ్రప్రదేశ్‌లో కంటే తెలంగాణలోనే బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డీ ఫార్మసీ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. అలాంటిది తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాలుగేండ్లు కావొస్తున్నా.. అధికారులు ఇంతవరకు ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. రాష్ట్రంలో మొత్తం 32 వేల మంది డీ ఫార్మసీ అభ్యర్థులున్నారు. వీరిలో 2017లో డీ ఫార్మసీ ఉత్తీర్ణులైన సుమారు 1500 మంది ఆంధ్రప్రదేశ్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కానీ నేటికీ వారికి సర్టిఫికెట్లు అందలేదు.

నాంపల్లి ఫార్మసీ కార్యాలయానికి తాళం..

రాష్ట్ర విభజన నాటి నుంచి గతేడాది వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ నాంపల్లిలోనే



ఉండేది. అప్పుడు ఇక్కడి విద్యార్థులకు ఏలాంటి సమస్యలు ఎదురుకాలేదు. ఫార్మసీ కౌన్సిల్ అక్కడికి వెళ్లిన నాటి నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. అయితే ఈ ఇబ్బంది కొత్తగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే ఈ పరిస్థితి. రెన్యూవల్ విద్యార్థులకు మాత్రం నాలుగు నెలల కిత్రం వరకు హైదరాబాద్ నాంపల్లి కార్యాలయంలో మాన్యువల్‌గా సర్టిఫికేట్లు ఇచ్చేవారు. కౌన్సిల్ కార్యాలయం ఏపీకి వెళ్లినా.. సిబ్బంది అక్కడ మూడు రోజులు.. ఇక్కడ 3 రోజులు పనిచేసేవారు. 4 నెలల క్రితం ఆన్‌లైన్ కావడంతో ఇక్కడ ఎవరూ అందుబాటులో ఉండక.. కార్యాలయానికి తాళం వేశారు.

నోటిఫికేషన్ నేపథ్యంలో..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గత నెలలో ఫార్మసీ గ్రేడ్-2లో 238 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 28వ తేదీ చివరి గడువు. డీ ఫార్మసీ పూర్తి చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు అర్హులు. దీంతో తెలంగాణలో ఫార్మసీ కౌన్సిల్ లేక విద్యార్థులు గుంటూరు బాటపడుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు రెండు రోజుల సమయం పడుతుంది. తెలంగాణ నుంచి వెళ్లిన విద్యార్థులు, వారి సహాయకులు అక్కడ ఉండేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. దీనికితోడు ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఉద్యోగులు తెలంగాణ విద్యార్థులను తిప్పలు పెడుతున్నారు. భారీ మొత్తంలో అమ్యామ్యాలు డిమాండు చేస్తున్నారు. అలా ముట్టజెప్పేందుకు నిరాకరించిన అభ్యర్థులను సర్టిఫికెట్లు అప్‌లోడ్ కాలేదంటూ తిప్పించుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ విషయంలో సందేహాలను నివృత్తి చేసేందుకు అక్కడ సిబ్బంది సహకరించడంలేదు. గత రెండు మూడు రోజులుగా చలితీవ్రత పెరిగిన నేపథ్యంలో అక్కడకి వెళ్లిన అభ్యర్థులు.. తప్పనిపరిస్థితిలో ఆరుబయట నిద్రించాల్సి వస్తుంది. చలికి వణికిపోతున్నారు. విద్యార్థినుల పరిస్థితి మరీ దారుణం. ఏడాది కాలంగా మొత్తుకుంటున్నా.. పట్టించుకోని ప్రభుత్వం, అధికారుల తీరు కారణంగానే ఇప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తుందని డీ ఫార్మసీ అభ్యర్థులు వాపోతున్నారు.

బుల్లిరామయ్య కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసి, సీఎండీ స్థాయికి ఎదిగారు. 1984లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాలలోకి ప్రవేశించిన ఆయన.. ఆ వెంటనే తొలిసారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. తర్వాత 1991, 96, 99 ఎన్నికల్లో ఏలూరు నుంచి టీడీపీ తరపున నెగ్గారు. 1996-98 మధ్య కేంద్ర వాణిజ్య శాఖకు సహాయమంత్రిగా పనిచేశారు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాలలో కీలకమైన నాయకుడిగా పేరొందినా, వివాదరహితుడిగా.. సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకోవడం ప్రత్యేకత.

ముఖ్యమంత్రి నివాళులు

బోళ్ల బుల్లిరామయ్య మరణించిన విషయం తెలిసిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. బుధవారం స్వయంగా తణుకు వచ్చి ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బోళ్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ ప్రాంత ప్రజలు, రైతుల మనస్సుల్లో శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఆయన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అమలు చేశారని చంద్రబాబు



కొనియాడారు. రాజకీయపరంగా ప్రజలకు సేవలు అందించడమే కాకుండా క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి పార్టీకే వన్నె తెచ్చారని ప్రస్తుతించారు. బుల్లి రామయ్య బాగా చదువుకున్న వ్యక్తి అని.. ఆయన ఆశయాలు భావితరాలకు ఆదర్శమని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ కోడెల శివప్రసారావు, మంత్రులు యనమల రామకృష్ణుడు, నారా లోకేశ్, పి.నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, గంటా శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాస్ తదితరులు కూడా బోళ్ల బుల్లిరామయ్య మృతిపట్ల తీవ్ర సంతాపం తెలిపారు.

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

పశుసంవర్థక, మత్స్యశాఖల అధికారులతో ప్రభుత్వం ఆయా శాఖల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో 2 లక్షల మందికి పైగా గొర్రెలను పంపిణీ చేశామని తెలిపారు. రానున్న వేసవిలో గొర్రెలకు పశుగ్రాసం కొరత లేకుండా ఉండేందుకు 4.52 లక్షల మెట్రిక్ టన్ను గడ్డి విత్తనాలను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. పది రోజుల్లో ఈ విత్తనాలను పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. చనిపోయిన గొర్రెల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెప్పించుకుని పరిహారం చెల్లించే విషయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 8642 నీటి తొట్టెలు, 39,372 గొర్ల షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించినట్టు వివరించారు. త్వరలోనే గొర్రెల పెంపకందారులు, మత్స్యకార సొసైటీలకు ఎన్నికలను నిర్వహించనున్నట్టు



మంత్రి వెల్లడించారు. 11 రిజర్వాయర్లలో ప్రయోగాత్మకంగా రొయ్యల పెంపకాన్ని చేపట్టినట్టు తెలిపారు. మార్చిలో హైదరాబాద్‌లో నిర్వహించే అక్వా ఎక్స్‌పోలో 25 దేశాల నుంచి ప్రతినిధులు రానున్నట్టు వివరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితాసబర్వాల్, పశుసంవర్థక శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, ఉద్యానవన శాఖ కమిషనర్ వెంకటరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలవిహార్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి):

నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర పశుసంవర్థక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా 17న జలవిహార్‌లో రక్తదాన శిబిరం, వికలాంగులకు ట్రైసైకిళ్లు, అంధులకు చేతి కర్రలు, వృద్ధ మహిళలకు చీరల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో జన్మదిన వేడుకలను నిర్వహించాలని కార్పొరేటర్లు, నాయకులకు పిలుపునిచ్చినట్టు చెప్పారు. ఈ మేరకు గురువారం జలవిహార్‌ను పర్యవేక్షించనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ వేడుకలకు మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, టీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరవుతారని తెలిపారు.

ఏవోబీలో అలజడి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండటంతో విశాఖ మన్యంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నాయి. రెండురోజుల క్రితం విశాఖ సరిహద్దులోని పండబ పంచాయతీ టిక్కరపాడు సమీప అడవుల్లో మావోయిస్టులకు పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. మావోయిస్టు ప్లీనరీ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకొన్న పోలీసులు దాడి చేయడంతో మావోయిస్టులు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, అక్కడ పోలీసులకు మాత్రం 54 కిట్ బ్యాగ్‌లు లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా ప్లీనరీ జరుగుతోందన్న నిర్ధరణకు వచ్చిన పోలీసులు.. ఒక్కసారిగా కూంబింగ్‌ను ఉధృతం చేశారు. ఆంధ్రా ఒడిశా పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించారు.

పక్కా సమాచారంతోనే దాడి

మావోయిస్టు ఆంధ్రా ఒడిశా బోర్డర్ (ఏవోబీ) కమిటీ సమావేశం సరిహద్దు అడవుల్లో జరుగుతోందన్న పక్కా సమాచారం మేరకే ఇరు రాష్ట్రాల ప్రత్యేకదళాలు రంగంలోకి దిగాయి. సమావేశం జరిగే ప్రాంతం సమీపంలోకి బలగాలు చేరుకోగానే మావోయిస్టు సెంట్రీ పోస్టు గార్డులు గమనించి తమ వారిని అప్రమత్తం చేయడంతో వారు తప్పించుకోగలిగారని తెలిసింది. సమావేశ ప్రాంతానికి చేరుకొన్న పోలీసు బలగాలకు కిట్‌బ్యాగ్‌లు, ఇతర వస్తువులు దొరికాయి. మావోలు తృటిలో తప్పించుకోవడాన్ని పోలీసు అధికారులు తీవ్రమైన విషయంగా పరిగణిస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున బలగాలను రంగంలోకి దింపి ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో విశాఖ జిల్లాలోని పెదబయలు, ముంచంగిపుట్ట మండలాలు, ఒడిశాలోని మల్కన్‌గిరి పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రెండేళ్ల క్రితం ఏవోబీలో భారీ ఎన్‌కౌంటర్

రెండేళ్ల క్రితం ఏవోబీలోని రామగూడ వద్ద జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. అప్పటి ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత ఆర్‌కే తనయుడు కూడా మరణించారు. ఇప్పుడు ఆర్‌కేతో పాటు గాజర్ల రవి అలియాస్ ఉదయ్ తప్పించుకొన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరికోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు జరుగుతున్నాయి. ఏవోబీ నుంచి మావోయిస్టులు విశాఖ మన్యం వైపు వస్తే ఎదుర్కొనేందుకు గ్రేహౌండ్స్ దళాలు సిద్ధంగా ఉన్నాయని విశాఖ ఎస్పీ రాహుల్‌దేవ్ వర్మ



విలేకరులకు చెప్పారు. ప్లీనరీ నుంచి ఆర్‌కే తప్పించుకొన్నాడా లేదా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదని, స్వాధీనం చేసుకొన్న కిట్‌బ్యాగ్‌లు కొద్ది గంటల్లో విశాఖకు చేరతాయని అన్నారు. వాటిని పరిశీలించి నేతలెవరన్నది అంచనా వేస్తామని చెప్పారు.

వారితో కలవం

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలు, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాతో ఎన్నికలకు వెళ్తామన్నారు. బీఎల్ఎఫ్‌లో చేరాలంటే ఏ పార్టీలోనూ చేరాల్సిన అవసరంలేదన్నారు. పార్టీల్లో లేని వారు కూడా బీఎల్ఎఫ్‌లో చేరొచ్చునని, ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశమిస్తామని తమ్మినేని తెలిపారు. ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 19న సంగారెడ్డిలో, 25న మహబూబ్‌నగర్‌లో బీఎల్ఎఫ్ సదస్సులు ఉంటాయని చెప్పారు. కోదండరాం పార్టీ పెట్టడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కోదండరాం, పవన్ కళ్యాణ్ తమ పార్టీ విధానాలను ప్రకటించిన తర్వాత స్పందిస్తామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా, కేసీఆర్ ప్రభుత్వం ఉదాసీనతగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బీజేపీతో అంటకాగేందుకు, స్వప్రయోజనాల కోసమే కేసీఆర్ మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు. ఇకనైనా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై స్పందించి అఖిలపక్ష బేటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్ ఆమోదించకముందే ఢిల్లీకి ప్రతినిధులను తీసుకెళ్లాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

హైదరాబాద్‌లో పార్టీ జాతీయ మహాసభలు

నల్లగొండలో నిర్వహించిన సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతంగా ముగిశాయని తమ్మినేని తెలిపారు. ఏప్రిల్ 18-22 వరకూ హైదరాబాద్‌లో పార్టీ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. సభల నిర్వహణ కోసం ఆహ్వాన కమిటీ, ఆర్థిక, సాంస్కృతి కార్యకలాపాల కమిటీ, విరాళాల సేకరణ కమిటీ, సాహితి, ప్రచార, తదితర 20 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ 2 నెలలపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తామన్నారు. జాతీయ మహాసభల నేపథ్యంలో వేలాదిమంది రెడ్‌షర్ట్ వాలంటీర్లతో కవాతు నిర్వహిస్తామని, ఇందుకోసం వాలంటీర్లకు శిక్షణ కూడా ఇస్తున్నామని తమ్మినేని తెలిపారు.

శతశాతం ప్లేస్‌మెంట్‌తో ఐఐఎం కలకత్తా రికార్డు

కొల్‌కతా, ఫిబ్రవరి 14: శతశాతం ప్లేస్‌మెంట్‌తో ఐఐఎం కలకత్తా సరికొత్త రికార్డు నమోదు చేసింది. 2016-18 విద్యా సంవత్సరంలో ఐఐఎం కలకత్తాలో చదివిన విద్యార్థులందరికీ రెండు రోజుల పాటు జరిగిన ఎంపికల్లో ఉద్యోగావకాశాలు దక్కాయి. 131 సంస్థల నుంచి విద్యార్థులకు 481 ఆఫర్లు వచ్చాయి. ఉద్యోగావకాశం కల్పించిన సంస్థలో యాభై శాతం కన్సల్టింగ్, ఫైనాన్స్ సెక్టార్ సంస్థలు ఉన్నాయి. యాక్సంచర్ స్ట్రేటజీ సంస్థ ఎక్కువ మందికి అవకాశాలు ఇచ్చింది. ఫైనాన్స్ సెక్టార్ నుంచి జేపీ మోర్గన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గన్ స్టాన్లీ, బీస్సీమర్ వెంచర్ పార్ట్‌నర్స్, సిటీ బ్యాంకు వంటి సంస్థలు ప్లేస్‌మెంట్‌లో పాల్గొన్నాయి. వీటితో పాటు అమెజాన్, ఆదిత్య బిర్లా గ్రూప్, స్టార్ అండ్ ఈఎక్సెల్, ఫ్లిప్‌కార్ట్, మైక్రోసాఫ్ట్, ఉబెర్ సంస్థలు ఉద్యోగావకాశాలిచ్చాయి.

అక్టోబర్ 31న 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' ఆవిష్కరణ!

వడోదర, ఫిబ్రవరి 14: స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో గుజరాత్‌లో నిర్మిస్తున్న 182 మీటర్ల పొడవైన సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహాన్ని ఈ ఏడాది అక్టోబర్ 31న ఆవిష్కరిస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జేఎన్.సింగ్ చెప్పారు. గుజరాత్ రాష్ట్రంలోని వడోదరకు వంద కిలోమీటర్ల దూరంలోని సాధూ బెట్ వద్ద స్టాట్యూ ఆఫ్ యూనిటీ పేరుతో నిర్మిస్తున్న భారీ విగ్రహాన్ని పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31న ఆవిష్కరించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దాదాపు 598 అడుగుల విగ్రహ నిర్మాణానికి సంబంధించిన పనులకు 2013, అక్టోబర్ 31న ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. మూడు వేల కోట్ల వ్యయంతో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామంతో ఈ ప్రాజెక్టు నిర్వహిస్తున్నారు. గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జేఎన్ సింగ్ మంగళవారం ఈ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అక్టోబర్ 31 నాటికి పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ప్రపంచంలోని అత్యంత పెద్ద విగ్రహంగా స్టాట్యూ ఆఫ్ యూనిటీ నిలుస్తుందని సింగ్ చెప్పారు. అంతేకాక ఈ ప్రాంతం ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు.

బాలుడిని చంపి.. సూట్‌కేసులో కుక్కి

- తండ్రిపై కోపంతో కొడుకును చంపిన కశాయి
- ఢిల్లీలో దారుణానికి పాల్పడ్డ యువకుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. ఓ బాలుడిని హతమార్చి, మృతదేహాన్ని ఓ సూట్ కేసులో పెట్టి దాచి కిరాతకంగా ప్రవర్తించాడు. ఉత్తర ఢిల్లీలోని భాలస్వా స్వరూప్ నగర్‌లో బుధవారం ఈ ఘటన వెలుగుచూసింది. అవదేశ్ సఖ్య (27) అనే యువకుడు సివిల్ సర్వీసు (ఐఏఎస్)కు సన్నద్ధమవుతున్నాడు. కొన్ని నెలల క్రితం బాలుడి తండ్రికి అవదేశ్‌కి మధ్య గొడవ జరిగింది. పగ పెంచుకున్న అవదేశ్ ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. గత నెల 7వ తేదీన బాలుడికి సైకిల్ కొనిస్తానని నమ్మబలికి తీసుకెళ్లి ఇంట్లో నిర్బంధించాడు. బాలుడిని హతమార్చాడు. అనంతరం బాలుడి మృతదేహాన్ని ఓ సూట్‌కేసులో కుక్కి, తను ఉండే గదిలో మంచం కింద ఉంచాడు. 35 రోజులుగా సూట్ కేసు అక్కడే ఉంది. దుర్వాసన రాకుండా ఉండేందుకు సూట్‌కేసు చుట్టూ సుగంధ ద్రవ్యాలు చల్లేవాడు. మరోవైపు బాలుడు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అవదేశ్ ఉంటున్న గది వద్ద దుర్వాసన వస్తుండడంతో వారు అవదేశ్‌పై అనుమానం వ్యక్తం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు అవదేశ్ గదికి వెళ్లి ప్రశ్నించారు. దుర్వాసన ఏంటని ప్రశ్నించగా, ఎలుకలు చచ్చిన వాసన అంటూ తొలుత బుకాయించాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతని గదిలో సోదా చేశారు. సూట్‌కేసులో కుళ్లిపోయి గుర్తుపట్ట లేని స్థితిలో ఉన్న బాలుడి మృతదేహం వారికి కనిపించింది. అవదేశ్‌ను అరెస్టు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. పోలీసు విచారణలో అవదేశ్ నేరాన్ని అంగీకరించాడు.

కొత్త అణ్వాయుధాల తయారీలో పాక్

- అమెరికా ఇంటలిజెన్స్ హెచ్చరిక

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: కొత్తరకం అణ్వాయుధాలను తయారుచేసే ప్రయత్నాలలో పాక్ నిమగ్నమైందని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. వీటిలో స్వల్ప శ్రేణి ఆయుధాలు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో ప్రమాద తీవ్రత పెరుగుతోందని డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ డ్యాన్ కోట్స్ కాంగ్రెస్‌కు తెలిపారు. సముద్రం నుంచి, ఆకాశం నుంచి ప్రయోగించగలిగే క్షిపణులు, దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు కూడా పాక్ తయారుచేస్తున్న వాటిలో ఉన్నాయన్నారు. జమ్ములోని భారత సైనిక శిబిరంపై జైషే మహ్మద్ ఉగ్రవాదులు దాడిచేసి ఏడుగురు సైనికులను బలితీసుకున్నరోజుల వ్యవధిలో డ్యాన్ కోట్స్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

చెన్నైలో గాడిద.. కుక్క పెళ్లి

- వాలెంటైన్స్ డేకు బీహెచ్‌ఎఫ్ నిరసన
- ప్రేమికులను పరుగుపెట్టించిన బజ్‌రంగ్ దళ్



చెన్నై/లఖ్‌నవ్, ఫిబ్రవరి 14: ప్రేమికుల దినోత్సవ వేడుకలను పలు హిందూ సంప్రదాయవాద సంస్థలు అడ్డుకునే ప్రయత్నం చేశాయి. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో బజ్‌రంగ్ దళ్, భారత్ హిందూ ఫ్రంట్ (బీహెచ్‌ఎఫ్) వంటి సంస్థలు పలు రకాలుగా నిరసనలు తెలిపాయి. చెన్నైలో బీహెచ్‌ఎఫ్ గాడిద.. కుక్కల పెళ్లి చేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేసింది. ఇక్కడి చోళై ప్రాంతంలో సంస్థకు చెందిన మహిళా కార్యకర్తలు ముందుండి ఈ తంతు జరిపారు. పెళ్లికి అవసరమైన వస్తువులను తెచ్చి వాటి ముందుంచారు. అనంతరం వాటికి పూల మాలలు వేసి.. పసుపు, కుంకుమలతో అలంకరించారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో వాటి పెళ్లి తంతు ముగించారు. అనంతరం వాలెంటైన్స్ డేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. దీంతో వారిని చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. ఇక లఖ్‌నవ్, అహ్మదాబాద్, హైదరాబాద్ సహా పలు నగరాల్లో బజ్‌రంగ్ దళ్ కార్యకర్తలు ప్రేమికులను పరుగులు పెట్టించారు. ఎక్కడ ప్రేమ జంటలు కనిపించినా తరిమికొట్టారు. అహ్మదాబాద్‌లోని శబర్మతి నదీ తీరంలో యువతపై దాడులకు దిగారు. కాగా, వాలెంటైన్ డే వేడుకలు జరుపుకోవద్దని హెచ్చరిస్తూ ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవ్ యూనివర్సిటీ బుధవారం సెలవు ప్రకటించింది. ఎవరూ క్యాంపస్‌లో జంటలుగా కనిపించొద్దని నోటీసు జారీ చేసింది. ఎవరు గిఫ్టులు ఇచ్చినా.. తీసుకున్నా కఠిన చర్యలు తప్పవని పేర్కొంది. అయితే దీన్ని విద్యార్థులు వ్యతిరేకించారు. గతంలో వాలెంటైన్స్ డే వేడుకలు జరిగాయని, ఇప్పుడు వర్సిటీని మార్చేయాలని వైస్ చాన్సెలర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

పాక్‌లో ప్రేమికుల దినోత్సవం నిషేధం

- అసభ్యతకు చిహ్నం: ఇస్లామాబాద్ హైకోర్టు



ఇస్లామాబాద్, ఫిబ్రవరి 14: పాకిస్థాన్‌లో ప్రేమికుల దినోత్సవంపై నిషేధం విధించారు. ఈ తరహా వేడుకలు ఇస్లాం సంప్రదాయానికి వ్యతిరేకమని ఇస్లామాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ప్రేమికుల దినోత్సవం అనైతికత, అశ్లీలత, అసభ్యతకు చిహ్నమని పేర్కొంది. దేశంలో ఎక్కడా వాలెంటైన్స్ డే నిర్వహించొద్దని ఆదేశించింది. ప్రేమికుల దినోత్సవానికి సంబంధించి ఎటువంటి కార్యక్రమాలనూ టీవీలు, రేడియోల్లో ప్రసారం చేయకూడదని సూచించింది. దీంతో ఆ దేశ ఎలక్ట్రానిక్ మీడియా రెగ్యులేటరీ సంస్థ (పెమ్రా) ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఏ మీడియా సంస్థ కూడా ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేయకుండా ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి ప్రకటనలు కూడా రాకుండా జాగ్రత్తలు తీసుకొంది.

ఇకపై సినిమాల్లో నటించను

- తమిళ ప్రజలకు సేవ చేస్తా: కమల్‌హాసన్



చెన్నై, ఫిబ్రవరి 14: ఇకపై సినిమాల్లో నటించనని నటుడు కమల్ హాసన్ అన్నారు. తమిళ నాడు ప్రజలకు సేవ చేయాలన్నదే తన ఉద్దేశమని, ఈ నిర్ణయంపై ఏ మాత్రం పునరాలోచన ఉండదని, ఇది ఫైనల్ అని ఆయన తెలిపారు. అందుకే రాజకీయాల్లోకి వచ్చిన తరువాత సినిమాల్లో నటించబోనని స్పష్టం చేశారు.ప్రస్తుతం రెండు చిత్రాలకు ఒప్పుకున్నానని.. ఆ రెండు తరువాత ఇక సినిమాలు ఉండవని తెలిపారు. ఇక ఈ నెలలో పార్టీని ప్రకటించి.. విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని కమల్ చెప్పారు. బోస్టన్‌లోని హార్వర్డ్ యూనివర్సిటీలో ఉపన్యాసం సందర్భంగా ఓ టీవీ చానెల్‌తో మాట్లాడిన కమల్ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే ఎన్నికల్లో ఓడిపోయినా రాజకీయాల్లో కొనసాగుతారా? అన్న ప్రశ్నకు.. నిజాయితీగా రాజకీయాల్లో కొనసాగాలని భావిస్తున్నానని, అయినా తాను ఓడిపోతానని అనుకోవడం లేదని కమల్ చెప్పారు.

మోసం గురూ!

పంజాబ్ నేషనల్ బ్యాంకుకు సున్నం.. 11వేల కోట్ల ఆగంతుక లావాదేవీలు

- 2017 నికరలాభానికి 8 రెట్లు అధికం
- 'వజ్ర' కోటీశ్వరుడు నీరవ్ మోదీ లీల
- 'గీతాంజలి' ఆభరణాల కంపెనీ పాత్ర
- ఇప్పటికే 280 కోట్ల గోల్‌మాల్‌పై కేసు
- ముంబైలోని శాఖ పరిధిలో వ్యవహారం
- సీబీఐకి తాజా ఫిర్యాదు చేసిన పీఎన్‌బీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: సామాన్యుడు పాతిక వేలు పర్సనల్ కావాలంటే లక్ష ప్రశ్నలు వేసి, వెయ్యిసార్లు తిప్పించే ప్రభుత్వ రంగ బ్యాంకులు కోటీశ్వరులకు రూ.కోట్లకొద్దీ దోచిపెట్టి మోసపోతూనే ఉన్నాయి. తాజాగా ప్రభుత్వరంగ బ్యాకులలో రెండో అతిపెద్దదైన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్లకుపైగా మోసపూరిత ఆగంతుక లావాదేవీలను యాజమాన్యం కనుగొంది. ఈ లావాదేవీల విలువ 2017లో బ్యాంకు ఆర్జించిన నికర లాభానికి 8 రెట్లు అధికంగా ఉండటం విశేషం. ముంబైలోని ఒక్క శాఖ పరిధిలోనే ఈ వ్యవహారం సాగినట్లు కేంద్ర నేర పరిశోధన సంస్థకు (సీబీఐ) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కోటీశ్వరుడైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీపై మంగళవారం పొద్దుపోయాక ఫిర్యాదు అందినట్లు సీబీఐ నిర్ధారించింది. అంతేకాకుండా ఇతడితోపాటు ప్రముఖ నగల కంపెనీ 'గీతాంజలి'పైనా ఈ నెల మొదట్లోనే ఒక ఫిర్యాదు అందిందని అధికారులు తెలిపారు. అయితే, ఈ ఫిర్యాదులకు సంబంధించి పూర్తి వివరాల వెల్లడికి వారు నిరాకరించారు.

మరోవైపు ఈ ఘరానా మోసంపై ముంబై స్టాక్ ఎక్స్ఛేంజికి కూడా పీఎన్‌బీ వివరణ పత్రం సమర్పించింది. తమ శాఖతో మోసపూరిత లావాదేవీల ఆధారంగా ఇతర బ్యాంకులు ఇతడికి విదేశాల్లో రుణాలు మంజూరు చేసినట్లు అందులో అనుమానం వ్యక్తం చేసింది. కాగా, ఇదే బ్యాంకును 2017లో రూ.280 కోట్ల మేర మోసగించినట్లు నీరవ్ మోదీపై ఈ నెల 5న సీబీఐకి ఫిర్యాదు అందింది. ఇందులో అతడి భార్య అమీ, సోదరుడు నిషాల్, వ్యాపార భాగస్వామి మెహుల్ చినూభాయ్ చోక్సీ కూడా నిందితులుగా ఉన్నారు.

ప్రపంచ వజ్ర రాజధానిగా పేరొందిన బెల్జియంలోని యాంట్‌వెర్ప్ నగరంలో పెరిగి పెద్దవాడైన 'నీరవ్ మోదీ' తన పేరుతోనే వజ్రాభరణాల డిజైనింగ్ ప్రారంభించాడు. అనతికాలంలోనే వినూత్న ఆభరణాల సృష్టికర్తగా ప్రపంచ సెలబ్రిటీల గుర్తింపు సాధించాడు. భారత్‌లోని ప్రముఖ వజ్రాభరణాల కంపెనీ 'గీతాంజలి' అతడి బ్రాండ్ నగలను దేశవ్యాప్తంగా తమ శాఖలద్వారా విక్రయిస్తోంది.



పంజాబ్ నేషనల్ బ్యాంకులో కుంభకోణంపై మీడియా సందేహాలమీద రిజర్వు బ్యాంకు ఒకా స్పందించలేదు. మరో వైపు ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలున్న దేశాల బ్యాంకులతో పోలిస్తే భారత్‌లో ప్రభుత్వరంగ బ్యాంకులకు రాని బకాయిల బెడద నిష్పత్తి అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో తాజా కుంభకోణం వెలుగు చూడటం దేశీయ ప్రభుత్వరంగ బ్యాంకుల పటిష్ఠతకు సవాలుగా మారనుంది. ఇక సుమారు 100 కోట్ల

భారత బ్యాంకుల పటిష్ఠతకు సవాలు

డాలర్ల విలువైన విదేశీ మారకద్రవ్య లావాదేవీల్లో నిబంధనల ఉల్లంఘనకుగాను పీఎన్‌బీసహా మరో 12 రుణవితరణ సంస్థలకు జరిమానా పడటం ఈ సందర్భంగా గమనార్హం. ఏతావాతా నిరుడు మే నెలలో పీఎన్‌బీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన సునీల్ మెహతా సమర్థతకు ఈ పరిణామాలు పరీక్ష పెడుతున్నాయి.

పీఎన్‌బీలో భారీ మోసం కేసు వెలుగులోకి వచ్చినప్పటికీ పరిస్థితి అదుపులోనే ఉందని కేంద్ర ఆర్థికశాఖలోని ద్రవ్య సేవల విభాగం సంయుక్త కార్యదర్శి లోక్‌రాజన్ చెప్పారు. దీనిపై ప్రస్తుతం పెద్దగా ఆందోళన అవసరం లేదని, తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు సదరు లావాదేవీలన్నీ పరస్పరాధారితాలని బ్యాంకు పేర్కొంది. నిబంధనలతోపాటు ఆ లావాదేవీలలోని వాస్తవికతనుబట్టి

పరిస్థితి అదుపులోనే ఉంది: ఆర్థిక శాఖ

ఏ మేరకు తాము బాధ్యత వహించాల్సిందీ తేలుతుందని పీఎన్‌బీ తెలిపింది. కాగా, ఈ కుంభకోణంలో పాత్రధారులుగా భావిస్తున్న 10 మంది ఉద్యోగులను పీఎన్‌బీ సస్పెండ్ చేసినట్టు బ్యాంకింగ్ సెక్రటరీ రాజీవ్ కుమార్ తెలిపారు. మరోవైపు ఈ వార్తల కారణంగా బుధవారం బ్యాంకు షేర్ల ధర అమాంతం పడిపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజిలో రూ.160తో ప్రారంభమైన పీఎన్‌బీ షేరు ధర మధ్యాహ్నం ఒంటిగంట వేళకల్లా 8 శాతం క్షీణించింది. ఫలితంగా ఇందులో మదుపు చేసినవారి సంపద రూ.3వేల కోట్ల మేర ఆవిరైపోయింది.




పోర్న్‌స్టార్‌కు డబ్బిచ్చాను

- నా సొంత డబ్బే చెల్లించా.. ఎవరూ తిరిగివ్వలేదు
- ట్రంప్ లాయర్ కోహెన్ వెల్లడి

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: ఒకప్పుడు తనకు డొనాల్డ్ ట్రంప్‌తో సంబంధం ఉందని చెప్పిన పోర్న్‌స్టార్‌కు తాను తన సొంత సొమ్ము రూ. 83 లక్షలు చెల్లించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగత లాయర్ వెల్లడించారు. ఆమె అసలు పేరు స్టెఫానీ క్లిఫోర్డ్ కాగా, తెరపై స్టార్మీ డేనియల్స్‌గా చలామణి అవుతుందని, ఆమెకు ఇచ్చిన డబ్బులను తనకు తిరిగి చెల్లించలేదని లాయర్ మైఖేల్ కోహెన్ చెప్పారు. తాను చట్టబద్ధంగానే ఆ డబ్బు కట్టానన్నా.. ఎందుకు చెల్లించాల్సి వచ్చిందన్న వివరాలు మాత్రం వెల్లడించలేదు. క్లిఫోర్డ్‌తో లావాదేవీల విషయంలో ట్రంప్ సంస్థ గానీ, ట్రంప్ గానీ భాగస్వాములు కారని, ఆ డబ్బును తనకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎవరూ తిరిగివ్వలేదని చెప్పారు. 2016 నవంబరు నాటి ఎన్నికలకు సరిగ్గా ఒక నెల ముందు ఆ చెల్లింపు జరిగిందని, ఆమె ఏ విషయాన్నీ బయట పెట్టకుండా ఉండేందుకే ఆ డబ్బిచ్చారని అమెరికా మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే 2006లో క్లిఫోర్డ్‌తో లైంగిక సంబంధాలుండే సమయానికి తాను ప్రైవేటు వ్యక్తినే తప్ప రాజకీయాలతో తనకు సంబంధం లేదన్నది ట్రంప్ వాదన. అప్పటికి ట్రంప్-మెలానియాలకు పెళ్లయింది, నాలుగు నెలల ముందే వాళ్లకు ఒక కొడుకు పుట్టాడు. కాగా క్లిఫోర్డ్‌కు డబ్బులిచ్చిన విషయాన్ని ముందుగా వాల్ స్ట్రీట్ జర్నల్ బయటపెట్టింది.

మేమూ పన్నులు వేస్తాం

- భారత్‌లో దిగుమతి సుంకం ఎక్కువే
- మనం వాళ్ల బైకులపై పన్ను వేయట్లేదు
- ఇక మీదట ప్రతిస్పందన పన్ను విధానం?
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: తమ దేశానికి చెందిన ప్రఖ్యాత హార్లీ డేవిడ్‌సన్ బైకులపై దిగుమతి సుంకాన్ని భారత్ పెంచడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. భారతదేశం నుంచి అమెరికాకు దిగుమతయ్యే బైకులపై దిగుమతి సుంకం వేయగలమంటూ హెచ్చరించారు. భారతదేశం ఇటీవల దిగుమతి సుంకాన్ని 75% నుంచి 50%కు తగ్గించినా చాలదని.. తాము మోటార్ సైకిళ్ల దిగుమతిపై అసలు పన్ను విధించడం లేదన్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీతో గత వారం జరిగిన సంభాషణను ఆయన ప్రస్తావించారు. ''నాకు భారతదేశం నుంచి ఓ పెద్దమనిషి ఫోన్ చేశారు. తాము మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని 75 నుంచి 50 శాతానికి తగ్గించామని చెప్పారు. అంటే హార్లీ డేవిడ్‌సన్ బైకు ఆ దేశంలోకి వెళ్లాలంటే 50 శాతం పన్ను కట్టాలి. కానీ వాళ్లు మాత్రం భారత దేశం నుంచి అమెరికాకు వేలాది మోటార్ సైకిళ్లు ఎగుమతి చేస్తున్నారు. మనం వసూలు చేసే పన్ను ఎంతో తెలుసా.. సున్నా'' అని ఆయన తన కేబినెట్ సహచరులతో వ్యాఖ్యానించారు. తాను భారతదేశాన్ని తప్పుబట్టడం లేదని, కానీ ఇలా చేయడం సరికాదని అన్నారు. మనకు కూడా పరస్పర పన్ను విధానం ఉండాలని చెప్పారు. గతంలో కూడా కొన్ని దేశాల మీద ఈ తరహాలో పరస్పర పన్ను విధానాన్ని విధించాలన్న ప్రతిపాదనను ట్రంప్ తీసుకొచ్చారు. అది అమెరికాలో ఉన్న అపారమైన మార్కెట్‌కు చాలా ఉపయోగపడుతుంది. అక్కడ వాళ్లు పన్ను వసూలుచేయకపోతే మనం కూడా వసూలు చేయబోమని, అలాకాకుండా వాళ్లు ఎంత పన్ను వసూలు చేస్తే మనం కూడా అంతే వసూలు చేస్తామని ట్రంప్ అంటున్నారు. మన దేశంలో ఇంతకుముందు 800 సీసీ కంటే ఎక్కువ ఇంజన్ సామర్థ్యమున్న బైకులపై 75%, అంతకంటే తక్కువ ఉన్నవాటి పై 60% చొప్పున దిగుమతి పన్ను ఉండేది. కానీ ఇటీవల దాన్ని 50 శాతానికి తగ్గించడంతో హార్లీ డేవిడ్‌సన్, ట్రయంఫ్ లాంటి హై ఎండ్ బైకులు చవకయ్యాయి.

ఇజ్రాయెల్ పీఎంపై అవినీతి కేసులు

- నమోదుకు పోలీసుల సిఫారసు
- పదవీ నుంచి వైదొలగబోనన్న నెతన్యాహు



జెరూసలెం, ఫిబ్రవరి 14: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చిక్కుల్లో పడ్డారు. ఆయనపై అవినీతికి సంబంధించి రెండు కేసులు నమోదు చేయాలని ఆ దేశ పోలీసులు సిఫారసు చేశారు. రెండు కేసుల్లో ఆయన పేరు నిందితుడిగా చేర్చాలని సూచించారు. సుదీర్ఘ విచారణ అనంతరం రెండు అవినీతి కేసుల్లో పోలీసులు ఆయనను నిందితుడిగా ధ్రువీకరించారు. నెతన్యాహు, ఆయన భార్య ప్రముఖ వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల నుంచి చాలా ఖరీదైన బహుమానాలు అందుకున్నారనే ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టారు. అయితే పోలీసులు ప్రధానిని నిందితుడిగా చేర్చాలని సిఫారసు మాత్రమే చేయగలరు. దీనిపై ఇజ్రాయెల్ అటార్నీ జనరల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ అంశం అటార్నీ జనరల్ అవించి మాండెల్‌బ్లిట్ చేతిలో ఉంది. దీనిపై ఏ విధంగా విచారణ చేపట్టాలో నిర్ణయించడానికి కొన్ని వారాలు లేదా నెలల సమయం పట్టొచ్చు. నాలుగు సార్లు ప్రధానిగా పనిచేసిన 67ఏళ్ల నెతన్యాహుకు దేశీయంగా, అంతర్జాతీయంగా మంచి పేరు ఉంది. కాగా, తాను ఎలాంటి తప్పు చేయలేదని, తనకు కేసులతో ఎలాంటి సంబంధం లేదని నెతన్యాహు తరచూ చెబుతూనే ఉన్నారు. తాను పదవి నుంచి తప్పుకునేది లేదని ఆయన అన్నారు.

ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది అరెస్టు

- బాట్లాహౌస్ ఎన్‌కౌంటర్‌లో పరారైన అరీజ్
- నేపాల్ సరిహద్దుల్లో పట్టుకున్న ఢిల్లీ పోలీసులు
- ఢిల్లీ పేలుళ్ల సహా పలు కేసుల్లో నిందితుడు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ఢిల్లీ వరుస పేలుళ్ల సహా పలు కేసుల్లో కీలక నిందితుడైన ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది అరీజ్ ఖాన్ అలియాస్ జునైద్ (32)ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. 2008 సెప్టెంబరు 19న ఢిల్లీలోని బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో తప్పించుకొని పరారైన అరీజ్‌ను బుధవారం నేపాల్ సరిహద్దుల్లో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. 2008 సెప్టెంబరు 13న ఢిల్లీలో జరిగిన వరుస పేలుళ్ల 165 మంది మృతి చెందారు. ఈ ఘటనలో నిందితులుగా ఉన్న అరీజ్ ఖాన్ సహా నలుగురు ఉగ్రవాదులు ఢిల్లీలోని జామియా నగర్‌లో గల బాట్లాహౌస్‌లో దాగి ఉన్నారని తెలియడంతో ఢిల్లీ పోలీసులు దాడి చేశారు. ఇందులో ఇద్దరు ఉగ్రవాదులు మరణించగా.. షాజద్ అహ్మద్ అనే ఉగ్రవాదిని అరెస్టు చేశారు. ఎదురుకాల్పుల్లో పోలీసు బృందానికి నేతృత్వం వహించిన ఇన్‌స్పెక్టర్ మోహన్ చంద్ శర్మ అమరుడయ్యారు. ఆ సమయంలో అరీజ్ ఖాన్ అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయాడు. దాదాపు పదేళ్ల తర్వాత బుధవారం అతడిని నేపాల్ సరిహద్దులో ఢిల్లీ ప్రత్యేక సెల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని స్పెషల్ సెల్ డీసీపీ కుష్వాహ మీడియాకు వెల్లడించారు. కాగా, ఉత్తరాఖండ్‌లోని అజమ్‌గఢ్‌కు చెందిన ఇతడిపై 15 లక్షల రివార్డు ఉంది. ఇంజనీరింగ్ చదివిన అరీజ్ బాంబుల తయారీలో నిపుణుడు. ఇండియన్ ముజాహిదీన్‌లో కీలకంగా ఉన్న ఇతడు పలు కేసుల్లో నిందితుడు. ఢిల్లీ పేలుళ్ల కేసుతో పాటు 2008లో జైపూర్, అహ్మదాబాద్... 2007లో ఉత్తరప్రదేశ్ పేలుళ్ల కేసుల్లో అరీజ్ కీలక నిందితుడిగా ఉన్నాడు.

మల ద్వారంలో 12 బంగారు కడ్డీలు


- సిల్చార్ ఎయిర్‌పోర్ట్‌లో ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు



గువహటి, ఫిబ్రవరి 14: బంగారు కడ్డీలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సిల్చార్ ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికులను తనికీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల ప్రవర్తన అనుమానస్పదంగా కనిపించడంతో క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. వారి శరీరంలో దాచిన బంగారు కడ్డీల విషయాన్ని బయటపెట్టారని చెప్పారు. పురీష నాళంలో సుమారు రూ.60 లక్షల విలువైన బంగారు కడ్డీలతో వారు ప్రయాణిస్తున్నట్లు స్కానింగ్‌లో తేలింది. దీంతో కలకత్తా నుంచి వచ్చిన కెకె కక్కర్, జె. లాల్‌ను అరెస్టు చేసినట్లు విమానాశ్రయ భద్రతాధికారులు తెలిపారు. వారి నుంచి కడ్డీల రూపంలో ఉన్న రెండు కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం 12 బంగారు కడ్డీలను కస్టమ్స్ అధికారులకు అప్పగించినట్లు సీఐఎస్‌ఎఫ్ అధికార ప్రతినిధి వివరించారు.

వ్యవ'సాయమే'-పరిష్కారం

- 19, 20న ఢిల్లీలో జాతీయ సదస్సు
- రైతు సమస్యలపై విస్తృతంగా చర్చ
- ప్రధాని మోదీ... నిపుణుల హాజరు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: వ్యవసాయ రంగ సమస్యలపై చర్చించి.. స్వల్ప, దీర్ఘ కాలిక పరిష్కారాలు చూపేందుకు.. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ఈ నెల 19, 20న జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు. వ్యవసాయానికి ఊతమిచ్చి 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర వ్యవసాయ శాఖ ఢిల్లీలో ఈ జాతీయ సదస్సును నిర్వహించనుంది. 20వ తేదీని ప్రధాని మోదీ ఈ సదస్సులో పాల్గొంటారని వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎస్‌కే పట్నాయక్ చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్, నీతి ఆయోగ్ సీనియర్ అధికారులు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, రైతులు, రైతు సంఘాల నాయకులు ఈ సదస్సులో పాల్గొంటారు. సదస్సు తొలి రోజు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు, నిపుణులు ప్రస్తావించనున్నారు. అలాగే వ్యవసాయ, అనుబంధ రంగాల సమస్యలపై చర్చించనున్నారు. నిరుడు ఆహార, వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు కష్టాలపాలయ్యారు. ఎన్నికలు జరిగే మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని రైతులను ఆదుకుంటామని ఇదివరకే కేంద్రం ప్రకటించింది. అంతేగాక, పంటల వ్యయానికి ఒకటిన్నర రెట్లు అధికంగా మద్దతు ధర కల్పిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో ప్రస్తావించారు.

మెట్రో ప్రయాణం ఫ్రీ!

- జర్మన్ నగరాల్లో మితిమీరిన కాలుష్యం
- ఈయూ పరిమితిని దాటేసిన 20 సిటీలు
- వెంటనే అదుపులోకి తేవాలని ప్రయత్నం
- ఉచితంగా ప్రజారవాణా అందించే యోచన
- ప్రభుత్వం.. కార్ల కంపెనీలపై ఉమ్మడిభారం



బెర్లిన్, ఫిబ్రవరి 14: ఆటోమొబైల్ కంపెనీలకు కేంద్రస్థానం, కార్ల ఉత్పత్తికి ప్రధాన కేంద్రం అయిన జర్మనీలో.. కార్ల వాడకాన్ని తగ్గించడానికి ప్రజారవాణా సదుపాయాన్ని ఉచితంగా ప్రజలకు అందించాలని ఆలోచిస్తున్నారు! ఆ దేశంలోని దాదాపు 20 నగరాల్లో నైట్రోజన్ ఆక్సైడ్ కాలుష్య స్థాయిని తగ్గించడానికి ఇదే మంచి మార్గమని భావిస్తున్నారట. ప్రజారవాణాను ఉచితంగా అందిస్తే అప్పుడు ప్రజలు సొంతవాహనాలు వాడటం మానుతారని, దానివల్ల రోడ్ల మీద ట్రాఫిక్ తగ్గడంతోపాటు కాలుష్యం కూడా అదుపులోకి వస్తుందని జర్మన్ పాలకులు అంటున్నారు. యూరోపియన్ యూనియన్ విధించిన వాయు కాలుష్య లక్ష్యాలను చేరుకోలేకపోతే భారీ మొత్తంలో జరిమానాలు కట్టాల్సి ఉంటుంది కాబట్టి దాని కంటే ప్రజారవాణా ఉచితంగా అందించడమే మేలని చెబుతున్నారు. ముందుగా పశ్చిమ జర్మనీ ప్రాంతంలోని ఐదు నగరాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించి చూస్తారు. ఇలా ఉచితంగా రవాణా సదుపాయం అందించడానికి ప్రభుత్వం మీద పడే భారం ఎంతన్నది మాత్రం ఇంకా కచ్చితంగా తెలియలేదు. ముఖ్యంగా మెట్రో రైలు ప్రయాణాన్ని ఉచితంగా ఇవ్వాలన్నది జర్మన్ల ఆలోచనగా కనిపిస్తోంది. ఈ మేరకు జర్మనీ పర్యావరణ శాఖ మంత్రి బార్బరా హెండ్రిక్స్ ఈయూ పర్యావరణ కమిషనర్‌కు తమ ప్రణాళికను వివరిస్తూ ఓ లేఖ రాశారు. దీనికి కావల్సిన నిధులను ప్రభుత్వంతో పాటు కార్ల కంపెనీలు కూడా సమకూరుస్తాయని ఆమె అందులో పేర్కొన్నారు. ఈయూ విధించిన కాలుష్య పరిమితిని దాదాపు 20 జర్మన్ నగరాలు ఎప్పుడో దాటేశాయి. అక్కడ కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకుంది. దాంతో శివార్లలోని పలు పట్టణాల్లో సైతం డీజిల్ వాహనాల వాడకాన్ని నిషేధించాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. పాతబడిన డీజిల్ వాహనాల నుంచే ఎక్కువగా నైట్రోజన్ ఆక్సైడ్ ఉద్గారాలు వెలువడతాయి.



భవిష్యత్‌లో మంజులతో సినిమా చేస్తానేమో!

– మహేష్

ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ నిర్మించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోహీరోయిన్లుగా నటించారు. మంజుల ఘట్టమనేని దర్శకురాలు. ఫిబ్రవరి 16న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మహేష్‌తో పాటు చిత్ర నిర్మాతలు స్వరూప్, పి.కిరణ్, దర్శకురాలు మంజుల ఘట్టమనేని, చిత్ర కథానాయకుడు సందీప్ కిషన్, కథానాయకి అమైరా దస్తూర్, ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన మంజుల తనయ జాన్వి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ''మంజుల డైరెక్షన్ చేస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ఒకసారి హాలీడేస్ టైమ్‌లో తను ఏదో రాసుకొంటుంటే.. ఏదైనా పోయెట్రీ రాసుకొంటుందేమో అనుకొన్నాను. కానీ సినిమా కోసం కథ రాసుకొంటుంది అని మాత్రం అనుకోలేదు. అయితే.. తను కథ ప్రిపేర్ చేసుకొని, సినిమా చేయబోతున్నాను అని చెప్పినప్పుడు మాత్రం నేను షాక్ అయ్యాను. ఒకరకంగా గర్వంగా ఫీల్ అయ్యాను కూడా. ఈ సినిమాకి నేను వాయిస్ ఓవర్ కూడా ఇచ్చాను. విజువల్స్ నాకు బాగా నచ్చాయి. మా కిరణ్ గారి సపోర్ట్, గైడెన్స్ సినిమాకి చాలా ప్లస్ అయ్యింది. సినిమా తప్పకుండా మంచి హిట్ అవుతుందని ఆశిస్తున్నాను. భవిష్యత్‌లో మా అక్క మంజులతో సినిమా కూడా చేస్తానేమో'' అన్నారు.



విశ్వవిఖ్యాత నటసామ్రాట్ కైకాల

సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణకు టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత నటసామ్రాట్ బిరుదు ప్రదానం చేశారు. విశాఖలో జరిగిన మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం సాగింది. ఇందులో టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ వ్యవస్థాపకుడు సుబ్బరామిరెడ్డి, మంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, పార్లమెంట్ సభ్యులు మురళీమోహన్, సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావుల చేతుల మీదుగా కైకాల సత్యనారాయణకు బిరుదుతో పాటు బంగారు కంకణాన్ని ప్రదానం చేశారు. సినీ రంగంలో కైకాల చేసిన కృషికి ఈ అవార్డును బహూకరిస్తున్నట్లు టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. బాలకృష్ణ మాట్లాడుతూ ''నాలుగు దశాబ్దాల సినీ పయనం.. 780 చిత్రాల్లో నటించిన అనుభవం. ఇదీ కైకాల సత్యనారాయణగారిది. ఆయన్ను చూసి నేటి తరం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. సినీ రంగంలో వివిధ తరాలతో, అందరు నటులతో ఎన్నో పాత్రలు పోషించి... సంతప్తిగా సినిమాలకు దూరంగా ఉన్నారు'' అన్నారు. ఈ కార్యక్రమానికి విశాఖ శారదా పీఠం అధ్యక్షులు శ్రీ సరూపానందేంద్ర సరస్వతి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ''కైకాల అన్నిరకాల పాత్రలు పోషించిన ఆల్ రౌండర్'' అన్నారు. అవార్డు గ్రహీత కైకాల మాట్లాడుతూ ''ప్రభుత్వం ఇచ్చిన అవార్డుల కంటే ఈ అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది'' అన్నారు.



● అల్లు అర్జున్

ఏప్రిల్ 26న 'నా పేరు సూర్య'

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయం అవుతూ తెరకెక్కుతున్న చిత్రం ''నా పేరు సూర్య – నా ఇల్లు ఇండియా''. కె. నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్లో శిరీషా శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అర్జున్, శరత్ కుమార్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ క్లైమాక్స్ షూటింగ్ చేస్తున్నారు. ఈ చిత్రంలోని రెండో పాట లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో అనే పాటను ఫిబ్రవరి 14న విడుదల చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఏప్రిల్ 26న విడుదల చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు నిర్మాతలు తెలిపారు.



కథను నమ్మి చేసిన సినిమా

వరుణ్ తేజ్, రాశీ ఖన్నా జంటగా నటించిన సినిమా 'తొలి ప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ దర్శకుడు.ఈ సినిమా థాంక్స్ మీట్‌లో భాగంగా.. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ''కథను నమ్మి ఈ సినిమాను చేశాను. ఈ చిత్రానికి నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ బాగా సెట్ అయ్యారు''అని అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''ప్రతి టెక్నీషియనూ తమ వంతుగా ఈ సినిమాకు అత్యుత్తమంగా కషి చేశారు. ఒక అసిస్టెంట్ డైరక్టర్ వెయిటింగ్‌లో ఉన్నప్పుడు పడే ఆవేదన నాకు తెలుసు. కరుణాకరన్ పవన్‌కల్యాణ్ గారితో 'తొలిప్రేమ'ను క్రియేట్ చేస్తే, ఇప్పుడు వెంకీ అట్లూరి మరలా క్రియేట్ చేశారు. 'ఫిదా' తర్వాత వరుణ్ తేజ్ మరలా ఈ సినిమాలో చాలా బాగా చేశారు. మూడు పాత్రల్లో తను చూపించిన వైవిధ్యం అందరినీ మెప్పించింది'' అని అన్నారు. 'అందరూ నన్ను వర్ష అని పిలుస్తున్నారు. నాకు ఫిమేల్ ఫ్యాన్స్ కూడా పెరిగారు' అని రాశి ఖన్నా తెలిపారు. అని తెలిపారు. 'సంగీతం సక్సెస్‌లో సగం నేను నిర్మాతగారికే ఇస్తాను. ఫక్తు కమర్షియల్ సినిమా ఇది. సినిమా రీరికార్డింగ్‌కి వచ్చినప్పుడు చూడగానే పీల్ నచ్చింది. చాలా జాగ్రత్తగా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ చేశాను'' అని తమన్ తెలిపారు. 'కథను నమ్మిన అందరూ ఈ సినిమా చేశాం. వెంకీ ఎంతో ఇష్టపడి తయారు చేసుకున్న సబ్జెక్ట్ ఇది' అని హీరో వరుణ్ తేజ్ తెలిపారు. తొలి ప్రయత్నాన్ని ఆదరించినందుకు దర్శకుడు వెంకీ అట్లూరి అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



● శ్రియ

వెంకీతో మూడోసారి

వెంకటేష్, తేజ దర్శకత్వంలో ఒక చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ నెల 18నుంచి సెట్స్ మీదకు వెళ్లబోతున్న ఈ సినిమా కోసం 'ఆటా నాదే వేటా నాదే' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన హీరోయిన్‌గా శ్రియ పేరు వినిపిస్తోంది. గతంలో కాజల్ అగర్వాల్, రితికా సింగ్ తదితరుల పేర్లు వినిపించగా.. ఎవరినీ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఇటీవల ఈ కథను శ్రియకు వినిపించగా.. ఇందులో నటించేందుకు ఆమె ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానున్నట్లు సమాచారం. కాగా శ్రియ, వెంకటేశ్ కాంబినేషన్‌లో ఇప్పటికే 'సుభాష్ చంద్రబోస్', 'గోపాల గోపాల' సినిమాలు వచ్చాయి.



అమ్మాయి మనసు లోతు తెలిపే..

దుహర మూవీస్ పతాకంపై విద్యాసాగర్ రాజు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'రచయిత' సంచిత పదుకొనే హీరోయిన్‌గా నటించింది. కల్యాణ్ ధూళిపాళ్ల నిర్మాత. ఈ చిత్రం ఈనెల 16న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో కె.ఎల్.దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'రచయిత సినిమా చాలా బాగా వచ్చింది. సినిమా చూసిన వారందూ మెచ్చుకుంటున్నారు. ఈ సినిమాకోసం హీరో జగపతిబాబు చాలా శ్రమించారు. ఆయన వైజాగ్, విజయవాడ, ప్రకాశం జిల్లాల్లో వాక్ చేసి.. సినిమాను గ్రాండ్ సక్సెస్ చేయాలని ప్రచారం చేశారు'' తెలిపారు. చిత్ర నిర్మాత మాట్లాడుతూ ''సినిమా నిర్మించడం ఒక ఎత్తు. దానిని రిలీజ్ చేయడం ఒక ఎత్తని ఈ సినిమా రిలీజ్ విషయంలో నాకు తెలిసింది. సినిమా కూడా బాగా వచ్చింది. తప్పకుండా ఆదరిస్తారని ఆశిస్తున్నా'' అన్నారు. ఈ సినిమా హీరో, దర్శకుడు విద్యాసార్‌రాజు మాట్లాడుతూ ''ఈ చిత్రం ఎమోషన్ థ్రిల్లింగ్ అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. ఒక అమ్మాయి మనసు డెప్త్ ఎంత వుంటుందో ఇందులో చూపించాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



● సౌమ్య, నందు

'ఇంతలో ఎన్నెన్ని వింతలో' సెన్సార్ పూర్తి

హరహర చలన చిత్ర సమర్పణలో ఎస్ శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహన్‌రావు ఇప్పిలి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. ఈ చిత్రానికి హీరో హీరోయిన్స్ నందు, సౌమ్య వేంగోపాల్, పూజ రామచంద్రన్ కాగా దర్శకుడు వరప్రసాద్ వరికూటి. ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సరిఫికేట్ పొందింది. ఈ నేపథ్యంలో హీరో నందు మాట్లాడుతూ ''నా ముందు సినిమాల కంటే ఈ సినిమాపై ఎక్కువ నమ్మకంగా ఉన్నాను. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. నిర్మాత ఎస్.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ''ఈ సినిమాను సెన్సార్ వారు చూసి అభినందిస్తూ యు/ఏ సర్టిఫికెట్‌ను అందించారు. చాలా సంతోషంగా ఉంది.. సినిమా చుసిన వారందరూ ప్రశంసిస్తున్నారు. ఈ చిత్రాన్ని మర్చి 2న విడుదల చేస్తున్నాము'' అని చెప్పారు.



లేడీ డాన్‌గా దీపిక

పద్మావతిగా విశేష ప్రేక్షకాదరణను పొందిన దీపికా పదుకొనే ప్రస్తుతం విశాల్ భరధ్వాజ్ దర్శకత్వంలో రానున్న చిత్రంలో 'లేడీ డాన్'గా నటిస్తున్నారు. ముంబై మాఫియా సామ్రాజ్యంలో రారాణిగా పేరుపొందిన స్వప్నా దీదీ అలియాస్ అశ్రాఫ్ ఖాన్‌గా ఆమె తెర మీదకు రానున్నారు. తన భర్తను చంపాలని కుట్రపన్నిన మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంను దుబాయ్ నుంచి భారత్‌కు రప్పించి హత్య చేయాలనే ఏకైక లక్ష్యంతో స్వప్న దీదీగా మాఫియా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టిన అశ్రాఫ్ ఖాన్ ఎదుర్కొన్న అనుభవాలు ఎలాంటివో ఈ సినిమాలో చూపించనున్నారు. ఓ మహిళా శక్తి ఎలాంటిదో చూపించే స్వప్నా దీదీ పాత్రలో నటించేందుకు ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాను. నిజంగా జరిగిన స్వప్నా దీదీ కథ నాకు ఎంతో నచ్చింది. ఇంకా ఈ సినిమాకు ఎలాంటి పేరు పెడతారో నాకు తెలియదు. కానీ పద్మావతి పాత్రలో నటించిన నేను ఇప్పుడు అందుకు పూర్తి భిన్నమైన పాత్రలో నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందిస్తున్నాను. పాత్రకు పూర్తి న్యాయం చేస్తానన్న విశ్వాసంతో ఉన్నాను' అని దీపికా పదుకొనే అన్నారు.



సీరియల్‌కి ఎక్కువ సినిమాకి తక్కువ

మనం రివ్యూ

ప్రేమ కథలకు చిరునామాలా నిలిచిన యువతరం కథానాయకుల్లో తరుణ్ ఒకరు. గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఈ హీరో.. 'ఇది నా లవ్ స్టోరి' అంటూ బుధవారం ప్రేక్షకుల ముందుకొచ్చారు. రమేష్ గోపి దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం..



కథాంశం

అభిరామ్ (తరుణ్) ఓ యాడ్ ఫిల్మ్ క్రియేటివ్ హెడ్. చెల్లెలు సునీత ప్రేమించిన అబ్బాయి అమర్‌ను కలుసుకోవడానికి వైజాగ్ వస్తాడు. పనిలో పనిగా చెల్లెలు చెప్పిందని.. అమర్ చెల్లెలు డా.శ్రుతితో పెళ్ళిచూపులకి ఒప్పుకుంటాడు. వచ్చే దారిలో ఓ అమ్మాయిని చూస్తాడు అభి. తొలి చూపులోనే ఆమె పట్ల ఆకర్షితుడవుతాడు. తర్వాత ఆ అమ్మాయే శ్రుతి (ఓవియా) అని తెలుస్తుంది. మాటల మధ్య.. ఇద్దరూ తమ ఫెయిల్యూర్ లవ్ స్టోరీలను చెప్పుకుంటారు. ఈ ప్రాసెస్‌లో.. శ్రుతి మంచితనం నచ్చి ఆమెను ప్రేమిస్తాడు అభి. ఆ తరువాత అతనికో నిజం తెలుస్తుంది. అదేమిటంటే.. తను అనుకున్నట్లుగా ఆమె శ్రుతి కాదు. ఆమె స్నేహితురాలు అభినయ అని. అయినప్పటికీ.. ఆమెనే ప్రేమిస్తున్నానని చెబుతాడు. అభినయ కూడా అతనిని ఇష్టపడుతుంది. ఇద్దరూ ఆ రాత్రి దగ్గరవుతారు. కట్ చేస్తే.. తరువాత రోజు ఉదయం.. పోలీసులకు ఫోన్ చేసి అభిరామ్‌ను అరెస్ట్ చేయిస్తుంది. అసలు అభినయ ఎందుకు అలా ప్రవర్తించింది? అభిరామ్, అభినయ చివరికి ఒక్కటయ్యారా? లేదా? అనేదే మిగిలిన కథ.

విశ్లేషణ

తెరపై ఎన్ని ప్రేమకథలు వచ్చినా.. ప్రతి కథలోనూ ఏదో ఒక కొత్త కోణం ఉంటుంది. ఈ సినిమాలోనూ అలాంటి కోణాన్ని టచ్ చేసే ప్రయత్నం చేశారు దర్శకులు రమేష్ గోపి. అదేమిటంటే.. ప్రేమలో విఫలమైన అబ్బాయి, అమ్మాయి తమ గతాలను పంచుకునేటప్పుడు.. అబ్బాయి గతంలోని మహి పాత్రలో కూడా శ్రుతినే చూపించడం.. అలాగే అమ్మాయి గతంలోని జోసెఫ్ పాత్రలో అభిరామ్‌ను చూపించడం. ఈ కోణం ఆసక్తికరంగా ఉన్నా కథనం నిస్సారంగా ఉండడంతో.. ఈ ప్రేమకథ ఆకట్టుకోవడంలో పూర్తిగా విఫలమైంది. కథ, కథనం కంటే డైలాగ్స్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టడం.. వాటిలో ఎక్కువ శాతం సిల్లీగా ఉండడంతో డీలా పడడం ప్రేక్షకుల వంతు అయ్యింది. కన్నడంలో మంచి విజయం సాధించిన 'సింపులాగి ఒందు లవ్ స్టోరి' ఆధారంగా రూపొందిన ఈ చిత్రాన్ని నూతన దర్శకులు రమేష్ గోపి.. మాతృక కంటే వినోదాత్మకంగా తెరకెక్కించాలనే ప్రయత్నం చేసినా.. అందులో ఎంగేజింగ్ మూమెంట్స్ లేకపోవడంతో..చతికిలబడినట్లయ్యింది. ప్రేమకథల్లో ఉండాల్సిన ఫీల్, ఎమోషన్స్ ఏ ఒక్క సందర్భంలోనూ కనిపించకపోవడం సినిమాకి ప్రధాన లోటుగా మారింది. ఇక ట్రైలర్ చూసి.. ఇదేదో ఫీల్ గుడ్ లవ్ స్టోరీ అనుకుని థియేటర్‌కు వెళ్తే.. అందుకు భిన్నంగా సినిమా సాగడం ప్రేక్షకులకు నిరాశ కలిగించే అంశం. మొత్తానికి సీరియల్స్‌ను తలపించే కథనంతో సినిమాని ఆద్యంతం విసుగెత్తించే ప్రయత్నంలో దర్శకులు సక్సెసయ్యారు. నటీనటుల విషయానికి వస్తే.. ఒకప్పటి లవర్ బాయ్ తరుణ్‌కు ఇది కమ్ బ్యాక్ ఫిల్మ్. తన శైలి నటనతో అక్కడక్కడ ఆకట్టుకున్నారు. కథానుసారం.. మూడు లుక్స్‌తో కనిపించారాయన. మూడింటిలో.. హీరోయిన్ ఫ్లాష్ బ్యాక్ వెర్షన్‌లో కనిపించే జోసెఫ్‌గా తరుణ్ బాగున్నారు. ఉన్న ఒకట్రెండు ఎమోషనల్ సీన్స్‌లో రాణించారు. ఇక హీరోయిన్ ఓవియా.. నటన పరంగా పర్లేదనిపించినా.. ప్రేమకథకు కావాల్సిన ఫ్రెష్ లుక్ అయితే ఆమెలో లేదు. ప్రధానంగా ఈ సినిమా.. వీరిద్దరి పాత్రల చుట్టే తిరుగుతుంది.. కాబట్టి మిగిలినవారి గురించి చెప్పుకోవడానికి ఏమీ లేదు. సాంకేతికంగా చూసుకుంటే.. శ్రీనాథ్ విజయ్ సంగీతంలో 'ఏదో ఏదో', 'ఏ నిమిషంలో' పాటలు వినడానికి, చూడడానికి బాగున్నాయి. నేపథ్య సంగీతం.. కొన్ని సన్నివేశాల్లో ఓకే అనిపిస్తుంది. క్రిస్టోఫర్ జోసెఫ్ ఛాయాగ్రహణం.. ప్రకృతి అందాలను బాగానే ఒడిసిపట్టింది. మాటల్లో చాలా వరకు నాసి రకంగా ఉన్నప్పటికీ.. ''పెళ్ళికి సాక్ష్యం ఉంటుంది కాని ప్రేమకు సాక్ష్యం ఉండదుగా సర్'', ''జ్ఞాపకాల కంటే విలువైనవి లైఫ్‌లో ఏమీ ఉండవు'', ''డబ్బుకు లక్ష్మి, చదువుకు సరస్వతి..ప్రేమకు ఎవరూ లేరు'', ''ప్రేమను ప్రేమతోనే దక్కించుకోవాలి'' వంటి కొన్ని డైలాగులు బాగున్నాయి. నిర్మాణ విలువలు జస్ట్ ఓకే.

రేటింగ్: 1.75/5



హరోం హర.. శంభో శంకర!

- మల్లన్న సేవలో భక్తజన తన్మయత్వం
- స్నానాల ఘాట్‌లో పోటెత్తిన సందోహం
- శ్రీశైలంలో మల్లన్న రథోత్సవ మహావైభవం


కర్నూలు (శ్రీశైలం), ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం భక్త జన సంద్రంగా మారింది. 'హరోం హర... శంభో శంకర' అన్న నినాదాలతో పట్టణం హోరెత్తింది. డమరుక నాదంతోపాటు వేదమంత్రోచ్చారణతో మారుమోగింది. మంగళవాద్య ఘోష నడుమ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి ఊరేగింపు చూస్తూ జనం తన్మయులయ్యారు. బుధవారం దేశం నలుమూల నుంచి వచ్చిన భక్తులు స్వామి దర్శనం కోసం బారులుతీరారు. తొలుత స్వామి, అమ్మవార్లకు అర్చక పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీశ్వరునికి పూజలతోపాటు లోక కల్యాణార్థం జపాలు, మంటపారాధన చేశారు. పంచవర్ణార్చన, నిత్యహవనం, రుద్రహోమం, చండీహోమం తదితరాలను ఆగమ శాస్త్రానుసారం నిర్వహించారు. సాయంకాలం ప్రదోష కాల పూజల్లో భాగంగా హోమం, జపానుష్ఠానాలు సాగాయి.

వైభవంగా రథోత్సవం

సాయంత్రం రథోత్సవం మహా వైభవంగా సాగింది. గంగాధర మంటపంవద్ద రథాంగ పూజ, హోమం, బలి కార్యక్రమాలను అర్చక పండితులు నిర్వహించారు. సాత్విక బలిగా గుమ్మడికాయలు, కొబ్బరి కాయలు, కుంభం, సమర్పించారు. తర్వాత ఉత్సవ మూర్తులను రథంపై పురవీధులలో ఊరేగించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ఈ వేడుకను తిలకించినవారికి సర్వ పాపాలు తొలగిపోవడంతోపాటు కోరిన కోర్కెలు తీరుతాయన్నది భక్తుల విశ్వాసం. రథోత్సవం సందర్భంగా మహిళా కళాకారులు కోలాట నృత్యంతో భక్తులను ఆకట్టుకున్నారు. ఇక నిత్య కల్యాణ మంటపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. సదస్యంలో భాగంగా వేద స్వస్తి, నాగవల్లిలో భాగంగా కల్యాణ మూర్తులైన స్వామి, అమ్మవార్లకు సంప్రదాయం ప్రకారం మెట్టెలు, నల్లపూసలు సమర్పించారు. దేవస్థానం వారు పుష్కరిణి వద్ద, శివదీక్ష శిబిరాల వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



ఆంధ్రప్రదేశ్‌కు 'ఆసియా పల్ప్' పరిశ్రమ



తీరంలో ఏర్పాటుకు ప్రతిపాదన.. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కంపెనీ ప్రతినిధుల భేటీ

- స్థలం ఇచ్చిన రెండున్నరేళ్లలో ఉత్పత్తి
- భూ పరిశీలనకు రండి.. చంద్రబాబు
- సాగులో 'బేయర్' టెక్నాలజీ సాయం
- 22న కియా 'ఫ్రేమ్‌వర్క్' పనులు షురూ
- ప్రారంభోత్సవానికి సీఎంకు ఆహ్వానం

అమరావతి, ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి): ప్రపంచంలోనే కాగిత పరిశ్రమ రంగంలో అతి పెద్ద సంస్థ అయిన ఆసియా పల్ప్ అండ్ పేపర్ (ఏపీపీ) కంపెనీ నవ్యాంధ్రలో అడుగుపెట్టబోతోంది. దేశంలోనే అతి పెద్ద కాగిత తయారీ పరిశ్రమను ఏపీలో నెలకొల్పుతామంటూ సంస్థ యాజమాన్యం ముందుకొచ్చింది. బుధవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ ఆ కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తమ యూనిట్ నెలకొల్పేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున ముడిపదార్థాల దిగుమతికి కోస్తా తీరం ఎంతో అనువుగా ఉంటుందని, ఈ ప్రాంతంలో ఏదైనా ఓడ రేవుకు సమీపంలో 2,500 ఎకరాల భూమి కేటాయించాలని సీఎంను కోరారు. వారి ప్రతిపాదనలపై చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించారు. కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాలను పరిశీలించాల్సిందిగా కంపెనీ ప్రతినిధులకు ఆయన సూచించారు. తమకు భూమిని కేటాయించిన రెండున్నరేళ్లలోనే ఉత్పత్తిని ప్రారంభిస్తామని ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి చెప్పారు. ఉత్పత్తిలో నాలుగో వంతు దేశీయ విపణికే కేటాయిస్తామని వెల్లడించారు.



వ్యవసాయంలో అత్యాధునిక టెక్నాలజీ

జర్మనీకి చెందిన ఆగ్రో కెమికల్స్ సంస్థ బేయర్ ఆంధ్రప్రదేశ్ రైతులకు పంట సంరక్షణ, సాగులో టెక్నాలజీ వినియోగం, డిజిటల్ ఫార్మింగ్ వంటి అంశాలలో సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు సచివాలయంలో సీఎం చంద్ర బాబును కలిసి ఆ కంపెనీ ప్రతిపాదనలు సమర్పిం చింది. సన్న, చిన్నకారు రైతుల సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తామని, వివరించారు. రోజుకు సరాసరి 4 వేల టన్నుల ఉత్పత్తి ఇప్పటికే పలు ప్రాంతాల్లో సాగులో సాంకేతికతను మేళవించి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని దాని ప్రతినిధులు సీఎంకు వివరిం చారు. భూసార పరీక్షల్లో అధునాతన పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ల సాయంతో పని చేస్తామన్నారు. టమాటా పంటకు ప్రసిద్ధి చెందిన మద నపల్లిలో, మామిడి పంటకు ప్రఖ్యాతిగాంచిన చిత్తూరు జిల్లాలో ఉన్న అవకాశాలను అం దిపుచ్చుకోవడాలని సీఎం సామర్థ్యంతో వారికి సూచించారు. ఈ పరిశ్రమను నెలకొల్పుతామని

రాజధాని పనుల పర్యవేక్షణకు డ్రోన్లు

రాజధాని అమరావతి నిర్మాణ పనులలో వేగం పెంచాలని, నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గృహ నిర్మాణం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయడంలో విఫలమైతే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులు, సర్వీస్ ప్రొవైడర్లతో సీఎం చంద్రబాబు సమావేశమైయ్యారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సహకారం తీసుకొని 15 రోజులకు ఒక సారి డ్రోన్ల ద్వారా చిత్రాలు తీసి తనకు చూపించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. చేపట్టిన పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేస్తేనే పెట్టుబడిదారులు ముందుకు వస్తారని ఆయన స్పష్టం చేశారు.

పనులకు సంబంధించిన యంత్ర సామగ్రి, మెటీరియల్ విషయంలో ఇబ్బందులు ఉంటే ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. పనులు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మరోవైపు అనం తపురంలో ఏర్పాటు చేస్తున్న కియా కార్ల కంపెనీ ఈ నెల 22న ఫ్రేమ్‌వర్క్ పనుల ప్రారంభోత్సవానికి తలపెట్టింది. ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా సీఎం చంద్రబాబును కియా మోటార్స్ ఎండీ కూఖ్యున్ షిమ్ ఆహ్వానించారు.

కేంద్ర మంత్రుల రాజీనామా?

- త్వరలోనే టీడీపీ నిర్ణయం
- ఎంపీల రాజీనామాకు నో
- కేంద్ర నిధులపై శ్వేతపత్రం
- బీజేపీని మరీ గట్టిగా తిట్టొద్దు
- రాజీనామాపై జగన్ డ్రామా
- టీడీపీ ముఖ్యనేతలతో చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా కేంద్రంలోని తన మంత్రులతో రాజీనామా చేయించాలని టీడీపీ ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 6న తన ఎంపీలతో రాజీనామా చేయిస్తానని జగన్ చెప్పడంతో దానికి కౌంటర్‌గా అంతకంటే ముందే మంత్రులతో రాజీనామా చేయిస్తే వైసీపీ వ్యూహాన్ని దెబ్బ తీయచని టీడీపీ భావిస్తున్నట్లు సమాచారం. రాజీనామా అంశాన్ని ఎప్పుడు ప్రకటించాలో తనకు తెలుసని.. దాన్ని తనకు వదిలేయాలని టీడీపీ ముఖ్యనేతలకు పార్టీ అధినేత చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. బుధవారం ఉదయం సచివాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. జగన్‌ను కౌంటర్ చేయడానికి తీవ్ర నిర్ణయం తీసుకోక తప్పదని మంత్రులు సూచించగా ఆయన పైవిధంగా స్పందించినట్లు సమాచారం.

కేంద్ర నిధులపై శ్వేతపత్రం

కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై త్వరలోనే శ్వేత పత్రం విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. శ్వేతపత్రం కావాలంటూ వైసీపీ, బీజేపీ, సీపీఎం, జన సేన నేతలు పదే పదే డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని మంత్రులు ప్రస్తావించగా, ఇందులో దాపరికాలేమీ లేవని.. త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేద్దామని చంద్రబాబు అన్నట్లు తెలిసింది.

'హార్ష్'గా తిట్టద్దు

మిత్రపక్షమైన బీజేపీని టీడీపీ నాయకులెవ్వరూ హార్ష్(పరుషపదజాలం)గా తిట్టొద్దని చంద్రబాబు సూచించారు. ''బీజేపీతో మనకు వ్యక్తిగత తగాదాలు లేవు. కేంద్రానికి ఏపీ కష్టాలు అర్థమయ్యేలా వివరించండి. వాళ్లను తిట్టుకుంటూ పోతే ప్రజల్లో చులకన భావం ఏర్పడుతుంది. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారు. అలాగని మౌనంగా కూడా ఉండద్దు. ఎవరికి చెప్పాల్సిన రీతిలో వారికి సమాధానం చెప్పండి'' అని నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కాగ ''2016 ఫిబ్రవరిలో ప్రత్యేక హోదా ఇవ్వకపోతే రాజీనామా చేస్తామని వైసీపీ ప్రకటించింది. అప్పుడే ప్యాకేజీ ఇస్తామని జైట్లీ ప్రకటించారు. అప్పుడు రాజీనామాలు ఎందుకు చేయించలేదు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలలో బీజేపీకి ఆ పార్టీ మద్దతిచ్చింది. ఇటీవల కేంద్రబడ్జెట్ బాగుందని తన ఎంపీలతో మాట్లాడించారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయ ప్రయోజనాల కోసం ఏప్రిల్ 6న రాజీనామాలు చేస్తామని మాట్లాడుతున్నారు. హోదా కోసమే అయితే రెండేళ్ల పాటు ఎందుకు ఆగారు? దీనిపై ప్రతిపక్షం ప్రజలకు సమాధానం చెప్పాలి'' అని చంద్రబాబు జగన్‌పై విరుచుకుపడ్డారు. నియోజకవర్గాల విభజన అంశంలోనూ వైసీపీపై ఆయన మండిపడ్డారు. వాళ్లు మాట్లాడుతున్నారు.'' అని దుయ్యబట్టారు. ఎంపీలతో కూడా రాజీనామాలు చేయిస్తే... ఇక కేంద్రంలో చేతులు కట్టుకుని కూర్చోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని చంద్రబాబు విశ్లేషించారు. ''బీజేపీతో పొత్తు తెగదెంపులు చేసుకోవటం నిమిషం పని. ఎంపీల చేత కూడా రాజీనామాలు చేయిస్తాం. ఇప్పుడే ఎన్నికలు లేవు. ఈలోపు రాష్ట్ర అభివృద్ధికి వచ్చే నిధులను కూడా ఆపేస్తారు. పోలవరం గురించి కూడా పట్టించుకోరు. నెల నెలకు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఖర్చులు కూడా రావు. అంతవరకు ఎందుకు? ఇటీవల మేం ఒక కేంద్రమంత్రిని కలిసేందుకు వాళ్ల పేషీకి వెళ్లాం. అప్పుడే, కేంద్రమంత్రి వద్దకు ఒక రాష్ట్ర మంత్రి వచ్చి కలిశారు. రాష్ట్రానికి చెందిన కీలక ప్రాజెక్టు అని.. దానికి నిధులివ్వాలని కోరారు. అలాగేనని చెప్పి.. మాముందే ఆ ఫైల్‌ను 'త్రో ఇట్ అవుట్' అని చెత్త బుట్టలో పడేశారు. ఇది వాస్తవ పరిస్థితి. కేంద్రం నుంచి న్యాయంగా రావాల్సిన నిధులు కూడా ఆగిపోతే రాష్ట్రానికి ఇబ్బందులు వస్తాయి. దాని గురించే నేను ఆలోచిస్తున్నాను'' అని చంద్రబాబు వివరించారు.

ప్రధాని అయ్యే ఆలోచన లేదు

ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ మంగళవారం సచివాలయానికి వచ్చి చంద్రబాబును ఇంతకన్నా పెద్దస్థాయిలో చూడాలన్న విషయాన్ని మంత్రులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. మీరు ప్రధాని అవ్వాలనుకుంటున్నారా? అని ఒక మంత్రి సరదాగా అడిగారు. దానికి చంద్రబాబు స్పందిస్తూ...''నాకు ప్రధానమంత్రి సీటు మీద కూర్చోవాలన్న కోరిక ఎంత మాత్రం లేదు. అలా అనుకుంటే గతంలోనే అవకాశం వచ్చింది. దాన్ని తిరస్కరించా. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. సింగపూర్ దేశం కన్నా రాష్ట్ర జనాభా 30 రెట్లు ఎక్కువ. ఒక దేశం కన్నా ఎక్కువ మంది ఉన్న రాష్ట్రానికి నేను సీఎంగా ఉన్నాను. అంత కన్నా నాకు ఏం కావాలి. కట్టుబట్టలతో హైదరాబాద్‌ను వదిలేసి వచ్చాం. అతి తక్కువ కాలంలో సచివాలయంలో మంచి నిర్మాణాలు చేపట్టాం. ఈ కృషిని చూసి ముకేష్ అంబానీ పెద్ద హోదా అని భావించి ఉంటారు'' అని చంద్రబాబు సమాధానమిచ్చినట్లు తెలిసింది.

జాతీయ రాజకీయాలు వద్దనుకున్నా

పార్లమెంటులో కుట్రతో కేంద్రం రాష్ట్రవిభజన చేసిన తీరును చూసినప్పుడే జాతీయ రాజకీయాలు వద్దనే నిర్ణయం తీసుకున్నానని చంద్రబాబు వెల్లడించారు. ''ఆరోజు తలుపులు మూసి లోక్‌సభలో బిల్లు ఆమోదించారు. అదే విషయాన్ని బీజేపీ ముఖ్యనేత అద్వానీకి వివరిస్తున్నా. అదే సమయంలో వాళ్ల వ్యక్తిగత సహాయకుడు వచ్చి ఆయన చేతికి ఒక స్లిప్ ఇచ్చారు. రాజ్యసభలో కూడా విభజన బిల్లు పెడుతున్నారు. కొద్దిసేపట్లో రాజ్యసభ తలుపులు కూడా మూసేస్తారని ఆ స్లిప్‌లో ఉంది. వీళ్లు ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని కోపంగా లోపలికి వెళ్లిన అద్వానీ.. రాజ్యసభలో మౌనంగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మోదీని కలుసుకున్నా. రెండోసారి కలిసినప్పుడు మోదీని ఈ విషయాన్ని అడిగా. రాష్ట్రవిభజన హేతుబద్ధంగా జరగనప్పుడు మీరు ఎందుకు మద్దతిచ్చారని నేను మోదీని ప్రశ్నించా. అప్పటికే తమ విజయం ఖాయమని తెలిసిందని, ఇదే సమస్య తాము అధికారంలోకి వచ్చాక కూడా కొనసాగడం ఎందుకనే ఉద్దేశంతోనే తాము సరేనన్నామని మోదీ సమాధానమిచ్చారు. దాంతో నేను షాక్ అయ్యా. జాతీయ రాజకీయాల్లోకి రాకూడదనే మెంటల్‌గా డిసైడ్ అయ్యా'' అని చంద్రబాబు నేతలకు వివరించినట్లు తెలిసింది.



16న పవన్‌తో రామకృష్ణ, మధు భేటీ

అమరావతి, ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, పి.మధు సమావేశం కానున్నారు. ఈ నెల 16న హైదరాబాద్‌లో ఈ సమావేశం జరగనుంది. రామకృష్ణ, మధులకు పవన్ ఫోన్ చేసి సమావేశానికి రావాల్సిందిగా కోరగా, వారు అంగీకరించారు. విభజన హామీలకు సంబంధించి ప్రజలకు వాస్తవాలు వెల్లడించేందుకు జేఎఫ్‌సీ ఏర్పాటు చేయనున్నట్టు పవన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో పనిచేయడానికి జయప్రకాశ్ నారాయణ, ఉండవల్లి అరుణ్‌కుమార్ సుముఖత వ్యక్తం చేశారు. కమిటీలో వామపక్షాల నేతలను కూడా భాగస్వామ్యం చేయనున్నట్టు పవన్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనతో వామపక్ష నేతలు సమావేశం కానుండటం ప్రాధాన్యం ఏర్పడింది.

విశాఖ ఉక్కు తరహాలో హోదా ఉద్యమం


విశాఖ ఉక్కు తరహాలో ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తామని మధు పేర్కొన్నారు. బుధవారం విజయవాడ దాసరి భవన్‌లో రామకృష్ణ, మధు తదితరులు సమావేశమయ్యారు. ఈ నెల 18వ తేదీన విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలానే వైజాగ్‌లో 28న రైల్వే జోన్ అంశంపై నిరసన చేపట్టనున్నట్లు చెప్పారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా మార్చి 6న ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేసే ప్రతి పార్టీని కలుపుకొని పోతామని చెప్పారు.

చెన్నైలో తెలుగు టెకీపై దాడి

చెన్నై, ఫిబ్రవరి 14: విజయవాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై చెన్నైలో దాడి జరిగింది. ఆమెను కొట్టి, ఆమె నడుపుతున్న వాహనంతో పాటు 3 తులాల బంగారు గొలుసు, ఐఫోన్ కూడా లాగేసుకుని ఆమెను రోడ్డుపక్కనున్న పొదల్లోకి విసిరేసి దుండగులు పారిపోయారు. దక్షిణ చెన్నై శివార్లలోని తలంబూర్-పెరుంబాక్కం రోడ్డులో ఈ దారుణం జరిగింది. పి. లావణ్య (27) చెన్నైలోని గ్లోబల్ ఇన్ఫోటెక్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తెల్లవారుజామున తన విధులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా రోడ్డుమీద వెళ్తున్న కొంతమంది ఆమెను ఆపి మరీ దోచుకుని పక్కన పొదల్లో విసిరేశారు. అదృష్టవశాత్తు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆ రోడ్డు మీదుగా వెళ్తున్న ఓ వ్యక్తి.. స్పృహతప్పి పడి ఉన్న ఆమెను చూసి పోలీసు కంట్రోల్‌రూంకు ఫోన్ చేయడంతో వెంటనే పల్లికరనై పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆమెను పెరంబాక్కం సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాఉ. అర్ధరాత్రి 2 గంటలకు తన షిఫ్టు అయిన తర్వాత ఆమె ఇంటికి బయల్దేరిందని, నూకంపాళ్యంలో ఉండే తన అక్క ఇంటికి వెళ్దామని అటు వెళ్తుండగా ఇలా జరిగిందని పోలీసులు తెలిపారు. ముఠా సభ్యులు వెనక నుంచి దాడి చేయడంతో వాళ్లెవరో ఆమెకు తెలియలేదు. 2014లో చెన్నై ఇన్ఫోసిస్‌లో పనిచేసే తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉమామహేశ్వరి (24) తొలుత అదృశ్యమైంది. తర్వాత పోలీసులు గాలించగా ఓ వివాదాస్పద స్థలంలో ఆమె మృతదేహం బయటపడింది.

రాజీనామాలు 'జగన్నా'టకం

- బడ్జెట్‌పై జగన్ మాట్లాడరేం?: గంటా



విశాఖపట్నం/అమరావతి ఫిబ్రవరి 14 (మనం న్యూస్‌బ్యూరో): ఎంపీల రాజీనామాల పేరుతో జగన్ మరోసారి నాటకం ఆడుతున్నారని మంత్రి గంటా శ్రీనివాసరావు మండిపడ్డారు. బుధవారం విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌పై జగన్ ఇంతవరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదని, ఆయన పార్టీకి చెందిన ఎంపీ విజయసాయిరెడ్డి మాత్రం బడ్జెట్ అద్భుతం అంటూ పార్టీ అభిప్రాయాన్ని చెప్పారని గంటా అన్నారు. తన పాదయాత్రకు ప్రజాస్పందన లేకపోవడం వల్లే ఇప్పుడు జగన్ మరోసారి ఎంపీల రాజీనామా డ్రామాను తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఎంపీల రాజీనామాలకు ఆయన గతంలో చాలా తేదీలు ప్రకటించారని.. ఇదేదో 2016లోనే చేసుంటే నంద్యాల ఉప ఎన్నికతో పాటే ఈ లోక్‌సభ స్థానాలకూ ఎన్నికలు జరిగేవని వ్యాఖ్యానించారు. అలాగే ఈ రాజీనామాలకు కూడా తేదీని ఏప్రిల్ 6 కాకుండా ఏప్రిల్ 1 అని చెప్పి ఉంటే జనాలు ఫూల్స్‌డే అని నవ్వుకునేవారని గంటా శ్రీనివాసరావు విమర్శించారు. తన మీద ఉన్న కేసులను మాఫీ చేయించుకోడానికి, అవినీతి ఆరోపణల నుంచి బయటపడటానికి ఆయన జగన్నాటకం ఆడు తున్నారని ఆరోపించారు.

టెట్ నిర్వహణ లోపాలపై గంటా ఆగ్రహం

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు కేంద్రాల కేటాయింపుల్లో పొరపాట్లు చోటు చేసుకోవడంపై మంత్రి గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం పై సంబంధిత అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఏ జిల్లా నుంచి దరఖాస్తు చేసిన అభ్యర్థిని ఆ జిల్లాకు కాకుండా ఒక మూల నుంచి మరో మూలకు విసిరేయడం ఏమిటని నిలదీశారు. పరీక్ష కేంద్రాలను మార్చుకునేందుకు అంతర్రాష్ట్ర విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించిందని, రాష్ట్రంలోనే దూర ప్రాంతాలకు వేసిన వారి గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. తొలిసారి ఆన్‌లైన్‌లో టెట్ పరీక్ష నిర్వహిస్తున్నందున ఏ చిన్న పొరపాటుకు తావివ్వొద్దని పదేపదే చెబుతున్నా అలసత్వం కనబరుస్తుండడం సరికాదని హెచ్చరించారు. టెట్ నిర్వహణలో లోపాలు- ఇతర అంశాలపై గురువారం విజయవాడలో సమీక్ష నిర్వహించాలని మంత్రి నిర్ణయించారు. ఈ నెల 21 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

చింతమనేనికి రెండేళ్ల జైలు

- రూ. 2500 జరిమానా కూడా..
- శిక్ష... వెంటనే బెయిల్ మంజూరు



ఏలూరు, ఫిబ్రవరి 14 (మనం న్యూస్ బ్యూరో): ఏపీ ప్రభుత్వ విప్, పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు రెండేళ్ల జైలుశిక్ష, రూ. 2500 జరిమానా పడ్డాయి. మూడు సెక్షన్ల కింద వేర్వేరుగా శిక్షలు విధించినా.. అన్నింటినీ ఏక కాలంలో అనుభవించాలని చెప్పడంతో గరిష్ఠంగా రెండేళ్ల వరకు జైలుశిక్ష పడినట్లయింది. ఈ మేరకు భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి కె. దీప దైవకృప తీర్పునిచ్చారు. అయితే, ఆ వెంటనే ప్రభాకర్‌కు బెయిల్ కూడా మంజూరైంది. 2011లో దెందులూరులో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో నాటి మంత్రి వట్టి వసంతకుమార్‌పై ప్రభాకర్ దాడి చేయడంతో.. నవంబరు 26న వసంతకుమార్ దెందులూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనతోపాటు ఆయన గన్‌మన్ ఎన్.సుబ్బారావు కూడా ఫిర్యాదు చేయడంతో పోలీసులు 353, 506 (2), 7(1) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అప్పటినుంచి దాదాపు ఆరేళ్లకు పైగా విచారణ కొనసాగింది. ఈ సమయంలో అప్పట్లో అక్కడున్న ప్రత్యక్ష సాక్షులను విచారించి బుధవారం తుదితీర్పు వెల్లడించారు. సెక్షన్ 352 ప్రకారం 6 నెలల జైలుశిక్ష, 1000 రూపాయల జరిమానా, 506 (2) ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా, 7 (1) ప్రకారం ఆరు నెలలు జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధించారు. అయితే క్రిమినల్ ఎమెండ్‌మెంట్ యాక్ట్ 1932 ప్రకారం మూడు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో తెలిపారు. ఒకవేళ జరిమానా కట్టకపోతే అదనంగా మరో నెలరోజులు జైలుశిక్ష అనుభవించాలని తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రవిప్రసాద్ వాదనలు వినిపించగా ముద్దాయి తరపున ఇ.శ్రీనివాసరావు వాదించారు. మార్చి 14వ తేదీ లోపు హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



వృద్ధిని కొనసాగిస్తున్న జపాన్

టోక్యో: జపాన్ ఆర్థిక వ్యవస్థ 2017తో ముగిసిన మూడు నెలల కాలంతో కలిపితే వరుసగా ఎనిమిది త్రైమాసికాలలో వృద్ధిని కనబరచినట్లు అయింది. ప్రభుత్వ డాటా ఈ సంగతిని వెల్లడించింది. 1980ల చివరి రోజుల్లో కనపడిన విజృంభణ రోజుల తర్వాత, ఇంత ఎక్కువ కాలంలో, ఆర్థిక వ్యవస్థ వృద్ధిని కనబరుస్తూ రావడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. గత ఏడాది నాల్గవ త్రైమాసికంలో స్థూల జాతీయోత్పత్తి అంతకుముందు మూడు నెలలలో ఉన్నదానికన్నా 0.1 శాతం పెరిగిందని క్యాబినెట్ కార్యాలయం వెల్లడించింది. కానీ, ఈ వృద్ధి మార్కెట్లు అంచనా వేసిన 0.2 శాతం కన్నా తక్కువగానే ఉంది. అంతకుముందు జూలై-సెప్టెంబరు క్వార్టరులోని 0.6 శాతంతో పోలిస్తే ఇది మందగమనానికి ప్రాతినిధ్యం వహించినట్లే లెక్క. వార్షిక రేటు ప్రకారం చూస్తే, ప్రపంచంలోని ఈ మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ 0.5 శాతం వృద్ధి చెందినట్లు లెక్క. వినిమయ వ్యయ ధోరణులు, పరికరాలు, సదుపాయాలపై జపాన్ సంస్థల పెట్టుబడులు పెరగడం ఆర్థిక వృద్ధికి తోడ్పడిన అంశాల్లో ఉన్నాయి. ఎగుమతులు పెరిగాయి. కానీ, దిగుమతులు కూడా వేగవంతమైన రీతిలో పెరిగాయి. ఆర్థిక వృద్ధి కొనసాగుతున్న ధోరణి ప్రధాన మంత్రి షింజో అబేకు శుభ వర్తమానంలా పరిణమించింది. ఆయన తన వ్యయ అనుకూల విధానంతో ఆర్థిక వ్యవస్థలో చురుకు పుట్టించేందుకు ప్రయత్నిస్తూ వస్తున్నారు. కోలుకుంటున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊతంతో, ఎగుమతులను ఆలంబనగా చేసుకుని జపాన్ ఆర్థిక వ్యవస్థ వృద్ధిని సాధిస్తోంది. దేశంలో 2020 ఒలింపిక్ క్రీడోత్సవాలకు సన్నాహంగా మౌలిక వసతులను ఉన్నతపరుస్తున్నారు. ఇది పురికొల్పిన దేశీయ డిమాండ్ కూడా ఆర్థిక వృద్ధికి తోడ్పడింది. అయితే, వేతనాలు, వినిమయంలో వృద్ధి స్థిరంగా అంతంత మాత్రంగా కొనసాగుతూండడంతో జపాన్ ఆర్థిక వ్యవస్థ ద్రవ్య మాంద్యంతో ఇప్పటికీ సతమతమవుతోంది.

పెర్త్‌లో ఓలా సేవలు షురూ



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో ''పరిమిత ప్రాతిపదికపై'' సర్వీసులు ప్రారంభించినట్లు క్యాబ్ హైరింగ్ కంపెనీ ఓలా బుధవారం తెలిపింది. సాఫ్ట్‌బ్యాంక్ అండతో నడుస్తున్న ఈ కంపెనీ ఆస్ట్రేలియా మార్కెట్‌లో ప్రవేశించనున్నట్లు గత నెలలో వెల్లడించింది. పది ఆస్ట్రేలియన్ డాలర్ల విలువ వరకు మొదటి రెండు రైడ్లను పెర్త్ పౌరులకు ఉచితంగా అందించనున్నట్లు ఓలా తెలిపింది. సిడ్నీ, మెల్‌బోర్న్, పెర్త్‌లలో ప్రైవేటు కిరాయి వాహన యజమానులను తన ప్లాట్‌ఫాంలోకి తీసుకోవడం ప్రారంభించినట్లు జనవరిలో ఓలా తెలిపింది. ఆస్ట్రేలియా మార్కెట్‌లో ఓలాకు ప్రధాన ప్రత్యర్థిగా ఉబెర్ ఉంది. ఈ రెండు కంపెనీలు భారతీయ మార్కెట్‌లో నాయకత్వం గడించేందుకు తీవ్ర పోరాటంలో ఉన్నాయి. ఉబెర్ 2012లోనే ఆస్ట్రేలియాలో సర్వీసులు ప్రారంభించింది. సిడ్నీ, మెల్‌బోర్న్, బ్రిస్బేన్, అడిలైడ్, పెర్త్, కాన్‌బెర్రాలతో సహా 19 ఆస్ట్రేలియన్ నగరాలలో ఉబెర్ సేవలందిస్తోంది. ఇక 2011లో మొదలైన ఓలాకి భారతదేశంలోని 110 నగరాల్లో 125 మిలియన్ల యూజర్లు ఉన్నారు.



పవన విద్యుత్ టారిఫ్ పెరిగింది పైసాయే

న్యూఢిల్లీ: పవన విద్యుత్ టారిఫ్‌లు అట్టడుగు స్థాయిని చూసినట్లుగా కనిపిస్తోంది. తాజాగా 2000 మెగావాట్ల సామర్థ్యాలకు సాగిన వేలంలో యూనిట్ ధర రూ. 2.44గా మాత్రమే కోట్ అయింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (ఎస్.ఇ.సి.ఐ) మంగళవారంనాడు ఈ వేలం నిర్వహించింది. 2000 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యాలకు టొరెంట్ పవర్, ఐనాక్స్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్, గ్రీన్ ఇన్‌ఫ్రా విండ్ ఎనర్జీ, రెన్యూ పవర్ తో సహా దాదాపు ఆరు సంస్థలు లోయస్ట్ బిడ్డర్లుగా అవతరించినట్లు అభిజ్ఞ వర్గాలవారు తెలిపారు. ఈ నాలుగు సంస్థలు యూనిట్‌కు రూ. 2.44 టారిఫ్ కోట్ చేయగా, అదానీ గ్రీన్ ఎనర్జీ, ఆల్ఫానార్ కంపెనీలు యూనిట్‌కు రూ. 2.45 కోట్ చేశాయి. గుజరాత్ ఊర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్ (జి.యు.వి.ఎన్.ఎల్) గత డిసెంబరులో నిర్వహించిన వేలంలో పవన విద్యుత్ టారిఫ్ ఇంతకుముందెన్నడూ ఎరుగనంత కనిష్ఠ స్థాయికి యూనిట్‌కు రూ. 2.43కు పడిపోయింది. టారిఫ్ తగ్గుతూపోవడం గత ఏడాది మొదలైంది. ఎస్.ఇ.సి.ఐ 1 గిగా వాట్ మొదటి విడత వేలంలో అది రూ. 3.46కు తగ్గింది. ఎస్.ఇ.సి.ఐ 2017 అక్టోబరులో 1 గిగా వాట్‌కు నిర్వహించిన రెండవ విడత వేలంలో అది మరింతగా రూ. 2.64కు పడిపోయింది. భారతదేశం 2022 నాటికి 60 గిగా వాట్ల పవన విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. పవన టారిఫ్ పటిష్టమైతే కాలుష్య రహిత ఇంధన రంగానికి బలం చేకూరినట్లు అవుతుంది. ప్రస్తుతం భారతదేశానికి 32.7 గిగా వాట్ల పవన విద్యుదుత్పాదన సామర్థ్యం ఉంది. ప్రభుత్వం 2018-19లో 10 గిగా వాట్లకు, 2019-20లో మరో 10 గిగా వాట్లకు వేలం నిర్వహించాలని ప్రణాళిక వేసుకుంది.

లాభాల స్వీకరణతో కుంగిన సూచీలు

ఆర్బీఐ కొత్త నిబంధనలతో కుదేలైన బ్యాంకింగ్ రంగ షేర్లు



ముంబయి: బుధవారం ట్రేడింగ్ చివరలో సాగిన లాభాల స్వీకరణతో బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' సోమవారంకన్నా 144 పాయింట్ల దిగువన ముగిసింది. స్ట్రెస్సడ్ ఎసెట్లను గుర్తించడానికి సంబంధించి ఆర్.బి.ఐ నూతన నిబంధనలు జారీ చేయడంతో బ్యాంకిం గ్ రంగ షేర్లు చతికిల పడ్డాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) సుమారు రూ. 11,335 కోట్ల విలువ చేసే మోసపూరిత లావాదేవీలు కనుగొన్నట్లు వెల్లడించడంతో, దాని షేర్ ధర బుధవారం 9.81 శాతం క్షీణించింది. మొండి బాకీల పరిష్కారాన్ని వేగవంతం చేసే ప్రయత్నంలో, రుణాల వసూలులో ఏ విధమైన ఎగవేతనైనా సరే వేగంగా గుర్తించి, పరిస్థితిని చక్కదిద్దేందుకు నడుం బిగించే విధంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) నిబంధనలను కట్టుదిట్టం చేసింది. ఇప్పుడున్న అర డజ ను రుణ పునర్నిర్మాణ యంత్రాంగాలను ఆర్.బి.ఐ రద్దు చేసింది. రుణాన్ని ఎగవేసిన కేసులో పరిష్కార ప్రణాళికకు రావడానికి బ్యాంకులకు 180 రోజుల గడువును విధించింది. ఆ కాల పరిధిలో ఏమీ చేయలేకపోతే సదరు రుణం తీసుకున్న సంస్థను దివాలా ప్రక్రియ పరిశీలనకు పంపవలసిందని ఆదేశించింది.

గీటురాయిగా భావించే బి.ఎస్.ఇ 'సెన్సెక్స్', దేశీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో 34,436.98 పాయింట్ల వద్ద బుధవారం ఉద యం అధిక స్థాయిలోనే మొదలైంది. అది ఒక దశలో 34,473.43 పాయింట్ల గరిష్ఠ స్థితికి చేరుకుంది. తర్వాత, చోటుచేసుకున్న ప్రాఫిట్ బుకింగ్‌తో 34,028.68 పాయిం ట్ల కనిష్ఠ స్థితిని చూసి, చివరకు 34,155.95 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' ఇంట్రా-డేలో 10,590.55- 10,456.65 పాయింట్ల మధ్య ఊగిసలాడిన అనంతరం చివరకు 10,500.90 పాయింట్ల వద్ద ముగిసింది.

పెరిగిన పారిశ్రామిక ఉత్పత్తి

వస్తూత్పత్తి, మూలధన వస్తువుల రంగ బలమైన పనితీరుతో డిసెంబరులో పారిశ్రామిక ఉత్పత్తి 7.1 శాతం పెరిగినట్లు సోమవారం ట్రేడింగ్ వేళలు ముగిసిన తర్వాత విడుదలైన డాటా తెలియజేసింది. మరోపక్క, ఆహార పదార్థాల ధరలు చల్లబడడంతో, డిసెంబరులో 17 నెలల గరిష్ఠ స్థాయిలో 5.21 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం జనవరిలో స్వల్పంగా తగ్గి 5.07 శాతంగా నిలిచింది.

''పటిష్టమైన ఐ.ఐ.పి వృద్ధి, మందగిస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం పొందుతోందనడానికి కొన్ని సంకేతాలుగా నిలుస్తున్నాయి. కానీ, సామర్థ్యం మేరకు కొన్ని కంపెనీలు లాభాలు కనబరచకపోవడం వల్ల విస్తృత మార్కెట్ కొంత ఉత్థాన పతనాలను చవిచూసింది. రుణ పునర్నిర్మాణ పథకాలు చాలా వాటిని ఆర్.బి.ఐ రద్దు చేసింది. లేకపోతే, మొండి బాకీలకు పక్కనపెడుతున్న మొత్తాలు ఇంకా పెరిగిపోవచ్చని అది కలవరపడింది. అవి బ్యాంకుల లాభదాయకతపై ప్రభావం చూపుతున్నాయి. ఆర్.బి.ఐ నిర్ణయంతో పి.ఎస్.యు బ్యాంకుల షేర్లు అమ్మకాలకు లోనయ్యాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ అన్నారు.

వాళ్ళు అమ్మితే... మనం కొన్నాం

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సోమవారంనాడు రూ. 814.11 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 1,342.70 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశాయి.

ప్రైమరీ క్రషింగ్ ప్లాంట్ ప్రారంభం

న్యూఢిల్లీ: జార్ఖండ్‌లోని వెస్ట్ బొకారోలో రూ. 57 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రాథమిక క్రషింగ్ ప్లాంట్‌ను టాటా స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన కార్యనిర్వహణాధికారి టి.వి. నరేంద్రన్ బుధవారం ప్రారంభించారు. జంషెడ్‌పూర్, కళింగ నగర్‌లలో ఉక్కు పనులకు అవసరమైన బొగ్గు అవసరాలు తీర్చడానికి టాటా స్టీల్‌కు ఈ నూతన సదుపాయం తోడ్పడుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాలరీలో బొగ్గు బెనిఫికేషన్ పెంపొందించే లక్ష్యంతో ప్రైమరీ క్రషింగ్ ప్లాంట్ (పిసిపి3) ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీనివల్ల వ్యయం గణనీయంగా ఆదా అవుతుంది. వార్షిక




నికర లాభాలు పెరుగుతాయి. ప్రస్తుతం పి.సి.పి2కు రోడ్డు ద్వారా బొగ్గు రవాణా వల్ల కంపెనీకి ఎక్కువ ఖర్చు అవుతోంది. పి.సి.పి3 ఉత్పత్తిని పెంచడానికేకాక, భద్రతా పరమైన, పర్యావరణ పరమైన సమస్యల పరిష్కారానికి కూడా తోడ్పడుతుంది. కంపెనీ ఉక్కు ఉత్పత్తికి ముడి సరకు క్రమం తప్పకుండా సరఫరా కావడం కీలకం. టాటా స్టీల్ గ్రూప్ 27.5 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యంతో నడుస్తోంది. ప్రపంచంలోని అతి పెద్ద ఉక్కు కంపెనీలలో ఇది ఒకటి.

సవరణలకు కేంద్రం సిద్ధం



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్ బిల్లు (ఎఫ్.ఆర్.డి.ఐ)పై కేంద్రం మనసు మార్చుకుంది. డిపాజిట్ బీమాకు గరిష్ఠ పరిమితిని ''నిర్దిష్టంగా పేర్కొనేందుకు''కు సిద్ధంగా ఉన్నట్లు అది పార్లమెంట్ సంయుక్త కమిటీకి తెలియజేసింది. ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లుపై ఏర్పాటు చేసిన కమిటీకి సీనియర్ బి.జె.పి నాయకుడు భూపేందర్ యాదవ్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ అంశంపై ప్రభుత్వ తాజా వైఖరి గురించి ఈ కమిటీ ఆర్.బి.ఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌తో సోమవారం చర్చించింది. అయితే, డిపాజిట్ బీమా పరిమితి లక్ష రూపాయలుగా ఉన్న ప్రస్తుత నిబంధన పట్లనే గవర్నర్ మొగ్గు చూపుతున్నారు. ప్రతిపాదిత రిజల్యూషన్ కార్పొరేషన్, నియంత్రణ సంస్థల ద్వారా, సంస్థలు ప్రీమియంగా చెల్లించవలసిన మొత్తాన్ని పేర్కొనవచ్చని ఆర్థిక వ్యవహారాల శాఖ (డి.ఇ.ఏ) ఒక తాజా నోట్‌లో కమిటీకి తెలిపింది. అయితే, డి.ఇ.ఏ వైఖరిపై ఉర్జిత్‌కు కొన్ని భయాందోళనలున్నాయి. ''బ్యాంక్ ఖాతాదారుల్లో 91 శాతం మంది లక్ష రూపాయల బీమా రక్షణలో ఉన్నారని ఆయన మాకు చెప్పారు. విలువ ప్రకారం చూస్తే, ఇది మొత్తం డిపాజిట్లలో 29 శాతం కిందకు వస్తుంది. మేం గరిష్ఠ పరిమితిని పెంచితే, బ్యాంకులపై అధిక బీమా ప్రీమియంల భారం పడుతుందని ఆయన ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత వ్యవస్థ కొనసాగడానికే ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారు. డి.ఇ.ఏ నూతన వైఖరిని పరిశీలించవలసిందిగా మేం ఆయనను అభ్యర్థించాం...ఏ సంగతీ మళ్ళీ చెబుతానని ఆయన మాతో అన్నారు'' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని కమిటీ సభ్యుడు ఒకరు చెప్పారు. డిపాజిట్ బీమా పెంచడానికి బిల్లులోని క్లాజు 29(1) వీలు కల్పిస్తోందని డి.ఇ.ఏ ఇంతకుముందు నియంత్రణ సంస్థలు, బ్యాంకులకు హామీ ఇచ్చింది. ప్రస్తుతం లక్ష రూపాయల వరకు ఉన్న డిపాజిట్ రక్షణనే కొనసాగిస్తామని బిల్లులో ఎక్కడా స్పష్టంగా పేర్కొనలేదని డి.ఇ.ఏ తన తాజా నోట్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. డిపాజిట్ బీమా రక్షణ పరిమితిని నిర్దిష్టంగా పేర్కొనేందుకు బిల్లును సవరిస్తే సవరిస్తామని కూడా అది తెలిపింది. ఏ డిపాజిటర్‌కు సంబంధించి అయినా కార్పొరేషన్ చెల్లించే మొత్తం నగదు, 1961 నాటి డిపాజిట్ అండ్ క్రెడిట్ ఇన్స్యూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డి.ఐ.సి.జి.సి) చట్టంలోని 16వ సెక్షన్‌లో ఒకటవ ఉప విభాగంలోని రెండవ నిబంధన కింద నోటిఫై చేసిన మొత్తం నగదును మించి ఉండని విధంగా, బిల్లులోని 145వ సెక్షన్‌లో రెండవ ఉప విభాగంలోని క్లాజు (హెచ్) తర్వాత అదనపు క్లాజును చేర్చవచ్చని అది సూచించినట్లు తెలిసింది. కార్పొరేషన్ ఈ చట్టంలోని 29వ సెక్షన్‌లో ఒకటవ ఉప విభాగం కింద వర్తించే మొత్తాన్ని నిర్దిష్టంగా పేర్కొనేంత వరకు ఈ ఏర్పాటును కొనసాగించవచ్చని అది సూచించింది. ''1993లో నిర్ణయించిన లక్ష రూపాయల మొ త్తం చాలా తక్కువగా ఉందని, దాన్ని సవరించాలని వ్యక్తమవుతున్న ఆందోళనను ఇది పరిష్కరిస్తుంది. ఉర్జిత్ ఇచ్చి న వివరణతో, ఈ బిల్లుకు ఆర్.బి.ఐ వ్యతిరేకం కాదని, దానిలోని కొన్ని క్లాజులను మాత్రమే అది వ్యతిరేకిస్తోందని మాకు అర్థమైంది. ఏకాభిప్రాయ సాధనే కమిటీ కర్తవ్యం'' అని ఆ సభ్యుడు చెప్పారు. లక్ష రూపాయల పరిమితి కొనసాగించే విధంగా ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లుకు కొత్త నిబంధన జోడించాలని ఆర్.బి.ఐ సూచించింది. సర్వీసు ప్రొవైడరు రిజల్యూషన్ ఫీజును ఎప్పటి వరకు చెల్లించవలసి ఉంటుందనే కాల పరిధిపై బిల్లులో స్పష్టత లేదని ఆర్.బి.ఐ పేర్కొంది. ప్రతిపాదిత రిజల్యూషన్ కార్పొరేషన్ పాత్రతో సహా బిల్లులోని క్లాజులపై ఏకాభిప్రాయ సాధనకు కేంద్రం, నియంత్రణ సంస్థలు, ఈ అంశంతో ప్రమే యం ఉన్న ఇతరులతో కమిటీ చర్చలు జరుపుతోందని ఆ సభ్యుడు తెలిపారు. బిల్లులోని వివిధ క్లాజులపై ఆర్.బి.ఐ, బ్యాంకులు, స్టాక్ ఎక్ఛ్సేంజీలు, బీమా కంపెనీలు, డిపాజిటరీలు గతంలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి.




పెన్షను ఫండుపై ప్రభావం తక్కువే



కోల్‌కతా: జాతీయ పెన్షను పథకం (ఎన్.పి.ఎస్)పై ప్రతిపాదిత దీర్ఘకాల మూలధన లాభ పన్ను ఏమంత ఎక్కువ ప్రభావం చూపించకపోవచ్చని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పి.ఎఫ్.ఆర్.డి.ఏ) ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ''మాపై దాని ప్రభావం ఏమంత ఉండదు. జాతీయ పెన్షన్ వ్యవస్థలో మా ట్రస్టు (ఎన్.పి.ఎస్ ట్రస్టు) పెట్టుబడులు పెడుతుంది. అది పన్ను మినహాయింపు పొందిన సంస్థ. పెన్షన్ పెట్టుబడులకు సంబంధించినంత వరకు ఎల్.టి.సి.జి ప్రభావం ఉండకపోవచ్చు'' అని ఎన్.పి.ఎస్ నియంత్రణ సంస్థ పి.ఎఫ్.ఆర్.డి.ఏ చైర్మన్ హేమంత్ కాంట్రాక్టర్ మంగళవారం ఇక్కడ చెప్పారు. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సహకారంతో ఎన్.పి.ఎస్‌పై నిర్వహించిన ఒక సమావేశం సందర్భంగా సమాచార సాధనాలవారితో కాంట్రాక్టర్ విడిగా మాట్లాడారు. అయితే, పెన్షనేతర ఖాతాగా పేరున్న టైర్ టూ ఎకౌంట్లపై దాని ప్రభావం ఉండవచ్చని ఆయన చెప్పారు. ఎన్.పి.ఎస్ రెండు (టైర్ వన్, టైర్ టూ)తరహాల ఎకౌంట్లనూ నిర్వహిస్తుంది. ''టైర్ టూకు పన్ను ప్రయోజనాలు లేవు. టైర్ టూ ఖాతాపై ప్రభావం ఉండవచ్చు. కానీ, టైర్ టూ ఖాతాలో ఉన్న పెట్టుబడుల మూల నిధి చాలా తక్కువ'' అని కాంట్రాక్టర్ అన్నారు. లిస్టెడ్ ఈక్విటీ షేర్ల బదలీపై గడించిన, లక్ష రూపాయలకు మించిన లాభాలపై దీర్ఘకాల మూలధన లాభ పన్నును తిరిగి ప్రవేశపెడుతున్నట్లు 2018 కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది. ఎన్.పి.ఎస్ రెండు కోట్ల మంది చందాదార్ల నుంచి సేకరించిన రూ. 2.25 లక్షల కోట్ల మూలనిధితో నడుస్తోంది. ''మా చందాదార్లు ఏటా 27-28 శాతం పెరుగుతున్నారు. మేం రెండు కోట్ల చందాదార్ల మైలురాయిని ఇటీవలే చేరుకున్నాం. మార్చిలో సుమారు 1.54 కోట్ల మంది చందాదారులున్నారు. వచ్చే ఏడాది కూడా వృద్ధిలో ఇదే వేగం కొనసాగించగలమని భావిస్తున్నాం'' అని కాంట్రాక్టర్ చెప్పారు. నిర్వహణ కిందనున్న ఆస్తులు వచ్చే ఏడాది 45-47 శాతం వృద్ధి చెందవచ్చని పి.ఎఫ్.ఆర్.డి.ఏ భావిస్తోంది. ఈ పెన్షన్ ఫండ్ సంస్థ మార్చి 31 నాటికి అటల్ పెన్షన్ యోజన కింద కోటి చందాదార్లను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ''ప్రస్తుతం మా వద్ద రూ. 4000 కోట్లతో సుమారు 88 లక్షల మంది చందాదారులున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన రోజుల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు మేం కఠిన ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే ఏడాది, మరో 50 లక్షల మందిని చేర్చుకునేందుకు మేం ప్రయత్నిస్తాం'' అని పి.ఎఫ్.ఆర్.డి.ఏ ఛీఫ్ తెలిపారు.

యాంటి-డంపింగ్‌పై సమీక్ష

ఉక్కు చక్రాల దిగుమతులపై ఐదేళ్ళుగా అమలులో ఉన్న కుమ్మరింత నిరోధక సుంకం




న్యూఢిల్లీ: చైనా నుంచి దిగుమతి అవుతున్న బల్లపరుపు మట్టు ఉక్కు చక్రాలపై ఇప్పుడున్న కుమ్మరింత నిరోధక సుంకాన్ని, దేశీయ వస్తూత్పత్తి సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, కొనసాగించాలా? లేదా? అనే అంశాన్ని సమీక్షించేందుకు భారత్ దర్యాప్తు చేపట్టింది. ఈ సుంకం విధింపునకు ఉన్న గడువు తీరిపోయిన తర్వాత, మళ్ళీ పెద్ద సంఖ్యలో ఆ వస్తువులు దేశంలోకి వచ్చిపడతాయా, దేశీయ పరిశ్రమకు నష్టం కలిగిస్తాయా అనే అంశాన్ని కూడా వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన దర్యాప్తు విభాగం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ యాంటి-డంపింగ్ అండ్ ఎలైడ్ డ్యూటీస్ (డి.జి.ఏ.డి) పరిశీలించనుంది. ఈ అంశాన్ని సమీక్షించి, ప్రస్తుతం వీల్స్ దిగుమతులపై ఉన్న యాంటి-డంపింగ్ సుంకాలను కొనసాగించవలసిందిగా కోరుతూ కల్యాణి మాక్సియాన్ వీల్స్, వీల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థలు దరఖాస్తు దాఖలు చేశాయి. ''అమలులో ఉన్న సుంకాల విధింపును కొనసాగించాల్సిన అవసరం ఉందా అనే అంశాన్ని సమీక్షించేందుకు దర్యాప్తు చేపడుతున్నాం'' అని డి.జి.ఏ.డి ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇందుకుగాను డి.జి.ఏ.డి 2016 అక్టోబరు నుంచి 2017 సెప్టెంబరు మధ్యనాటి పరిస్థితులను పరిశీలించనుంది. అది దర్యాప్తునకు 2014-17 డాటాను కూడా పరిశీలించనుంది.

98 వస్తువులపై యాంటి-డంపింగ్ సుంకం

ఆర్థిక మంత్రి 2013లో వీల్స్‌పై యాంటి-డంపింగ్ సుంకాన్ని ఐదేళ్ళపాటు విధించారు. చైనా నుంచి దిగుమతి చేసుకునే ఆ వస్తువులపై టన్నుకు 613 అమెరికన్ డాలర్ల సుంకాన్ని విధిస్తున్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకునే దాదాపు 98 వస్తువులపై ఇండియా యాంటి-డంపింగ్ సుంకాన్ని విధించింది. గత ఏడాది డిసెంబరు 27నాటి పరిస్థితి అది. యాంటి డంపింగ్ సుంకం పడిన వస్తువుల్లో ఫ్లాక్స్ ఫ్యాబ్రిక్స్, విటమిన్ సి, కొన్ని రకాల ఫైబర్లు, రసాయనాలు ఉన్నాయి. చైనాతో వాణిజ్య లోటు (ఎగుమతులకన్నా దిగుమతులు ఎక్కువగా ఉండడం) భారతదేశానికి ఎప్పుడూ ఆందోళనకర అంశంగానే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబరు కాలంలో వాణిజ్య లోటు 36.73 బిలియన్ల అమెరికన్ డాలర్లుగా ఉంది. ఉత్పత్తి వ్యయంకన్నా తక్కువ ధరలకే దిగుమతి అవుతున్న వస్తువులు దేశీయ పరిశ్రమను దెబ్బతీస్తున్నాయా అనే అంశాన్ని నిర్ధారించుకునేందుకు వివిధ దేశాలు యాంటి-డంపింగ్ దర్యాప్తులు చేపడుతున్నాయి. వాటిని ఎదుర్కొనే చర్యగా అవి బహుముఖీన డబ్ల్యు.టి.ఓ వ్యవస్థ కింద సుంకాలు విధిస్తున్నాయి. వ్యాపారం నిష్పాక్షికంగా సాగేందుకు, దేశీయ పరిశ్రమలకు సమాన పోటీ అవకాశాలు కల్పించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నారు. అది దిగుమతులపై ఆంక్షలు విధించడానికో లేదా వస్తువుల ధరలు అన్యాయంగా పెంచడానికో ఉద్దేశించిన చర్య కాదు.

తగ్గిన టాటా పవర్ లాభం



న్యూఢిల్లీ: పన్నుల అనంతరం టాటా పవర్ లాభం ఏకీకృత ప్రాతిపదికన 2017 డిసెంబరు 31తో ముగిసిన మూడు నెలల కాలంలో 1.13 శాతం తగ్గి రూ. 612 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో కంపెనీ పన్నుల అనంతరం రూ. 619 కోట్ల లాభాలను కనబరచగలిగింది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3లో సంస్థ రాబడి రూ. 7,096 కోట్లుగా ఉంది. పునరుత్పాదక ఇంధన విభాగం నుంచి ఆభం 2017 అక్టోబరు-డిసెంబరు కాలంలో నాలుగు రెట్లు పెరిగి రూ. 72 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో అది రూ. 14 కోట్లుగా మాత్రమే ఉంది. కంపెనీ 2017-18 క్యూ 3లో మొత్తం విద్యుత్ ప్లాంట్లు అన్నింటి నుంచి 12,402 మిలియన్ల యూనిట్ల విద్యుత్ ఉత్పాదన సాధించగలిగింది. టాటా పవర్ గ్రూప్ క్యూ 3లో 227 మెగావాట్ల సౌర విద్యుత్, 5.4 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పాదక సామర్థ్యాలను సమకూర్చుకుంది. విద్యుత్ రంగంలో నిపుణులకు ఉన్న కొరతను భర్తీ చేసేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్‌తో టాటా పవర్ ఒక అవగాహనా పత్రంపై సంతకాలు చేసింది.

మనం పర్యాటకం
గురువారం, 15 ఫిబ్రవరి 2018
www.manamnews.com

ట్రావెల్ కిట్ కావాలి!



రకరకాల ప్రదేశాలు చుట్టేయాలన్న కోరిక చాలా మందికి ఉంటుంది. కానీ అక్కడ వాతావరణానికి కొంత మంది అడ్జెస్ట్ కాలేరు. ముఖ్యమైన కారణం అక్కడి పరిసరాలు. అక్కడి కృత్రిమ వాతావరణం! కారులోకి ఎక్కారంటే కొంత మందికి ఏసీల వాసన పడదు. త్వరగా వారు అనారోగ్యానికి గురవుతారు. ఇక హోటల్ గదుల్లో వాడే రూమ్ ఫ్రెష్‌నర్‌ల పరిస్థితీ ఇంతే. ఇక విమానంలో ప్రయాణించే వారికి జెట్‌లాగ్ వల్ల అలసట గురి కావడం సహజం. ఇలాంటి వారికి ఆరోమాథెరపీ ట్రావెల్ కిట్ కచ్చితంగా కావాల్సిందే. ఇందులో సహజంగా తయారుచేసిన నూనెల వల్ల మీ చుట్టూ ఉండే గాలి ఆహ్లాదంగా మారుతుంది. ఈ నూనెలు ఏ మాత్రం అనారోగ్యం కలిగించేవి కావు. ఈ కిట్ ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటుంది.

కనువిందు చేసే కన్యాకుమారి




బంగాళాఖాతం, అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం... ఈ మూడింటి సౌందర్యాలను ఒకే చోట చూడాలంటే సాధ్యమేనా? కన్యాకుమారి వెళితే సాధ్యమే! అక్కడ సాయంసంధ్యలో సముద్రపు అందాలు పర్యాటకులకు మధురానుభూతులను అందిస్తాయి. రొమాంటిక్ హాలీడే కావాలంటే వీకెండ్‌లో కన్యాకుమారి ప్లాన్ చేసుకోండి. ఉత్తరాన ఉన్న హిమాలయాలు మంచుతో మంత్రముగ్ధుల్ని చేస్తే, దక్షిణాన కన్యాకుమారి సముద్రపు అందాలతో కట్టిపడేస్తుంది. సముద్రానికి అభిముఖంగా ఉండే ఈ పట్టణం అందమైన ఆలయాలు, మెమోరియల్స్, బీచ్‌లతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంటుంది. ఇక్కడ చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ తమ జీవితకాలంలో ఒక్కసారైనా సందర్శించి తీరాల్సిన ప్రదేశం ఇది. కన్యాకుమారి అనగానే ముందుగా మదిలో మెదిలేది ఈ ప్రదేశమే. సముద్రంలో 400 మీటర్ల లోపల ఉండే ఈ మెమోరియల్‌ను రాతిపై నిర్మించారు. ఇక్కడి నుంచి సాయంత్రం వేళ సముద్రపు అందాలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. శ్రీపాదమండపంలో స్టడీహాల్, మ్యూజియం ఉంటాయి. వివేకానంద మండపం ఆధ్యాత్మిక ప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంది. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తెరిచి ఉంచుతారు. ఒక్కొక్కరికి ప్రవేశరుసుం రూ.20.

చెక్కుచెదరని కట్టడం



ఎత్తయిన భవనం.. అందమైన కళారూపాలతో ఆహ్వానించే సింహ ద్వారం.. మయసభను తలపించే ప్రధాన హాలు.. పద్మవ్యూహాన్ని తలదన్నే నిర్మాణ కౌశలం వెరసి ఆ భవంతి మైసూర్ ప్యాలెస్‌ను తలపిస్తుంది. దశాబ్దాల చరిత్ర ఉన్న ఆ అద్భుత నిర్మాణం పేరు గంధర్వ మహల్. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో ఉన్న గంధర్వ మహల్ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. గంధర్వ మహల్‌ను చూడగానే కళలను ఆరాధించే ఏ మహారాజో ముచ్చటపడి కట్టించుకున్నాడని అనిపిస్తుంది. కానీ, ఓ జమీందారు కలల సౌధం ఇది. ఆచంటకు చెందిన గొడవర్తి నాగేశ్వరరావు గ్రామంలో ఓ అందమైన భవనం నిర్మించాలని అనుకున్నాడు. 1916లో రాజస్థాన్‌కు వెళ్లి అక్కడి కోటలను, భవనాలను పరిశీలించాడు. ఆ తర్వాత రెండేళ్లకు అంటే 1918లో గంధర్వ మహల్ నిర్మాణం పనులు మొదలయ్యాయి. 1924 నాటికి మహల్ నిర్మాణం పూర్తయింది. గంధర్వ మహల్ నిర్మాణంలోనే ఎన్నో విశేషాలు ఉన్నాయి. అప్పట్లోనే దీన్ని కట్టడానికి రూ.10 లక్షలు ఖర్చయ్యాయట. భవన నిర్మాణానికి కలప బర్మా నుంచి తెప్పించారు. ఇనుప దిమ్మెలను లండన్ నుంచి ఓడల ద్వారా చెన్నై తీసుకొచ్చి.. అక్కడి నుంచి ఆచంట చేర్చారట. కోడిగుడ్లు, గానుగ సున్నంతో కలిపి దీన్ని నిర్మించారు. అందుకే ఈ శతాబ్ది భవనం నేటికీ ఎక్కడా చెక్కుచెదరలేదు. గంధర్వ మహల్ పూర్తయ్యేనాటికి ఆచంటలో విద్యుత సదుపాయం లేదు. అయితే విదేశాల నుంచి జనరేటర్లు తెప్పించి మరీ మహల్ మొత్తం విద్యుత దీపకాంతుల్లో మెరిసిపోయేలా చేశారట భవన యజమాని.

ట్రావెలింగ్ సెక్యూరిటీ



ఆహ్లాదంగా, సంతోషంగా ట్రావెలింగ్ చేస్తున్న సమయంలో ఫలానా చోట ఉన్నామని సెల్ఫీలు ఫేస్‌బుక్, ట్విటర్‌లో షేర్ చేయటం మంచిది కాదంటున్నారు నిపుణులు.సెల్ఫీ తీసుకుని ఫలానా చోట ఉన్నామని ఫేస్‌బుక్‌లో షేర్ చేస్తే, అదే ఫేస్‌బుక్‌తోనే మీ బలహీనతలపై దెబ్బకొట్టవచ్చు. కొందరు పదిరోజులు ఉంటాం అంటూ ఎమోషన్‌తో ఎఫ్బీలో షేర్ చేస్తుంటారు. ఇలాంటప్పుడు సోషల్ వెబ్‌సైట్స్‌లో మిమ్మల్ని గమనించేవారు.. మొదట మీ ఇంటిగురించి ఆరాతీయటం, ఆ తర్వాత లూటీ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇలా టెక్నాలజీని ఆధారం చేసుకుని కొందరు దొంగలు రెచ్చిపోవటం లేటెస్ట్ ట్రెండ్‌గా మారింది. అందుకే ఫేస్‌బుక్‌లో మీరున్న లొకేషన్ వివరాలు, ఫొటోలు షేర్ చేయకపోవటమే మంచిది. కేఫ్‌ల్లోకి వెళ్లి వైఫైలో లాగిన్ అయినపుడు జాగ్రత్తగా ఉండాలి. ఇతర వైఫైల్లో మీ వ్యక్తిగత వివరాలు, స్నేహితులకు మీ క్రెడిట్ కార్డుల వివరాలు, లాగిన్, పాస్‌వర్డ్‌లను వాట్స్‌ప్‌లో షేర్ చేయకూడదు. ఇలా చేస్తే సులువుగా ఆన్‌లైన్ మోసాలు జరుగుతాయి. వీటితో పాటు బ్యాంక్ అకౌంట్స్ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ఏటీఎమ్ కార్డుల్లో సొమ్ము గల్లంతు కావొచ్చు.

అక్కడి సరస్సులు 'లాహిరి లాహిరి' అంటూ ప్రేమజంటలు పాటలు పాడుకునేంతగా ఆహ్లాదం కలిగిస్తాయి. కొత్తగా పెళ్లయిన వారు హనీ మూన్‌కి వెళ్లాలంటే ఇదే సరైన ప్రాంతం. ఎటు చూసినా కొత్త జంటల మనసును కొల్ల గొట్టేంత హాయిని గొలిపే పచ్చదనాలే. ఆహ్లాదంతో పాటూ మరోవైపు ఇది వ్యాపారానికి ప్రసిద్ధి. అలాగే సంస్కృతికి పేరెన్నికగల ప్రాంతమూ కొల్లాం. ప్రాచీనకాలం నుంచి ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలు నిర్వహిస్తోంది. భారతదేశం లోనూ వివిధ ప్రాంతాలతోనూ వ్యాపార భాగస్వామ్యం పంచుకుంటోంది తీరాన్ని ఆనుకుని ఉన్న కొల్లాం. ఇంతకూ ఇది 'కాజుకా కొల్లాం..!' ఎలా అయింది? అక్కడి ఆహ్లాదభరిత ప్రదేశాలు చూసొద్దాం పదండి...



అంతా ఆహ్లాదమే!

కొల్లాం కేరళ రాష్ట్రంలోని పేరొందిన తీరప్రాంతం. ఇక్కడ జీడిపప్పు (కాజు)ను అధికంగా పండిస్తారు. దేశంలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో జీడిపప్పు ఉత్పత్తి కొల్లంలోనే. దీనివల్లే 'కాజుకా కొల్లాం' (జీడిపప్పు నగరం) అనే పేరు పడిపోయింది. జీడిపప్పును పండించడమే కాదు.. ఎగుమతికీ ఈ ప్రాంతం ప్రసిద్ధి. ఇంకా ఇది నార పరిశ్రమకూ పెట్టింది పేరు. నారను ఉత్పత్తిచేసి, దీనిద్వారా తయారుచేసే వస్తు తయారీలో వందల ఏళ్ల నుంచి కొల్లాం అగ్రస్థానంలో ఉంది.

అష్టముడి సరస్సులో హౌస్‌బోట్

బీచ్‌లు.. పార్క్‌లు.. ద్వీపాలు.. సరస్సులు.. ఆలయాలు.. రిసార్టులు.. ఇలా చెప్పుకుంటూ పోతే కొల్లాంలో కోకొల్లలు. వీటితోపాటు రుచికరమైన సముద్ర ఆహారాలు యాత్రికులను నోరూరిస్తాయి. విభిన్నమైన పర్యాటకం కావాలంటే కొల్లాం వెళ్లాల్సిందే. ఇది ఎంతో చక్కటి టూరింగ్ స్పాట్ మరి. కొల్లాంను సందర్శించే పర్యాటకులు తప్పకుండా అష్టముడి సరస్సును చూసి తీరాల్సిందే! సరస్సులోని విహారం, ఏపుగా ఎదిగిన పచ్చని కొబ్బరిచెట్లు, తాటిచెట్ల మధ్య ఆహ్లాదకరంగా మనసు ఊగుతూ తూగుతూ సాగుతుంది కొల్లాం పర్యాటకం. అష్టముడి సరస్సులో పడవ ప్రయాణం ఓ మధురానుభవం. అక్కడికి వెళ్లిన ఎవరైనా ఆ పడవ ప్రయాణం చేయకుండా తిరిగిరారు. అయితే మన బడ్జెట్‌ను.. సానుకూలత బట్టి హౌస్‌బోట్‌లను ఎంపిక చేసుకోవాలి. బోట్ ఏదైనా అష్టముడిలో విహరిస్తే వచ్చే మజానే వేరు.









తేవళ్లి ప్యాలెస్-మన్రో ద్వీపం

కొల్లాం పట్టణానికి సరిగ్గా 25 కిలోమీటర్ల దూరంలో ఉంది తేవళ్లి ప్యాలెస్. ఇది ఒక వారసత్వ భవనం. దీని నిర్మాణం బ్రిటీష్, పోర్చుగీస్, డచ్ నిర్మాణశైలిని పోలి ఉంటుంది. పర్యాటకుల్ని విపరీతంగా ఆకట్టుకుంటుంది. అష్టముడి సరస్సు నుంచి హౌస్‌బోట్ పడవల్లో ప్రయాణించి, ఇక్కడకు చేరుకోవచ్చు. ఇక మన్రోదీపం గురించి చెప్పాలంటే.. ఇది కొల్లాం పట్టణానికి 27 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఒక ద్వీపం. ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే ఎనిమిది చిన్న ద్వీపాల సమూహం. వివిధ రకాల పక్షులకు ఇది ఆలవాలం ఇక్కడ చేపలు పట్టడం పర్యాటకుల్ని బాగా ఆకట్టుకునే విషయం. ద్వీపంలో లెక్కకు మించి చారిత్రక ఆలయాలు, చర్చిలు ఉంటాయి.

కొల్లాం బీచ్

కొల్లాంకు రెండు కిలోమీటర్ల దూరంలో అందాలొలికే అలలతో మెత్తటి ఇసుకతో కనిపించే బీచ్ ఉంది. దీన్ని కొల్లాం బీచ్ అనే కాకుండా 'మహాత్మాగాంధీ బీచ్' అని కూడా పిలుస్తారు. ఈ బీచ్‌లో ఇసుకతీరాలు చూసి మయమరచి పోవాల్సిందే. సందర్శకులు సాయంత్రం వేళల్లో ఇక్కడకు వచ్చి సేద తీరుతారు. ఇక్కడ వాతావరణం ప్రశాంతంగా, నిర్మలంగా ఉండటంతో స్థానికులు పరిసరాల్లో నిత్యం తిరుగుతూ కనిపిస్తారు. బీచ్ ఒడ్డునే ఉండే హోటళ్లు.. రిసార్ట్‌లు.. పర్యాటకులను ఆకట్టుకోవడమే కాకుండా, మంచి టేస్టీ ఫుడ్‌తో ఊరిస్తాయి. ఇక ఇక్కడ పేరుగాంచిన మరో సరస్సు సస్తంకొట్ట సరస్సు. కొల్లాంకి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. పడవ ప్రయాణ సౌకర్యాలలో పర్యాటకుల్ని ఆకర్షించడం ఈ సరస్సు ప్రత్యేకత కలది.







అమృతపురి-మయ్‌నాడ్

వలికావు ప్రాంతంలోని అమృతపురి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం. ఈ ప్రాంతంలో ఆశ్రమాలు, విద్యాసంస్థలు, రీసెర్చ్ సెంటర్లు వంటి సౌకర్యాలున్నాయి. కొల్లాం నుంచి పడవల్లో అమతపురి చేరుకోవచ్చు. మయ్‌నాడ్ గ్రామం కొల్లాంకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. సుబ్రహ్మణ్యస్వామి గుడి ఇక్కడ ప్రధాన ఆకర్షణ. అరేబియా సముద్రంలో చేపలు పట్టే తీరు ఇక్కడి పర్యాటకులను 'వావ్' అనిపించక మానదు. వీటితోపాటు చారిత్రక స్థూపాలున్న ఓచిర, రామేశ్వరగుడి, కురునాగప్పల్లి వంటి ప్రముఖ ప్రాంతాలు ఉన్నాయి.

ఎలా చేరుకోవాలి?

విజయవాడ, హైదరాబాద్ నుంచి కేరళ చేరుకొని వెళ్లొచ్చు. అలా కుదరకపోతే కొల్లాం గుండా మూడు జాతీయ రహదారులు ఉన్నాయి. చెన్నై, తిరువనంతపురం, కొచ్చిన్, కన్యాకుమారి, కోయంబత్తూర్, పుదుచ్చేరి, కొట్టాయం, ఎర్నాకులం నుంచి నిత్యం బస్సులు కొల్లాంకు నడుస్తుంటాయి. అదే రైలుమార్గం నుంచి అయితే చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం, కొచ్చిన్ నుంచి రైళ్లు ఉన్నాయి.

అడ్వెంచర్ పార్క్-అచెంకాయిల్ ఫాల్స్

కొల్లాం పట్టణానికి సరిగ్గా మూడు కిలోమీటర్ల దూరంలో అష్టముడి సరస్సు ఒడ్డున ఉన్న అడ్వెంచర్ పార్క్ పిల్లలకే కాదు పెద్దలకూ వివిధ రకాల క్రీడలతో అలరిస్తోంది. ఇక్కడ బోట్‌లు అద్దెకు ఇస్తారు. వాటిని తీసుకొని 48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్క్‌లో తిరుగాడుతూంటే మనస్సు తుళ్లిపడాల్సిందే. ఇక్కడ పెయింటింగ్‌లతో కూడిన మ్యూజియం ముచ్చటగొలుపుతూ భలే ఆకట్టుకుంటుంది. దట్టమైన అడవులు, ఆలయాలు, జలపాతాలు ఉండే అచెంకాయిల్ కొల్లాంకు 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ అయ్యప్పస్వామి ఆలయం ప్రధానాకర్షణ. ఆలయానికి దగ్గర్లోని కుంభవురుట్టి జలపాతం, మనలార్ జలపాతం రెండూ సందర్శకులను కనువిందు చేస్తాయి.



రెండు కొండలను కలిపారు

చైనాలోని హునాన్ రాష్ట్రంలో నిర్మించిన ఓ వంతెనతో ప్రపంచంలో అద్భుత కట్టడాల నిర్మాణాలలో తమకెవరూ సాటిలేరని మరోసారి నిరూపించింది ఆ దేశం. ఈ విషయంలో ఆకాశపు హద్దులనూ చెరిపేస్తూ వినువీధుల్లోకి దూసుకెళుతోంది. రెండు పర్వతాలను కలుపుతూ ప్రపంచంలోనే అతి పొడవైన, అతి ఎత్తయిన స్టీల్ సస్పెన్షన్ రోడ్డు వంతెనను నిర్మించింది. హునాన్‌లో అత్యధికంగా పర్వతాలు ఉండడంతో ట్రాఫిక్ మందగమనంతో నడుస్తున్న నేపథ్యంలో ఇలాంటి వంతెనలను నిర్మించామని ప్రకటించారు. అంతేకాదు, ఈ వంతెన మీద నుంచి బాటసారులు వెళ్లేందుకూ మార్గం ఏర్పాటు చేశారు. పచ్చటి చెట్లతో కనువిందుచేసే అందమైన డెహాంగ్ క్యాన్‌హాన్ లోయను తిలకిస్తూ, వంతెన మీదుగా వెళ్లవచ్చు. గతేడాది పూర్తయిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు ప్రపంచవ్యాపితంగా మంచి గుర్తింపు పొందింది. ప్రయాణికుల సౌకర్యార్థం వంతెనపై 1888 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీనిని 2007లో ప్రారంభించారు. మొత్తం 3,858 అడుగుల పొడవు, 1,102 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ వంతెన 'గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్'లోకి కూడా ఎక్కింది.

మనం స్పోర్ట్స్
గురువారం 15 ఫిబ్రవరి 2018
www.manamnews.com

చరిత్ర సృష్టించడం గొప్ప అనుభూతి : కోహ్లీ

పోర్ట్ ఎలిజబెత్: సౌతాఫ్రికాపై ఐదో వన్డేలో గెలిచి సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకున్న జట్టు సహచరులను టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసించాడు. ఈ సిరీస్‌లో తమ జట్టు 'సంపూర్ణ ప్రతిభ' కనబరించిందన్నాడు. 'చరిత్ర సృష్టించినందుకు గొప్ప అనుభూతి కలిగింది. సహచరులు నిజంగా ప్రణాళికలకు కట్టుబడి ఉన్నారు. బ్యాట్‌తో, బంతితో, ఫీల్డింగ్‌లో అద్భుత ప్రతిబకనబరిచారు' అని కోహ్లీ అన్నాడు. గతంలో రోహిత్ శర్మ మూడుసార్లు సౌతాఫ్రికా పర్యటనకు వచ్చాడు. కానీ తొలిసారి సెంచరీ (115) చేశాడు. దీంతో టీమిండియా ఐదో వన్డేలో 73 పరుగులతో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. 13 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోవడంతో టీమిండియా నిర్దేశించిన 275 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో సౌతాఫ్రికా అవకాశాలు క్షీణించాయి. జేపీ డుమిని, ఏబీ డివిలియర్స్ వంటి కీలక వికెట్లను హార్దిక్ పాండ్యా పడగొట్టి సౌతాఫ్రికాను కోలుకోలేని దెబ్బ తీశాడు. అయితే తమ బ్యాటింగ్ ఆశించిన స్థాయిలో లేదని సౌతాఫ్రికా తాత్కాలిక కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ అన్నాడు. ఇదిలావుంటే ఈ సిరీస్‌ను 5-1తో గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నామని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు.

లోపాలను ఎత్తిచూపింది : ఒట్టిస్ గిబ్సన్

పోర్ట్ ఎలిజబెత్: మానసికంగా క్రుంగిపోయిన తమ జట్టులో దాచేందుకు ఏదీ లేదని.. తమలోని లోపాల ను టీమిండియా ఎత్తి చూపిందని సౌతాఫ్రికా జట్టు కోచ్ ఒట్టిస్ గిబ్సన్ అన్నారు. మంగళవారమిక్కడ జరిగిన ఐదో వన్డేలో టీమిండి యా 73 పరుగులతో సౌతాఫ్రికాను సొంత గడ్డపై ఓడించి తొలిసారి సిరీస్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో ఆరు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో కోహ్లీ సేన 4-1తో నిలిచింది. 'ముగ్గురు అత్యుత్తమ ఆటగాళ్లు జట్టుకు దూరమైతే.. ఆ జట్టుకు తప్పక ఇబ్బందులకు గురవుతుంది. అందులోనూ టీమిండియా లాంటి బలమైన జట్టుపై గెలవడం చాలా కష్టం. కార ణాలు వెతకకుండా అత్యుత్తమ ప్రతిభ కనబరిచేందుకు ప్రయ త్నించమని ముందుగానే వాళ్లకు డ్రెస్సింగ్ రూమ్‌లో చెప్పాను. ఎందు కంటే మేము పిల్లలం కాదు. అయితే ఈ సిరీస్ ఓటమి మాకు ఎన్నో ఆలోచనలను రేకెత్తిం చింది. నిజానికి మేము వచ్చే ఏడాది వరల్డ్ కప్‌పై దృష్టి పెట్టాం. కానీ ఇటువంటి జట్టుతో వరల్డ్ కప్‌లో పాల్గొనలేం' అని గిబ్సన్ అన్నారు.

నంబర్ వన్ ర్యాంక్ మనదే

దుబాయ్: సౌతాఫ్రికా గడ్డపై చారిత్రాత్మక సిరీస్‌ను కైవసం చేసుకున్న కోహ్లీ సేన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన ఐదో వన్డేలో టీమిండియా 73 పరుగులతో సౌతాఫ్రికాను ఓడించిన సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో 122 పాయింట్లతో టీమిండియా స్పష్టమైన ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు సిరీస్‌ను కోల్పోయిన సౌతాఫ్రికా జట్టు 121 నుంచి 118 పాయింట్లకు పడిపోయి రెండో స్థానంలో నిలిచింది. ఈ సిరీస్‌ను టీమిండియా 119 పాయింట్లతో అంటే సౌతాఫ్రికాకు 2 పాయింట్ల తేడాతో ప్రారంభించింది. ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్‌ను సాధించాలంటే ఈ ఆరు మ్యాచ్‌ల సిరీస్‌ను కనీసం 4 విజ యాలు సాధించాల్సి ఉండింది. 1992 తొలి పర్యటన తర్వాత ఏ ఒక్క ఫార్మాట్‌లో భారత పురుషుల జట్టు సౌతాఫ్రికాలో సిరీస్ గెలవలేదు. 2006లో ఏకైక టీ20 మ్యాచ్‌ను టీమిండియా గెలిచింది.



కుల్‌దీప్



చాహల్

ప్రపంచ క్రికెట్‌లో కోహ్లీ సేన ఓ కొత్త చరిత్రను రాసింది. ఉపఖండంలోని పిచ్‌లపై కాదు.. విదేశీయులకు ఏమాత్రం సహకరించని సౌతాఫ్రికా గడ్డపై. దీంతో 26 ఏళ్ల నిరీక్షణ ఫలించినట్టయింది. సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కింది. సొంత గడ్డపై తిరుగులేని జట్టుకు ఇన్నాళ్లూ వారిజిల్లిన సౌతాఫ్రికాను కోహ్లీ సేన దెబ్బ తీసింది. తొలిసారి కోహ్లీ సేన వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. సౌతాఫ్రికాకు వెళ్లిన ప్రతిసారీ టీమిండియా ఘోరంగా ఓడిపోవడమో లేదా గెలుపు దగ్గరగా వచ్చి చేజార్చుకోవడమో జరిగేది.

వరుసగా మూడు వన్డేలు గెలిచిన కోహ్లీ సేన నాలుగో వన్డేలో ఓడిపోవడంతో మళ్లీ పాత కథే పునరావృతమవుతుందేమో అని అనుకున్నారంతా. కానీ ఐదో వన్డేలో అనూహ్య విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. టెస్టు సిరీస్‌లో ఘోర పరాజయాలను చవిచూడ డంతో తీవ్ర మానసిక వేదనకు గురైన భారత అభిమానులు ఈ వన్డే సిరీస్ గెలుపుతో ఆ బాధను మర్చిపోయారు. అయితే ఈ ఘనత అంతా మణికట్టు స్పిన్నర్లదే.

చరిత్రకారులు

మణికట్టు స్పిన్నర్లదే ఈ ఘనత

తొలిసారి సౌతాఫ్రికాలో వన్డే సిరీస్ గెలిచిన కోహ్లీ సేన

(క్రీడావిభాగం)

ప్రపంచ క్రికెట్‌లోని ఓ పాత చరిత్రను కోహ్లీ సేన తిరగరాసింది. సొంత గడ్డపై బలమైన జట్టుగా పేరొందిన సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌ను గెలిచి ప్రపంచ క్రికెట్‌ను అబ్బురపరిచింది. మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన ఐదో వన్డేలో టీమిండియా 73 పరుగులతో సౌతాఫ్రికాపై సంచలన విజయం సాధించి చరిత్ర పుటల్లోకెక్కింది. 1992 తర్వాత సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లిన పురుషుల జట్లలో ఏ ఒక్క జట్టూ.. ఏ ఒక్క ఫార్మాట్‌లోనూ సిరీస్ గెలవలేదు. దీంతో సౌతాఫ్రికాలో సిరీస్ గెలిచిన ఘనత కోహ్లీ సేనకు దక్కింది. మహ్మద్ అజారుద్దీన్ గానీ, సచిన్ టెండూల్కర్ గానీ, సౌరవ్ గంగూలీ గానీ, రాహుల్ ద్రవిడ్ గానీ, చివరికి మహేంద్ర సింగ్ ధోనీ గానీ సాధించని రికార్డును కోహ్లీ సేన సాధించింది.

ఈ జట్టు పేర్లు సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయి. డర్బన్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో 6 వికెట్లతో, సెంచూరియన్‌లో జరిగిన రెండో వన్డేలో 9 వికెట్లతో, కేప్‌టౌన్‌లో జరిగిన మూడో వన్డేలో 124 పరుగులతో గెలిచిన టీమిండియా.. శనివారం వర్షం అంతరాయం కలిగించిన నాలుగో వన్డేలో ఓటమిపాలైంది. ఈ వన్డే సిరీస్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రతిభ, కృషి అనన్యసామాన్యం. ఐదు ఇన్నింగ్స్‌లలో అతను 429 పరుగులు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ ఉడడం విశేషం. అయితే మణికట్టు స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ సిరీస్ ఆరంభం నుంచి తమ స్పిన్ మాయాజాలంతో ప్రొటీస్‌కు చెమటలు పట్టించారు. టీమిండియా స్పిన్ బౌలింగ్ అంటేనే వణికిపోయేలా చేశారు. ఈ ఐదు మ్యాచ్‌ల్లో కుల్‌దీప్ 16, యజ్వేంద్ర చాహల్ 14 వికెట్లు తీసుకున్నారు. సౌతాఫ్రికాను సొంత గడ్డపై ఓడించడంలో మణికట్టు స్పిన్నర్లు కీలకపాత్ర పోషించారు. ఈ ఘనత అంతా స్పిన్నర్లదే. 1992 నుంచి ఇప్పటి వరకు టీమిండియా ఆరుసార్లు సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లింది. తొలి సిరీస్‌లో సౌతాఫ్రికా 5-2తో గెలిచింది. తర్వాత 1996-97లో టీమిండియా 0-4తో ఓటమిపాలైంది. 2000-01లో కెన్యా కూడా పాల్గొన్న ముక్కోణపు సిరీస్‌లో టీమిండియా ఫైనల్లో ఓటమిపాలైంది. 2006-07లో 0-4తో, 2010-11లో 2-3తో, 2013-14తో 0-2తో పరాజయం పాలైంది. 2003 ఐసీసీ వరల్డ్ కప్‌లో సౌరవ్ గంగూలీ నేతృత్వంలోని టీమిండియా ఫైనల్‌కు చేరుకున్నప్పటికీ రికీ పాంటింగ్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. 2009లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో ఎంఎస్ ధోనీ నేతృత్వంలోని మెన్ ఇన్ బ్లూ నాకౌట్ దశకు ముందే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇలా ఓడిపోయింది.. ఓడిపోయింది.. ఓడిపోయింది.. అన్న మాటలు విని విని బేజారెత్తిన భారత అభిమానులకు సౌతాఫ్రికాలో కోహ్లీ సేన సిరీస్ గెలిచిందన్న వార్త ఎనలేని సంతోషాన్నిచ్చింది. ప్రేమికుల రోజున ఈ వార్త తెలియడంతో యువతీ యువకులు మరింత ఉత్సాహంతో వాలెంటైన్స్ డేను జరుపుకున్నారు. తొలుత ఫాఫ్ డు ప్లెసిస్, క్వింటన్ డికాక్ ఆ తర్వాత ఏబీ డివిలియర్స్ వంటి టాప్ ప్లేయర్స్ ఉన్న సౌతాఫ్రికాను టీమిండియా ఓడించి శెభాష్ అనిపించుకుంది.

ఇప్పటి వరకు జరిగిన ఐదు వన్డేల్లో కుల్‌దీప్, చాహల్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ప్రొటీస్ బ్యాట్స్‌మెన్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగో వన్డేలో సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ భారత మణికట్టు స్పిన్నర్లను ధీటుగా ఎదుర్కొన్నట్టు కనిపించారు.



ఆ మ్యాచ్‌లో గెలుపు ధైర్యంతో ఐదో వన్డేలో టాస్ గెలిచినా ఫీల్డింగ్ ఎంచుకున్నారు. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీ 274 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌతాఫ్రికా 201 పరుగులకు ఆలౌటైంది.

స్పిన్నర్ల రికార్డును బద్దలు కొట్టిన కుల్‌దీప్, చాహల్

సౌతాఫ్రికాలో విదేశీ స్పిన్నర్ల రికార్డును భారత మణికట్టు స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ బద్దలు కొట్టారు. సౌతాఫ్రికాలో ఆడిన ద్వైపాక్షిక సిరీస్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన విదేశీ స్పిన్నర్లుగా రికార్డుల్లోకెక్కారు. 1998-99 సీజన్‌లో ఆడిన ఏడు వన్డేల్లో 12 వికెట్లు తీసిన వెస్టిండీస్ ఆల్ రౌండర్ కీర్ ఆర్థర్టన్ రికార్డును కూడా భారత మణికట్టు స్పిన్నర్లు బద్దలు కొట్టారు. ఈ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లకే కుల్‌దీప్ యాదవ్ 16, యజ్వేంద్ర చాహల్ 14 వికెట్లు తీశారు. తొలుత విండీస్ దిగ్గజం రికార్డును చాహల్ బద్దలు కొట్టినట్టయింది. పోర్ట్ ఎలిజబెత్‌లో సౌతాఫ్రికాతో జరిగిన ఐదో వన్డేలో పెహ్లువాయోను అవుట్ చేయడంతో కుల్‌దీప్‌కు 13వ వికెట్ లభించింది. ఆ తర్వాత కుల్‌దీప్ నాలుగు వికెట్లు తీసి ఈ సిరీస్‌లో 16 వికెట్లతో నిలిచాడు. మరోవైపు 27 ఏళ్ల చాహల్ కూడా ఈ సిరీస్‌లో సక్సెస్‌ఫుల్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఐదో వన్డేలో తొలుత డేవిడ్ మిల్లర్‌ను ఎల్‌బిడబ్ల్యూగా అవుట్ చేయడంతో చాహల్‌కు 13వ వికెట్ లభించినట్టయింది. కానీ కుల్‌దీప్ సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను బురిడీ కొట్టించి ఇన్నింగ్స్‌కు ఐదు వికెట్ల ఘనత సాధించాడు.

తొలుత 2 వికెట్లు తీసిన చాహల్ మ్యాచ్ ముగిసే సమయానికి కెరీర్ అత్యుత్తమ 5/22 బౌలింగ్ ఫిగర్స్‌ను సాధించాడు. ఇంతకుముందు 2004-05 సీజన్‌లో జరిగిన ఏడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఇంగ్లండ్‌కు చెందిన కబీర్ అలీ 13 వికెట్లు, 2008-09లో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ జాన్సన్ 13 వికెట్లు, 2001-02లో జరిగిన ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియాకే చెందిన జాసన్ గిల్లెస్పీ 12 వికెట్లు తీశారు. ఇంగ్లండ్‌కు చెందిన ఫాస్ట్ బౌలర్ డారెన్ గఫ్ మూడు సీజన్లలో (199596, 1999-00, 2004-05) 11 వికెట్లు తీశాడు.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును...

భార్యకు అంకితమిచ్చిన రోహిత్

పోర్ట్ ఎలిజబెత్: ప్రపంచం యావత్తు బుధవారం ప్రేమికుల రోజును (వాలెంటైన్స్ డే) ఎంజాయ్ చేశారు. అయితే ప్రేమికుల రోజును రోహిత్ శర్మ డిఫరెంట్‌గా సెలబ్రేట్ చేసుకున్నాడు. సౌతాఫ్రికాతో ఐదో వన్డేలో లభించిన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును భార్య రితిక సజ్‌దేకు రోహిత్ అంకితమిచ్చాడు. తాను అందుకున్న అవార్డు ఫొటోను పోస్ట్ చేస్తూ 'హ్యాపీ వాలెంటైన్స్ డే రిట్స్' అంటూ రాశాడు. భార్య పట్ల తన ప్రేమను రోహిత్ చాటు కోవం ఇదేం తొలిసారి కాదు. గత డిసెంబర్‌లో శ్రీలంకపై సాధించిన డబుల్ సెంచరీని పెళ్లి రోజు కానుకగా రితికకు రోహిత్ అంకితమిచ్చాడు.



విదేశాల్లో మాకిది అతిపెద్ద విజయం: శర్మ

విదేశాల్లో తమకిది అతిపెద్ద వన్డే విజయమని టీమిండియా వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. సౌతాఫ్రికాతో భాగంగా మంగళవారమిక్కడ జరిగిన ఐదో వన్డేలో టీమిండియా 73 పరుగులతో గెలిచి ఆరు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. చివరి మ్యాచ్ శుక్రవారం సెంచూరియన్‌లో జరుగుతుంది. 'ఖచ్చితంగా.. విదేశాల్లో మాకిది అతిపెద్ద వన్డే విజయం. ఇది శుభపరిణామం. ఎందుకంటే అది ద్వైపాక్షిక సిరీస్. ఈ సిరీస్ కంటే ముందు 2007-08లో ఆస్ట్రేలియాలో జరిగిన సీబీ ముక్కోణపు సిరీస్ గెలిచాం. ఆ సిరీస్‌లోనూ గట్టి పోటీని ఎదుర్కొన్నాం. అయితే ఈ రెండింటినీ పోల్చడం చాలా కష్టం. సౌతాఫ్రికాతో సిరీస్ చాలా ప్రాముఖ్యమైందని భావిస్తున్నాను. తొలి వన్డే నుంచి మేము ఈ సిరీస్‌లో ఆధిక్యత ప్రదర్శించాం. ఫలితాన్ని మీరందరూ చూశారు' అని రోహిత్ అన్నాడు.

మలేసియా షట్లర్లపై

ఫిక్సింగ్ ఆరోపణలు

దర్యాప్తుకు బీడబ్ల్యూఎఫ్ ఆదేశం

కౌలాలంపూర్: మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మలేసియా బ్యాడ్మింటన్ షట్లర్లపై దర్యాప్తు చేసేందుకు బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) ఆదేశించింది. ఈ షట్లర్లు తప్పు చేశారని తేలితే వారిపై జీవితకాల నిషేధం పడే అవకాశముందని బీడబ్ల్యూఎఫ్ అధికారి ఒకరు చెప్పారు. రెండేళ్ల క్రితం ఈ షట్లర్లు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ మలేసియా అధ్యక్షుడు నొర్జా జకారియా చెప్పారు. వారి పేర్లను వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. కానీ అందులో ఒకరు టాప్ జూనియర్ ప్లేయర్ అని మరొకరు ప్రతిష్టాత్మక థామస్ కప్‌లో పాల్గొన్నాడని మలేసియాకు చెందిన 'ది స్టార్' దినపత్రిక పేర్కొంది. ఇటువంటి నీచమైన పనులను ఏమాత్రం సహించబోమని.. ఇది బ్యాడ్మింటన్ ప్రతిష్టను దిగజారుస్తుందని జకారియా అన్నారు. దీనిపై స్పందించేందుకు బీడబ్ల్యూఎఫ్ నిరాకరించింది.

వరల్డ్ లెవెన్‌తో వెస్టిండీస్ పోరు

కరేబియన్ క్రికెట్ గ్రౌండ్స్ పునరుద్ధరణకు ఏకైక టీ20



లార్డ్స్: ఇటీవలి తుఫానులు ఇర్మా, మారియా వెస్టిండీస్‌లోని క్రికెట్ గ్రౌండ్స్ జేమ్స్ రొనాల్డ్ వెబ్‌స్టర్ పార్క్, విండ్సర్ పార్క్ స్టేడియంలను పూర్తిగా నాశనం చేశాయి. వీరి పునరుద్ధరణకు నిధుల సేకరణ కోసం రెస్టాఫ్ ది వరల్డ్ లెవెన్‌తో వెస్టిండీస్ జట్టు ఏకైకా టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో మే 31న లార్డ్స్‌లో జరగనుంది. ఓ మంచి కారణంగాతో నిర్వహించి తలపెట్టిన ఈ మ్యాచ్‌కు ఐసీసీ కూడా అనుమతినిచ్చింది. మ్యాచ్ నిర్వహణకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు అంగీకరించింది. ఈ సందర్భంగా క్రికెట్ వెస్టిండీస్ (సీడబ్ల్యూఐ) అధ్యక్షుడు డేవ్ కామెరూన్ మాట్లాడుతూ.. 'హరికేన్లు ఇర్మా, మారియా తూర్పు కరేబియన్‌లోని చాలా ప్రాంతాలను నాశనం చేశాయి. వాటిని మళ్లీ పునరుద్ధరించేందుకు సీడబ్ల్యూఐ ఉత్తమ ప్రయత్నాలు చేస్తోంది. మ్యాచ్‌ను నిర్వహించేందుకు అంగీకరించిన ఎంసీసీ (మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్)కి కృతజ్ఞతలు. ముఖ్యంగా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు గైల్స్ క్లార్క్ తన దయార్ద్ర హృదయంతో మాకు అండగా నిలిచారు. ఈ మ్యాచ్ అభిమానులను రంజింప చేస్తుందని, గట్టి పోటీతో ఉత్కంఠ రేకెత్తిస్తుందని విశ్వసిస్తున్నాను. అంతేకాకుండా కావలసిన నిధులు రాబట్టేందుకు ఈ మ్యాచ్ ఉపకరిస్తుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

కగిసో రబాడాకు జరిమానా



దుబాయ్: సౌతాఫ్రికా పేస్ బౌలర్ కగిసో రబాడాకు జరిమానా పడింది. మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. పోర్ట్ ఎలిజబెత్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో శిఖర్ ధావన్‌ను అవుట్ చేసిన తర్వాత రబాడ కోపంతో కామెంట్ చేసినందుకు ఐసీసీ జరిమానా విధించింది. అంతేకాకుండా ఒక డిమెరిట్ పాయింట్ కూడా రబాడ ఖాతాలో చేరింది. సౌతాఫ్రికాతో ఐదో వన్డేలో ఈ ఘటన చోటు చేసుకుంది. ధావన్‌ను అవుట్ చేసిన తర్వాత బ్యాట్స్‌మెన్‌ను చూస్తూ రబాడ చెయ్యి ఊపాడు. అంతేకాకుండా 'బ్యాట్స్‌మన్ రియాక్టయితే ఫలితం ఇలాగే ఉంటుంది' అని కామెంట్ చేశాడు. దీంతో ఐసీసీ నిబంధనల్లోని ఆర్టికట్ 2.1.7ను రబాడ ఉల్లంఘించినట్టు ఐసీసీ నిర్ణయించింది. జరిమానాను రబాడ అంగీకరించాడు. ఈ డిమెరిట్ పాయింట్‌తో రబాడ ఐదు పాయింట్లకు చేరాడు. ఇలాగే వ్యవహరించి అతని డిమెరిట్ పాయింట్లు 8 లేదా అంతకంటే ఎక్కువైతే అతనిపై రెండు టెస్టులు లేదా ఒక టెస్టు.. రెండు వన్డేలు/టీ20లు లేదా నాలుగు వన్డేలు/టీ20లు అంటే అతనికి ముందుగా ఏది వస్తే దానిపై నిషేధం పడే అవకాశముంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.